
PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 11.10.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 19 పేజీలు : 12+4, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## ఢిల్లీని తాకిన...
# కరెంట్ షాక్!



భారతదేశ చరిత్రలో ఎన్నో ఉద్యమాలు వచ్చాయి. కాని సమైక్యాంధ్ర ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుంది. ఎందుకంటే ఇంతకుముందు జరిగిన ఉద్యమాలన్నీ ఒకెత్తు. ఆరోజు కరెంట్‌తో అవసరం లేదు. రవాణా సౌకర్యాలతో పెద్ద పనిలేదు. బ్యాంకులు అంత అవసరముండేవి కావు.

కాని ఇప్పుడు ప్రజాజీవనమంతా కూడా విద్యుత్, రవాణా వ్యవస్థలతో ముడిపడి వుంది. ప్రభుత్వ వ్యవస్థలు, బ్యాంకు వంటి సంస్థలతో అనుసంధానమై వుంది. ఒక గంట విద్యుత్ కోత విధిస్తేనే ఎన్నోరకాలుగా ఈ వ్యవస్థ స్థంభిస్తుంది. అలాంటిది ఏకథాటిగా రోజుల తరబడి కరెంట్‌కోతలతో ఉద్యమం నడుస్తూనేవుంది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు మూతపడి రెండు నెలలు దాటింది. విద్యా సంస్థలు రెండున్నర నెలలుగా సక్రమంగా నడవడం లేదు. రాజకీయపార్టీలు తమ స్వార్థప్రయోజనాలకు ఒకరోజు బంద్ చేస్తేనే ప్రజలు విసుక్కుంటారు. కాని ఇక్కడ ప్రజలే బంద్ చేస్తున్నారు. కాబట్టే 70రోజులుగా సీమాంధ్రలోని అన్ని సంస్థలు చేస్తున్న సమ్మె వల్ల తాము ఇబ్బందులు పడుతున్నా ప్రజలు వ్యతిరేకించడం లేదు. ఈ ఉద్యమాన్ని ఇంకా ఎన్నోరోజులు నడిపినా మద్దతుగా నిలిచేందుకే సిద్ధమవుతున్నారు. (మిగతా 5వ పేజీలో)

- పట్టు తగ్గని ఉద్యమం... మెట్టుదిగిన కేంద్రం
- కాంగ్రెస్‌ను చుట్టుముట్టిన విమర్శలు
- కాంగ్రెస్ నిర్వాకంపై విరుచుకుపడ్డ విపక్షాలు

## చావుకు...
# చేరువలో కాంగ్రెస్

- సొంతకాళ్లను నరుక్కుని జైపూరుకాళ్ల కోసం అగచాట్లు


పోయేకాలం దాపురిస్తే పెడబుద్ధులు పుడతాయంటారు. కాంగ్రెస్‌కు పోయే కాలం దగ్గరకొచ్చినట్లుంది. పెడబుద్ధులు పుట్టి కన్నూమిన్నూ కానక ప్రవర్తిస్తుంది. క్రమక్రమంగా ఒక్కో రాష్ట్రంలో పతనమవుతూ వస్తున్న కాంగ్రెస్‌పార్టీ ఆంధ్రప్రదేశ్ లోనూ ఆ దిశగా దిగ్విజయంగా అడుగులు వేస్తుంది.

ఏ ఆలోచనతో రాష్ట్ర విభజన నిర్ణయం తీసుకుందోగాని అడుగడుగునా దుర్బుద్ధి, దుర్మార్గంతోనే వ్యవహరిస్తుంది. రాష్ట్ర విభజనను పార్టీ సొంత వ్యవహారంలా చూస్తూ ప్రజల భావోద్వేగాలను విస్మరిస్తుంది. ప్రజాస్వామ్య దేశంలో ప్రజాందోళనలను ఏ మాత్రం పట్టించుకోకుండా రాజరికపు పోకడలతో నియంతృత్వపు విధానాలను అనుసరిస్తుంది. దేశంలో కాంగ్రెస్‌పార్టీ బలంగా వున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. అయితే జగన్ సొంత పార్టీ మూలంగా రాష్ట్రంలో ఇక తమ పార్టీకి భవిష్యత్ (మిగతా 5వ పేజీలో)

## లాయర్
### దసరా కానుక

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని "అష్టాదశ శక్తిపీఠాలు" ప్రత్యేక అనుబంధాన్ని రత్నం విద్యాసంస్థల సౌజన్యంతో ఈ వారం 'లాయర్' పాఠకులకు కానుకగా అందిస్తున్నాం.

సం/-





పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు

విజయదశమి శుభాకాంక్షలు.

-సం/-

# నెల్లూరు పరువు తీసేసిన దినేష్



నెల్లూరుజిల్లా నుండి ఎందరో మహానుభావులు అత్యున్నత పదవులు అలంకరించి జిల్లాకే ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు తెచ్చారు. దినేష్‌రెడ్డి మాత్రం అత్యున్నత పదవిని నిర్వహించి కూడా జిల్లాకు అప్రతిష్ఠ తెచ్చిపెట్టారు.

పదవుల కోసం వ్యక్తిత్వాలను వదులుకోకూడదు. వ్యక్తిత్వం అనేది ప్రాణంతో సమానం. దానిని వదులుకున్నామంటే దీనిని వదులుకున్నట్లే. రాజకీయ నాయకులకు పరిమితులు వుండవు. నైతిక విలువలు వుండవు. అవసరంకొద్ది వాళ్లు మాటలు మారుస్తుంటారు. కాని బాధ్యతాయుతంగా వ్యవహరించే అధికారుల పరిస్థితి అది కాదు. వారి మాటగాని, చేష్టలుగాని అధికారికంగా ముద్ర పడిపోతుంది.

ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిపై విశ్రాంత డీజీపీ, నెల్లూరీయుడైన వి.దినేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను రాష్ట్రంలో ఎక్కువశాతంమంది అసహ్యించుకుంటున్నారు. తన స్థాయిని దిగజార్చుకుంటూ దినేష్‌రెడ్డి చేసిన విమర్శలు డిజిపిగా ఆయన పనితీరునే ప్రశ్నిస్తున్నాయి. తన పదవీకాలాన్ని పొడిగించలేదనే అక్కసుతో




దినేష్‌రెడ్డి సీఎంపై పలు ఆరోపణలు చేసారు. సీఎంకు తెలంగాణ రావడం ఇష్టంలేదు, తెలంగాణ ఇస్తే నక్సలిజం పెరుగుతుందని నాతో చెప్పించారు. సీమాంధ్రప్రాంతంలో కేంద్ర బలగాలను దించడం సీఎంకు ఇష్టం లేదు. సమైక్యవాదుల పట్ల కఠినంగా వ్యవహరించిన అనంతపురం ఎస్పీని బదిలీ చేయమని సీఎం నాపై ఒత్తిడి తెచ్చారు. సీఎం తమ్ముడు సంతోష్‌రెడ్డి తన భూదందాలకు సహకరించాలని నన్ను బెదిరించారు. ఇవీ దినేష్‌రెడ్డి చేసిన ఆరోపణలు. డిజిపి లాంటి ఉన్నతాధికారికి సీఎంకు మధ్య జరిగే చర్చలు, నిర్ణయాలు ఎంతో రహస్యంగా వుండాలి. డిజిపిపై నమ్మకంతోనే సీఎం ఎన్నో విషయాలను ఆయనకు చెబుతుంటారు. అలాంటి విషయాలను బహిర్గతం చేసి దినేష్‌రెడ్డి తప్పుచేశారు. సీఎం ఏదైనా తప్పులు చేయమంటే వాటిని డిజిపి చేయకూడదు. అలా చేయకపోతే ఇంకో పోస్టులోకి బదిలీ చేస్తాడేమో! అంతేగాని ఉద్యోగాన్ని ఊడపీకరుగా! కాని పదవిలో వున్నప్పుడు డిజిపి ఈ విషయాలను బయటపెట్ట లేదంటే సీఎంతో రాజీపడ్డట్లేగా! అసలు దినేష్ రెడ్డికి డిజిపి పదవి (మిగతా 5వ పేజీలో)

PDF Compressor Free Version



• అధిష్టానానికి విధేయులు...

# ప్రజలకు విద్రోహులు





ప్రజలనే పునాదులమీదే పార్టీలైనా, ప్రభుత్వాలైనా ఏర్పడతాయి. ప్రజల ఓటుతోనే నాయకులకు పదవులైనా, ప్రభుత్వాధికారాలైనా! ప్రజాస్వామ్య వ్యవస్థలో పంచాయితీ వార్డు మెంబర్ నుండి ప్రధానివరకు ఏ పదవిలో వున్నవారైనా ప్రజలకే బాధ్యత వహించాలి. పార్టీలు టిక్కెట్లు ఇస్తాయేగాని గెలుపోటముల నివ్వవు. అలా గెలుపోటములను నిర్ణయించి రాజకీయ నాయకులకు పదవులిచ్చేది ప్రజలే!

కాని అలాంటి ప్రజలనే వంచిస్తున్నారు మన నేతలు. ప్రజల మనోభావాలను ఏ మాత్రం గౌరవించకుండా తమ నికృష్టపు మాటలు, దుర్మార్గపు చేష్టలతో అసలే మండుతున్న ప్రజాగుండెలపై మరింత ఆజ్యం పోస్తున్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో సీమాంధ్రలోని ప్రజాప్రతినిధులందరి అసలురంగు బయటపడింది. ప్రాణాలైనా వదలుతాంగాని పదవులను వదిలే ప్రసక్తే లేదంటున్నారు. పదవులకు ఫెవికాల్‌తో అతికించినట్లుగా అతుక్కుపోయారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ రాష్ట్ర విభజన నిర్ణయం తీసుకున్నాక సీమాంధ్రలో వున్న 25మంది లోక్‌సభ్యులలో కొందరు రాజీనామాలు చేసారు. మరికొందరు రాజీనామాలకు సిద్ధపడ్డారు. ఇంకొందరు అధిష్టానానికి వ్యతిరేకమయ్యారు. కనీసం వారిలో ఏదో ఒక రూపంలో స్పందన కనిపించింది. కాని నెల్లూరు జిల్లాకు చెందిన కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, ఎంపీ చింతామోహన్‌లలో ఎలాంటి స్పందనా

(మిగతా 10వ పేజీలో)



ఉద్యమాలు జరుగుతున్నా ఆత్మకూరులో అడుగుపెట్టని సమన్వయకర్త

## గౌతంబాబు ఎక్కడ...?

సీట్లు కావాలి... ఓట్లు కావాలి... కాని జనాలకు దగ్గరగా మాత్రం ఉండకూడదు. రాజకీయాలలో ఇదే మేకపాటి కుటుంబం పాలసీ. అత్రగాడికి ఆశెక్కువ అంటారు. అవకాశం వచ్చింది కదా అని చెప్పి జిల్లాలో ఒక లోక్‌సభ, రెండు అసెంబ్లీ సీట్లకు మేకపాటి సోదరులు కర్చీఫ్‌లు వేసి పెట్టారు. ఈ సీట్లు కేవలం వారి కుటుంబంలో వారి కోసమే. వాళ్ల అనుచరులకు కూడా మరికొన్ని సీట్లలో టవల్స్ వేసేందుకు ప్రయత్నించారు. కాని చాలా చోట్ల వారి పప్పులుడకలేదు.

జగన్ కాంగ్రెస్ నుండి బయటకు రాగానే అతనితో పాటు మేకపాటి సోదరులు కూడా బయటకొచ్చారు. జగన్‌కు మద్దతుగా తమ పదవులకు రాజీనామాలు చేసారు. జగన్ బ్రాండ్‌తో ఎంపీగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మళ్ళీ గెలిచారు. మొదట వచ్చారు కాబట్టి జగన్ కూడా పార్టీలో వీరికి పెద్దపీట వేసాడు. ఇంతవరకు బాగానే వుంది. గతంలో ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే

(మిగతా 10వ పేజీలో)

• కత్తిమీద సాములా ఆనం రాజకీయ ఫీట్లు

# అధిష్టానమా? ప్రజాభీష్టమా?





అవ్వా కావాలి బువ్వా కావాలి... ఇలా వుంది జిల్లాలో ఆనం సోదరుల రాజకీయం. ఓ పక్క కాంగ్రెస్‌ను వదలకూడదు, ఇంకో పక్క ప్రజలను దూరం చేసుకోకూడదు. ఓ పక్క కాంగ్రెస్‌పార్టీని తిట్టకూడదు, ఇంకోపక్క కాంగ్రెస్ రాష్ట్ర విభజన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమాలు నిర్వహించాలి. రాజకీయాలలో ఇటువంటి సర్కస్‌ఫీట్ నిర్వహించి తమను తాము బ్యాలెన్స్ చేసుకోవడంలో ఆనం సోదరులు మాస్టర్‌డిగ్రీ పొందారని చెప్పవచ్చు.

రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకోవడానికి ఆనం సోదరులు చురుకైన పాత్రనే పోషిస్తున్నారు. ఈ పరంపరలో కాంగ్రెస్ అధిష్టానానికి విధేయతను చాటుకునే బాధ్యతను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీసుకుంటే, విభజనకు వ్యతిరేకంగా ప్రజలను కలుపుకుని ఉద్యమాన్ని నిర్వహించే బాధ్యతను ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి తన భుజస్కంధాలపై మోస్తున్నారు. అయితే వీళ్లిద్దరూ విడివిడిగా కాదు ఒకటిగానే రాజకీయ వ్యూహాలు పన్నుతుండడం చెప్పుకోదగ్గ విషయం.

సీఎం పదవి నుండి కిరణ్‌ను తప్పిస్తే ఆ స్థానంలో ఆనం రామనారాయణరెడ్డిని కూర్చోబెడతారనే ప్రచారం జరుగుతుంది. అయితే ఈ సమయంలో సీఎం సీటులో కూర్చున్నా భవిష్యత్‌లో మాజీ ముఖ్యమంత్రి అనే ఫీలింగ్ ఒకటి మిగులుతుందేగాని, ఇప్పుడు సీఎం ఈ శ్మశానాంధ్రను చేసేదేమీ లేదు. ఇప్పుడు సీఎం పదవి తీసుకున్నా చరిత్ర పుటల్లోకి

(మిగతా 10వ పేజీలో)



సీమాంధ్రలో 'దేశం' వాయిస్ వినిపిస్తున్న ఏకైక నేత సోమిరెడ్డి

## ఐదడుగుల బుల్లెట్టు...!

చంద్రబాబు రెండుకళ్ల సిద్ధాంతం మూలంగా ఇరుప్రాంతాల తెలుగుదేశం నాయకులు ఏ వాదంపై కూడా గట్టిగా వాదించలేని పరిస్థితులు తలెత్తాయి. సమైక్యానికి గాని, విభజనకు గాని చంద్రబాబు పూర్తిగా కట్టుబడలేదు. రెండు పడవల మీద కాళ్లు పెట్టాడు. చంద్రబాబు రాష్ట్ర విభజనకు మద్దతు తెలపడం వల్ల తెలంగాణలో ఆ పార్టీ నాయకులు కొంత సర్దుకున్నారు. కాని సీమాంధ్రలో ఆ పార్టీ నాయకుల పరిస్థితే ఇబ్బందికరంగా తయారైంది.

అయితే పార్టీ ఇంత సంక్లిష్ట పరిస్థితుల్లోవున్నా, పార్టీ ప్రతినిధిగా సీమాంధ్రుల తరపున తన వాదన వినిపిస్తున్న పొట్టి గట్టి నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, చంద్రబాబు రెండుకళ్ల సిద్ధాంతం అనుసరించకముందు సమైక్యవాదాన్ని వినిపించడంలో సోమిరెడ్డి ఫైర్‌బ్రాండ్‌లాగా చెలరేగాడు. తెలంగాణలో తెలుగుదేశం తరపున రేవంత్‌రెడ్డి రెచ్చిపోతే, సీమాంధ్రలో సోమిరెడ్డి తెలుగుదేశం

(మిగతా 10వ పేజీలో)




బాబా వారి మహా సమాధి, విజయదశమి మహోత్సవములు

గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు.

తేది. 14-10-2013 సోమవారం నుండి 16-10-2013 బుధవారం వరకు జరుగును.

తేది. 14-10-2013 నుండి 16-10-2013 వరకు ప్రతిరోజు బాబా వారికి ఉ॥7.00 గం.ల నుండి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సహస్రనామపూజలు జరుగును. పై పూజలలో పాల్గొను భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.75/- చెల్లించి తగిన రశీదు పొంది బాబా వారి తీర్థప్రసాదములు స్వీకరించవలసినదిగా కోరుచున్నాము.

పై దినములలో ప్రతిరోజు సా॥ 6.00 గం.లకు సాంస్కృతిక కార్యక్రమములు ఉండును.

ఇట్లు: కార్యవర్గము

శ్రీ షిర్డి సాయి బాబా మందిరం

గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు. ఫోన్. 2327771.



నాణ్యతకు, మన్నికకు నమ్మకమైన చిరునామాగా విరాజిల్లుతున్న
మా సంస్థ అభివృద్ధికి కారకులైన మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
విజయదశమి శుభాకాంక్షలు.



మీ... వెన్నపూస మల్లిఖార్జునరెడ్డి

Sri Padmavathi Marbles

H.O: Magunta Layout, Mini Bypass Road, Nellore - 3. Cell : 96180 02727.
B.O: Beside State Bank, Vedayapalem, Nellore - 4. B.O: B.V.Nagar, Mini Bypass Road, Nellore - 3.

PDF Compressor Free Version



# ప్రాణాలతో చెలగాటం

- అమ్మోనియం గ్యాస్ లీక్
- వందమందికిపైగా అస్వస్థత
- బాధితుల్లో బాలికలే అధికం
- తప్పిన ప్రాణాపాయం
- ఫ్యాక్టరీ సీజ్‌కు కలెక్టర్ ఆదేశం



నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం డేవిస్‌పేట వద్దనున్న స్టార్ అగ్రోమెరైన్ ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ రొయ్యల కంపెనీలో బుధవారం ఉదయం అమ్మోనియా గ్యాస్ లీకై దాదాపు వందమందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కర్మాగారంలో పని చేసేవారందరూ మహిళలే. వీరంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారు. నెల్లూరు జిల్లావాసులే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన మహిళలు కర్మాగారంలో పని చేస్తున్నారు. బుధవారం ఉదయం సుమారు 10.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా అమ్మోనియా విషవాయువు విడుదల కావడంతో మహిళా కార్మికులంతా ఉక్కిరి బిక్కిరయ్యారు. అమ్మోనియా పీల్చడంతో ప్రాణవాయువు లభించక అల్లాడిపోయారు. హుటాహుటీన వీరందరిని నెల్లూరులోని రామచంద్రారెడ్డి ఆసుపత్రికి తరలించారు. రామచంద్రారెడ్డి ఆసుపత్రిలో పడకలు సరిపోకపోవడంతో మధ్యాహ్నం చాలామందిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొంతమంది సిబ్బంది ప్లాంటును శుద్ధి చేస్తుండగా ఒక్కసారిగా పైపుకు రంధ్రం పడి గ్యాస్ లీకైంది. రొయ్యల పరిశ్రమలో దాదాపు వెయ్యి మంది పనిచేస్తున్నప్పటికి నిబంధనల ప్రకారం ఉండాల్సిన వైద్యసిబ్బంది ఒక్కరు లేరని డిఎంహెచ్‌ఓ ఇన్‌చార్జి సుధాకర్ విలేకర్లకు తెలిపారు. సంఘటన స్థలంలో ఎలాంటి ప్రథమ చికిత్స కిట్లు లేవన్నారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న మహిళలు ప్రమాదం నుంచి బయటపడడంతో బాధితులు, యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. జరిగిన సంఘటనను స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్రీకాంత్, ఎస్పీ రామకృష్ణలు ఫ్యాక్టరీని సీజ్ వేయాలని అధికారులను ఆదేశించారు.

## గుజరాత్ వ్యవసాయ సదస్సులో

# బెజవాడ రైతు బిడ్డకు అవార్డు




వ్యవసాయమంత్రి చేతుల మీదుగా అవార్డునందుకుంటున్న బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి

గత నెలలో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో వైబ్రెంట్ గుజరాత్ వ్యవసాయ సదస్సు భారీఎత్తున జరిగింది. రెండురోజుల పాటూ జరిగిన ఈ సదస్సును ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించారు. రెండోరోజు దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో కృషి చేసిన 524మంది రైతులకు ఉత్తమరైతు అవార్డులు అందజేశారు. కాగా నెల్లూరుకు చెందిన ప్రగతి బయోప్రోడక్ట్స్ వ్యవస్థాపకులు బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి ఆ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి బాబుబాయ్ బొకిరియా చేతుల మీదుగా ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. సేంద్రీయ ఎరువుల వాడకం, తయారీ, వరినాట్లలో యాంత్రీకరణపై ఆయన చేసిన కృషికి గాను ఈ అవార్డుకు ఢిల్లీలోని వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రతిపాదించింది. మన రాష్ట్రం నుండి 19మంది రైతులు ఈ సదస్సులో అవార్డులందుకున్నారు. జమిందారీ కుటుంబంలో వుంటూ వ్యవసాయాన్ని తక్కువచూపుచూడకుండా ఎక్కువగా చూస్తూ అరుదైన పురస్కారాన్ని అందుకున్న బెజవాడ నరేష్‌చంద్రారెడ్డికి 'లాయర్' అభినందనలు.

# "చాకిరేవు"లో వివేకా



స్టైల్ ఆఫ్ సింహపురిగా గుర్తింపు కెక్కిన నెల్లూరు గ్రామీణ శాసన సభ్యులు ఆనం వివేకానంధరెడ్డి ప్రతిరోజు నెల్లూరులో ఏదో ఒక సంచలనం సృష్టిస్తూ వుంటారు. సిని మాల్లో హీరోలు వేసినట్టు కొత్తకొత్త వేషాలు వేసి జనాల్ని ఆకర్షిస్తుంటారు. ఈనెల 8న నెల్లూరు విఆర్‌సికూడలిలో రజక సంఘం సమైక్యాంధ్ర కోసం చేపట్టిన "చాకలిరేవు" కార్యక్రమంలో పాల్గొన్న వివేకా పంచెను గోసికట్టి కట్టి రోడ్డుపైన ఏర్పాటుచేసిన బండమీద బట్టలు ఉతుకుతూ ఉద్యమకారులను ఉత్సాహపరచడం విశేషం. కార్యక్రమంలో నెల్లూరు నగరశాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీమేయర్ భానుశ్రీలు పాల్గొన్నారు.

## అక్టోబర్ 19న టిటిడి దేవస్థానములచే

# శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవం

**ఉభయకర్త : వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి** **వేదిక : వి.పి.ఆర్.కన్వెన్షన్ సెంటర్**



తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో అక్టోబర్ 19వ తేదీ సాయంత్రం 5గంటలకు, నెల్లూరు రూరల్‌లోని కనుపర్తిపాడు వద్దగల వి.పి.ఆర్ కన్వెన్షన్‌సెంటర్‌లో శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగబోతోంది. ప్రముఖదాత, పారిశ్రామికవేత్త శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉభయకర్తగా వ్యవహరిస్తున్న ఈ కల్యాణ మహోత్సవానికి తిరుమల తిరుపతి నుండి వేంచేస్తున్న స్వామి వారి మూర్తులతో పాటు టిటిడి నుండి వేద పండితులు రాబోతున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు, అన్నమాచార్య ప్రాజెక్ట్ మాజీ ఉద్యోగి పారుపల్లి రంగనాథ్‌తో పాటు స్థానిక సంగీత కళాకారిణి శ్రీమతి బాలార్క వారి శిష్య బృందంచే అన్నమయ్య సంకీర్తన జరుగబోతోంది. ఈ కల్యాణ వేడుకలో పాల్గొనదలచిన వారు ఉచిత పాసుల కొరకు 94926 87680, 99639 12777, 94404 25225, 98663 14741 నెంబర్లలో సంప్రదించి పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు.

## ఏసిబి న్యాయమూర్తిగా

# నరసింహరాజు

నెల్లూరు జిల్లా ప్రత్యేక ఏసిబీ కోర్టు (రెండవ అదనపు జిల్లా జడ్జి) న్యాయమూర్తిగా ఎస్.వి.నరసింహరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు జిల్లా ఆళ్ళగడ్డ సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తూ పదోన్నతిపై ఏసిబీ న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

# కావలి ఆర్డీవో బదిలీ

నెల్లూరుజిల్లా కావలి ఆర్డీవో సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి బదిలీ అయ్యారు. ఈయనను జిల్లా కేంద్రం నెల్లూరు ఆర్డీవోగా నియమించారు. కావలి ఆర్డీవోగా మహబూబ్‌నగర్‌జిల్లా డ్వామా పిడి కె.వెంకటరమణారెడ్డిని నియమించారు. కావలికి ఆర్డీవోగా 2012 జనవరిలో సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి వచ్చారు. డివిజనల్ రెవెన్యూ అధికారిగా కావలి మునిసిపాలిటి ప్రత్యేకాధికారిగా ఉన్నారు. కావలి మండలానికి ప్రత్యేకాధికారిగా పనిచేసారు. కావలి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల వెడల్పు, పారిశుద్ధ్యంపై దృష్టిసారించి అభివృద్ధి పనులు చేయించారు. రెడ్‌క్రాస్‌కు ఛైర్మన్‌గా రక్తనిల్వలు తగ్గకుండా చూసారు. ఆయన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నారు. సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డిని నెల్లూరు ఆర్డీవోగా బదిలీ చేసారు. మాధవీలత తిరుపతికి బదిలీ అయిన తర్వాత డిఆర్‌డిఏ పిడి వెంకటసుబ్బయ్య ఇన్‌ఛార్జ్ ఆర్డీవోగా వ్యవహరిస్తున్నారు.

## ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా

# మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి



నెల్లూరులో చాలావరకు అందరికీ సుపరిచితుడైన ప్రముఖ న్యాయవాది మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో రాష్ట్ర సంఘానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో శ్రీనివాసులరెడ్డి ఎన్నికైనట్లు ఫుట్‌బాల్ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా ఐఏఎస్ అధికారి డాక్టర్ అలీరాఫత్ ఎన్నిక కావడం జరిగింది. మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డికి విద్యార్థి దశ నుండే ఫుట్‌బాల్ క్రీడపై ఆసక్తి ఎక్కువ. స్వతహాగా ఫుట్‌బాల్ క్రీడాకారుడాయన. ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో ఇప్పటికే పలు పదవులు నిర్వహించివున్నారు. ఆయనకు 'లాయర్' అభినందనలు.

# జగన్‌ను కలిసిన బత్తిని



హైదరాబాద్‌లో జగన్‌ను కలిసిన గూడూరు వైయస్సార్సీపీ నాయకులు బత్తిని విజయకుమార్

సమైక్యాంధ్రకు మద్దతుగా హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ వద్ద ఆమరణనిరాహారదీక్ష చేస్తున్న వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని గూడూరు వైయస్సార్సీపి నాయకులు బత్తిని విజయకుమార్ మంగళవారం కలిసి సంఘీభావం తెలిపారు. ఆయన వెంట వైయస్సార్సీపీ నాయకులు ఉదయభాస్కర్, ప్రభాకర్‌రాజు, బ్రహ్మయ్య తదితరులున్నారు.

## అక్టోబర్ 23, 24 తేదీల్లో



## శివమణి - యస్.పి.బాలులచే


# సంగీత సంరంభం



నెల్లూరురూరల్ కనుపర్తిపాడు సమీపంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, సంఘసేవకులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అంతర్జాతీయస్థాయిలో భూతలస్వర్గంలా నిర్మించిన వి.పి.ఆర్. కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 23, 24వ తేదీలలో సంగీతసంరంభం జరుగబోతోంది.

అక్టోబర్ 23వ తేదీ సాయంత్రం 5గంటలకు అంతర్జాతీయంగా పేరుపొందిన ప్రముఖ డ్రమ్స్ మాస్టర్ శివమణి తన వాయిద్యం ద్వారా సుమధుర సంగీతలహరిని అందించబోతున్నారు. ఇదే రోజు సాయంత్రం పాడుతాతీయగా విజేతలైన చిన్నారులు తేజస్విని, శివ, పరమేశ్వర్, షణ్ముఖప్రియ, సుదీప్‌లు సినీసంగీత విభావరి నిర్వహిస్తున్నారు.

అక్టోబర్ 24వ తేదీ సాయంత్రం 5గంటలకు నెల్లూరీయుల ముద్దుబిడ్డ పద్మభూషణ్ డా॥ యస్.పి.బాలసుబ్రహ్మణ్యం, ఆయన సోదరి శ్రీమతి యస్.పి.శైలజాసుధాకర్, కుమారుడు యస్.పి.చరణ్‌లు తమ మధురగాత్రాలతో స్వరనీరాజనం చేయబోతున్నారు. ఈ రెండురోజుల కార్యక్రమాలను విశేషరీతిలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు నిర్వాహకులు.




## దున్నపోతు మీద వానపడ్డట్లు...

రాష్ట్ర విభజన విషయంలో కేంద్ర వైఖరి దున్నపోతు మీద వాన పడినట్లుగా వుంది. సీమాంధ్రలో ఇంత పెద్దఎత్తున ఉద్యమం జరుగుతున్నా వాళ్లు చలించడం లేదు. మీ చావు మీరు చావండి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉద్యమాన్ని చల్లార్చే మాటలు కూడా చెప్పడం లేదు. జాతిహీనులు దేశాన్ని పరిపాలిస్తుంటే ఇలాంటి పరిస్థితులే వస్తాయి. ఈరోజు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన సమస్య రేపు ఇంకో రాష్ట్రానికి రాదనే గ్యారంటీ లేదు.

సి.రాజీవి, నెల్లూరు.

## సోనియాను వెలివేయాలి

ఎక్కడో ఇటలీ నుండి వచ్చి, ఎన్నో ఏళ్లకు గాని ఈ దేశ పౌరసత్వాన్ని తీసుకోని సోనియాగాంధీని మనం నెత్తిన పెట్టుకుని మోయడం ఏంటి? దేశం పట్ల ఏ మాత్రం భక్తి గౌరవం లేని ఆమె చెప్పినట్టల్లా మనం ఆడడం ఏంటి? అసలు దేశాన్ని శాసించేందుకు ఆమె ఎవరు? ఈ దేశ ప్రజలు, పరిస్థితుల గురించి ఆమెకేం తెలుసు. సెంటిమెంట్‌తో ముడిపడి వుండే దేశంలో సెంటిమెంట్‌ను గౌరవించని సోనియాను ఇటలీకి పంపిస్తేనే దేశం బాగుపడుతుంది.

వి.రాజేష్, నెల్లూరు.

## చరిత్రహీనురాలు

సీమాంధ్ర ప్రజలు ఓ పక్క భగ్గున మండిపోతుంటే, నేను రాజీనామా చేయను, నేను విభజన వాదిని అంటూ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి పేర్కొనడం ప్రజాద్రోహమే. ఆమెకు పదవులు ఈ ప్రజలిచ్చినవే! ఈ ప్రజలు ఓట్లేస్తేనే ఆమె నాలుగుసార్లు ఎంపీగా గెలిచి రెండుసార్లు కేంద్ర మంత్రి కాగలిగింది. ఏ మాత్రం చీము, నెత్తురు వున్నా సీమాంధ్రకు ద్రోహం చేయడం ఆపి వెంటనే పదవికి రాజీనామాచేయాలి. రేపు ఏ ముఖం పెట్టుకుని ఓట్ల కోసం ప్రజల్లో తిరగగలదు. సోనియమ్మను ప్రసన్నం చేసుకుని రాజ్యసభకు వెళ్ళినా ప్రజలను ప్రసన్నం చేసుకోని హీనురాలుగా మిగులుతుంది.

వి.బాలస్వామి, గూడూరు.

## 'ప్రభా'తం

ఒక ప్రాంతంలో వున్న ప్రజలందరినీ కాల్చి చంపాలని కేబినెట్ తీర్మానం చేసిందనుకుందాం. అదే తీర్మానాన్ని పార్లమెంట్ ఆమోదిస్తే... ఇక ఆ ప్రాంతంలో ప్రజలందరినీ కాల్చి చంపేయడమేనా? రాజ్యాంగంలో ఆ విధంగా వ్రాసి వుంది కాబట్టి ఆ విధంగా చేసేయడమేనా? రాష్ట్ర విభజనపై కేబినెట్ నోట్‌కు పైన పేర్కొన్న విషయానికి పెద్ద తేడా లేదు.

దేశంలో ఇప్పుడు తలెత్తే చాలా సమస్యలకు మన రాజ్యాంగంలో పరిష్కారాలు దొరకవు. ఎందుకంటే రాజ్యాంగ నిర్మాతలకు భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు తలెత్తుతాయనేది వారి వూహాకు వచ్చి వుండదు కాబట్టి. ఒక కొత్త రాష్ట్రాన్ని ఏ విధంగా ఏర్పాటు చేయాలనేది రాజ్యాంగంలో వ్రాసి వుంటుంది గాని, ప్రజల హక్కులను కాలరాసి, ప్రజలు ఛస్తున్నా, లేకుంటే వాళ్లను చంపయినా కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయమని రాజ్యాంగం చెప్పివుండదు. ఒకవేళ ప్రజల హక్కులు, మనోభావాలను కాలరాసే విధంగా రాజ్యాంగం వుంటే అలాంటి రాజ్యాంగం మనకు అవసరం లేదు కూడా!

వివిధ ప్రాంతాల మధ్య అసమానతలు ఎందుకొస్తాయి. ఒకే దేశంలో వున్న ప్రజలు ప్రాంతాల వారీగా విడిపోయి తన్నుకునే పరిస్థితులు ఎందుకొస్తాయి? అనే ప్రశ్న ఇంతకాలం చాలా మంది మనసుల్లో వుండేది. ఈరోజు రాష్ట్ర విభజన విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి చూస్తే ఆ ప్రశ్నకు సమాధానం ఇట్టే లభిస్తుంది. ప్రాంతాలవారీగా ప్రజలు విడిపోరు. రాజకీయ స్వప్రయోజనాల కోసం రాజకీయపార్టీలే వారిని విడదీస్తుంటాయి.

### విభజన.. ఇలాగేనా?



దేశ చరిత్రలో ఇప్పటివరకు ఏర్పడిన కొత్త రాష్ట్రాలు ఒక ఎత్తైతే.. ఆంధ్రప్రదేశ్ విభజన మరో ఎత్తు. రాజధాని నగరం కేంద్రంగా ముడిపడిన ఈ విభజన సమస్యను కాంగ్రెస్ ఎంతో సామరస్యంగా పరిష్కరించాల్సింది పోయి, ప్రాంతాన్ని బదులు ప్రజలను విడదీసి వారిని శాశ్వత శత్రువులుగా మార్చేస్తుంది.

ఇటీవల రాష్ట్ర విభజనపై సిడబ్ల్యుసి తీర్మానాన్ని కేబినెట్ యధావిధిగా ఆమోదించింది. ఆరోజు మధ్యాహ్నం నుండే కేబినెట్ భేటీలో తెలంగాణపై ఎటువంటి నిర్ణయం తీసుకోనున్నారా? అని రాష్ట్రంలోని మూడుప్రాంతాల ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసారు. కేబినెట్ భేటీ ముగిసాక కేంద్ర హోంమంత్రి షిండే బయటకు వచ్చి సిడబ్ల్యుసి తీర్మానాన్ని కేబినెట్ యధావిధిగా ఆమోదించిందని చెప్పినప్పుడు... సీమాంధ్రలోని 13జిల్లాల్లో టీవీలు చూస్తున్న చాలామంది అనుకున్నదొకటే... అసలు ఈ దేశంలో మేమెందుకుండాలి... మా పాటికి మేం ప్రత్యేకదేశంగా వుంటే సరిపోదా? వేర్పాటువాదాలకు విషబీజాలు ఎక్కడో పడవు. ప్రభుత్వాలు చేసే తప్పిదాల వల్లే పడుతుంటాయి. రెండునెలలకుపైగా సీమాంధ్రలోని 13జిల్లాల్లో ఉద్యమాలు జరుగుతున్నా, జీతాలు లేక చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ బాధపడుతున్నా వారి గురించి ఏ మాత్రం పట్టించుకోని కేంద్రప్రభుత్వం పుండుమీద కారం చల్లినట్లు కేబినెట్ నోట్ తేవడం ప్రజాఉద్యమాలకు పాతరవేయడమే. ఏం ఆశించి కాంగ్రెస్ ఈ పాతకానికి ఒడి గట్టిందోగాని సీమాంధ్రలో ప్రజల పట్ల కక్ష పూరితంగా వ్యవహరించడం అనేక అనుమానాలకు తావిస్తుంది.

దేశంలో ఇంతకుముందు ఎన్నో రాష్ట్ర విభజనలు జరిగాయి. ఇప్పటివరకు ఏర్పడిన రాష్ట్రాలకు రాజ్యాంగంలో పరిష్కారం వుంది. కాని వాటికి ఆంధ్రరాష్ట్ర విభజనకు మధ్య భిన్నమైన మార్గం వుంది. రాజ్యాంగంలో దీనికి పరిష్కారం లేదు. రాజకీయపార్టీలు దీనిని గుర్తించడం లేదు. మహారాష్ట్ర నుండి గుజరాత్ విడిపోతే ముంబైని తీసుకుపోలేదు. వాళ్లు అహ్మదాబాద్‌ను కొత్త రాజధానిగా పెట్టుకున్నారు. పంజాబ్ నుండి హర్యానా విడిపోయింది. రెండు రాష్ట్రాలు ఉమ్మడి రాజధానిని ఏర్పాటు చేసుకున్నాయి. కాబట్టి సమస్య రాలేదు. ఆతరువాత వారి కళ్లముందే ఎన్డీఏ హయాంలో మూడు కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. కొత్త రాష్ట్రాలు కొత్త రాజధానులను ఏర్పాటు చేసుకున్నాయి. అంతేగాని పాత రాజధానులను తన్నుకుపోలేదు. వీటన్నింటికీ భిన్నంగా ఆంధ్రప్రదేశ్‌ను విభజిస్తున్నారు. 56ఏళ్ళ ఉమ్మడి కృషితో అభివృద్ధి చేసుకున్న హైదరాబాద్‌ను తెలంగాణకు అప్పగించేస్తూ సీమాంధ్రను ఏడారిగా మారుస్తున్నారు.

సరే, కాంగ్రెస్ అంటే ఓట్ల కోసం దేశాన్నయినా తాకట్టుపెట్టడానికి సిద్ధపడే పార్టీ. మరి మిగిలిన జాతీయ పార్టీలు ఏం చేస్తున్నట్లు? చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మేం అనుకూలమని బీజేపీ అంటుంది. చిన్న రాష్ట్రాల ఏర్పాటు అంటే ఇలాగేనా? ఒక ప్రాంత ప్రజల కడుపు కొట్టి, ఆ ప్రాంత ప్రజలను చీకట్లోకి నెట్టడమేనా? అశాంతి, అభద్రతతో రగిలే ఇలాంటి రాష్ట్రాలతోనే అభివృద్ధి సాధిస్తారా? బీజేపీ కూడా ఇలాంటి ఉద్రిక్తతల మధ్య ఏర్పాటయ్యే రాష్ట్రాల ఏర్పాటుకే మద్దతునిస్తుందా? ఈ తరుణంలో రాష్ట్రాన్ని చీలిస్తే తెలంగాణ, సీమాంధ్ర ప్రజలు శాశ్వతంగా శత్రువులైపోరా? ఇలాంటి విభజననేనా బీజేపీ వాళ్లు కోరుకునేది.

కేబినెట్ తర్వాత సీమాంధ్రలో పరిస్థితులు ఎంత ఉద్రిక్తంగా వున్నాయో అందరూ చూస్తున్నారు. చూస్తూ కూడా ధృతరాష్ట్రులు మాదిరిగా వ్యవహరిస్తున్నారు. ఈ దేశంలో ఉగ్రవాదులు, వారి సానుభూతిపరులకు వున్న హక్కులు సీమాంధ్రలోని ప్రజలకు లేదనిపిస్తుంది. కాంగ్రెస్ కంటే కసాయి, ఓట్ల కోసం ప్రజలను నిలువునా నరుకుతుంది. బీజేపీకి కూడా ఆ కసాయితనం అబ్బినట్లుంది. కాంగ్రెస్‌కు ప్రాంతీయతత్వం, బీజేపీకి మతతత్వం వంటబట్టాయి. ఓట్ల కోసం ప్రజలను, ప్రాంతాలను విభజించే భ్రష్టు రాజకీయాలు మానుకోండి, ప్రజలను ఒప్పించి విభజించాలేగాని వారి మనసులు నొప్పించి కాదు... కాంగ్రెస్ అంటే ఎలాగూ బుద్ధిహీనతతో వుంది. బీజేపీది కూడా అదే పంథానా...? ఆలోచించుకోవాలి.

## 'అంతర్'జాతీయం

- నేరచరితులను రక్షించే ఆర్డినెన్స్ ఉపసంహరణలో తన ప్రమేయం లేదని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ పేర్కొన్నారు. ఆర్డినెన్స్ తెచ్చింది కేబినెట్ అని అదే విజ్ఞతతో వెనక్కు తీసుకున్నారని అన్నారు.
- సినిమా వ్యాపారాత్మక కళ అని అప్పుడైనా, ఇప్పుడైనా డబ్బు కోసమే చేస్తున్నారని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ అన్నారు. ఆదివారం రాత్రి ఢిల్లీ తెలుగు అకాడమీ నిర్వహించిన వందేళ్ల భారతీయ సినిమా వేడుకలో ఆయన మాట్లాడుతూ మరో వందేళ్ల తర్వాత సినిమాలు కొత్తరూపు సంతరించుకుంటాయన్నారు.
- తమ పార్టీ చిన్నరాష్ట్రాల ఏర్పాటును వ్యతిరేకిస్తుందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత ములాయంసింగ్‌యాదవ్ స్పష్టం చేశారు. చిన్న రాష్ట్రాల వల్ల కొత్త సమస్యలు తలెత్తుతాయి. నక్సలిజం పెరుగుతుంది. ప్రత్యేకతెలంగాణను తాము సమర్థించడం లేదని ఆయన పేర్కొన్నారు.
- 2014 ఎన్నికలకు ముందే కాంగ్రెస్, దళ్(యు)లు కలవడం ఖాయమని బీజేపీ అధికార ప్రతినిధి షానవాజ్ హుస్సేన్ జోస్యం చెప్పారు. జేడీ(యు) అధ్యక్షుడు శరద్‌యాదవ్ కాంగ్రెస్ బద్దవ్యతిరేకి అని, అయినా కూడా ఆయన రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌తో రాజీపడుతున్నారన్నారు.
- ఈ ఏడాది వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతిని ఇద్దరు అమెరికన్ సైంటిస్టులు, ఒక జర్మన్ సైంటిస్ట్ సంయుక్తంగా అందుకోనున్నారు. అమెరికాకు చెందిన జేమ్స్ రాత్‌మాన్, స్కెక్‌మాన్, జర్మనీకి చెందిన సుధోఫ్ ఈ బహుమతిని అందుకోనున్నారు.
- దైవకణం గురించి 50ఏళ్ల క్రితం ఊహించి ప్రపంచానికి చెప్పిన బ్రిటన్‌కు చెందిన పీటర్ హిగ్స్, బెల్జియంకు చెందిన ఫ్రాంకోయిస్ ఇంగ్లర్ట్‌లు భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు.
- పాకిస్థాన్‌కు చెందిన బాలికల విద్యాహక్కుల పోరాట యోధురాలు యూసఫ్ జాయ్ మలాలాపై మళ్లీ దాడి చేస్తామని తాలిబన్‌లు హెచ్చరించారు. ఆమె విద్యాహక్కుల కోసం ఉద్యమిస్తున్నందుకు దాడి చేయలేదని, ఇస్లాంపై దుష్ప్రచారం చేయడం వల్లే దాడి చేసామని తాలిబన్‌లు పేర్కొన్నారు.
- ఉపరితలం నుండి ఉపరితలానికి అణ్వాయుధాలను మోసుకెళ్లే పృథ్వీ-2 క్షిపణి ప్రయోగాన్ని ఒరిస్సాలోని బాలాసోర్ నుండి 7వ తేదీన విజయవంతంగా ప్రయోగించారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్షిపణి 350కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేధించగలదు. 500 నుండి 1000కిలోల వార్‌హెడ్‌లను ఇది మోసుకెళ్లగలదు.
- గ్యాంగ్‌స్టర్ అబుసలేం ప్రియురాలు మోనికాబేడీకి ముంబైలోని పాస్‌పోర్టు కార్యాలయం పాస్‌పోర్ట్‌ను నిరాకరించింది.

## వార్త వ్యాఖ్య

వార్త :- సీమాంధ్రులను రెచ్చగొట్టొద్దు. - మర్రి శశిధర్‌రెడ్డి.
వ్యాఖ్య :- **కేంద్రమే ఆ పని చేస్తుంటే మిగతావాళ్లను అనుకోవల్లేదు.**

వార్త :- విభజించి కాంగ్రెస్ తన గొయ్యి తానే తవ్వుకుంది. - రోజా.
వ్యాఖ్య :- **రాజకీయాలలో ఆత్మహత్యలకు తప్ప హత్యలకు తావులేదు.**

వార్త :- తెలంగాణపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి. - సీపీఎం కార్యదర్శి రాఘవులు.
వ్యాఖ్య :- **అలావేస్తే సమస్య పరిష్కారమవుతుందేమోనని కాంగ్రెస్ భయం.**

వార్త :- హింసను రెచ్చగొడుతుంది ముఖ్యమంత్రే. - కిషన్‌రెడ్డి.
వ్యాఖ్య :- **ఆయనకు అంత టాలెంట్ వుంటే రాష్ట్రం ఇలా వుంటుందా?**

వార్త :- ప్రజలు కోరితే వెంటనే రాజీనామా. - కేంద్రమంత్రి కిషోర్ చంద్రదేవ్.
వ్యాఖ్య :- **మీకు ఏ భాషలో చెబితే అర్థమవుతుందో...!**

వార్త :- రాష్ట్ర రాజకీయం కొందరి సొత్తేం కాదు. - బొత్స.
వ్యాఖ్య :- **సీఎం మీద కోపంతో రాష్ట్రానికి ఎసరు తెచ్చారన్నమాట.**

వార్త :- సీమాంధ్రకు స్పెషల్ ప్యాకేజీ. - దిగ్విజయ్.
వ్యాఖ్య :- **జరిగే దామేజీకి ప్యాకేజీలు సరిపోతాయా?**

వార్త :- సీఎం రేసులో లేను. - మంత్రి ఆనం.
వ్యాఖ్య :- **రేస్‌లో వున్నా మీరొక్కరు పరిగెత్తాల్సిందే!**

వార్త :- విభజన బిల్లును బీజేపీ అడ్డుకోవాలి. - ఎంపీ రాయపాటి.
వ్యాఖ్య :- **వాళ్లు తెలంగాణ ఓట్ల కోసం కాపలాకాస్తున్నారుగా... ఎలా అడ్డుకుంటారు.**

వార్త :- మాయావతిపై కేసుల ఎత్తివేతకు నిర్ణయం.
వ్యాఖ్య :- **పాపం... లాలూ ఒక్కడే ఏం పాపం చేసాడు!**

వార్త :- గద్దెదిగాక కిరణ్ చెంచల్‌గూడ జైలుకే. - కిషన్‌రెడ్డి.
వ్యాఖ్య :- **మరి మీలాగా ప్రజలను రెచ్చగొట్టేవాళ్లను తీహార్‌కు పంపాలేమో!**

వార్త :- విభజనలో మొదటి ముద్దాయి జగనే. - ఆనం వివేకా.
వ్యాఖ్య :- **ఇక్కూ మొదటిపేరేనా?**

వార్త :- కేంద్రం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. - బొత్స.
వ్యాఖ్య :- **చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం లాభం.**

PDF Compressor Free Version



# చీలిపోతే... చీకట్లోకే!



కేంద్ర కేబినెట్ మూర్ఖంగా వ్యవహరిస్తూ తెలంగాణనోట్‌ను ఆమోదించడాన్ని నిరసిస్తూ విద్యుత్ ఉద్యోగులు నెల్లూరు దర్గామిట్టలోని విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట ఈనెల 7వతేది రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు కె.వి.శేషారెడ్డి మాట్లాడుతూ సీమాంధ్ర నాయకులు సమైక్యాంధ్ర కోసం చిత్తశుద్ధితో వ్యవహరించకుండా రాష్ట్ర విభజనకు మార్గం సుగమం చేస్తున్నారని, వారి అసమర్థతకు నిరసనగానే తాము మెరుపు సమ్మెకు దిగామని తెలిపారు. రాష్ట్ర విభజన జరిగితే సీమాంధ్రలో ప్రజల భవిష్యత్ చీకటి మయం అవుతుందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకునే రాత్రి వేళలో విద్యుత్ సరాఫరా చేస్తున్నామని అన్నారు. ఒక్కరోజు సమ్మెకే కేంద్ర ప్రభుత్వం దిమ్మ తిరిగిందని. సమ్మె వల్ల ఎదురయ్యే కష్టనష్టాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. తెలంగాణ నోట్‌ను వెనక్కి తీసుకోకపోతే సమ్మెను తీవ్రస్థాయిలో జరుపుతామని, తేలిగ్గా తీసుకుంటే కేంద్రంలో నేతల భవితవ్యం తేలిపోతుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ జేఏసీ నేతలు రమేష్, నాగేశ్వరరావు, మనోహర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### జెండాలు పక్కన పెడదాం...

# ఒకే అజెండాతో సాగుదాం!

రాజకీయాలకు అతీతంగా సమైక్యాంధ్ర కోసం ఉద్యమించాలని అన్ని రాజకీయ పార్టీలకు నెల్లూరు రూరల్ నగర శాసన సభ్యులు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తామూ పార్టీ జెండా పట్టకుండా తెల్లజెండా సమైక్య నినాదంతో ఆందోళనలు చేస్తున్నామన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వైకాపా నాయకులు తమ నివాసాల ముట్టడికి ప్రయత్నాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తమ కుటుంబం మొదటి నుంచి సమైక్య వాదమేనన్నారు. పార్టీల జెండాలు పక్కన పెట్టి జేఏసీ ఆధ్వర్యంలో ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన అంత సులువు కాదని తీర్మానం ఎట్టి పరిస్థితుల్లో ఓడిస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీమేయర్ భానుశ్రీ, డిసిసి ఇన్‌చార్జ్ అధ్యక్షుడు చాట్ల నరసింహారావు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# పరువు తీసేసిన దినేష్

(మొదటిపేజీ తరువాయి)

రావడమే కిరణ్ వల్ల. ఆయన పదవీకాలాన్ని పొడిగించడం, పొడిగించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి వుంటుంది. ట్రిబ్యునల్ నుండి సుప్రీంకోర్టు దాకా దినేష్‌రెడ్డి పదవీకాలాన్ని పొడిగించడానికి నిరాకరించాయి. ఆయనకు ఇంకా పదవీ విరమణకు గడువుండి మధ్యలో తప్పిస్తే బాధపడ్డా అర్థముంది. పదవీకాలం ముగిసాక కూడా అందులోనే కొనసాగాలనుకోవడం అర్థరహితం. అసలే రాష్ట్రంలో గందరగోళ పరిస్థితులున్నాయి. సీఎం కిరణ్‌పై తెలంగాణవాళ్లు కారాలు మిరియాలు నూరుతున్నారు. ఈ సమయంలో దినేష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణవాళ్లకు కోతికి కొబ్బరిచిప్ప ఇచ్చినట్లుగా మారాయి. సమైక్యవాదులలో దినేష్‌ను విలన్‌గా మలిచాయి. డిజిపి వంటి ఉన్నతస్థాయి పదవిని వెలగబెట్టిన ఓ ఐపిఎస్ అధికారి కానిస్టేబుల్ స్థాయిలో మాట్లాడడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# కరెంట్‌షాక్!

(మొదటిపేజీ తరువాయి)

సమైక్యవాదం విషయంలో ఉద్యోగ సంఘాలు ఎక్కడా వెనుకడుగు వేయడం లేదు. సమైక్యం మీద స్పష్టమైన హామీ లేకపోవడంతో విద్యుత్ ఉద్యోగులు కాని, ఏపి ఎన్జీఓలు కాని సమ్మెను విరమించలేదు. ప్రభుత్వం సమ్మెను విరమింపజేయడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ముఖ్యంగా కేబినెట్ తర్వాత సీమాంధ్ర ఉద్యోగులు మెరుపు సమ్మెకు దిగడం కేంద్రానికి ముచ్చెమటలు పట్టించింది. ఉద్యోగుల సమ్మెతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో దక్షిణాది గ్రిడ్‌పై దీని ప్రభావం పడే ప్రమాదం ఏర్పడింది. దక్షిణాది గ్రిడ్ ఫెయిలైతే ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో అంధకారం నెలకొంటుంది. ఇటీవలే ఉత్తరాది గ్రిడ్ ఫెయిలైతే అక్కడి రాష్ట్రాల ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రత్యక్షంగా చూసాం. దక్షిణాది గ్రిడ్ ఫెయిలైతే అవే సమస్యలు ఇక్కడా వస్తాయి. విద్యుత్ సమ్మెతో రైల్వేవ్యవస్థలోనూ ఇబ్బందులు ఏర్పడ్డాయి. పలురైళ్లు రద్దయ్యాయి. విద్యుత్ ప్రకంపనలు ఢిల్లీని తాకాయి. కాబట్టే కాంగ్రెస్ ఢిల్లీ నేతల మాటల్లో కొంచెం మార్పు వచ్చింది. మేము పట్టిన కుందేలుకు మూడేకాళ్లు అనడం మానేసి కొంచెం విజ్ఞతతో కూడిన ప్రకటనలు చేస్తున్నారు. సమైక్యాంధ్ర ఆందోళనల పట్ల సానుకూలంగా స్పందిస్తున్నారు.

### ప్రభుత్వాసుపత్రుల్లో...

# పారిశుద్ధ్యం అధ్వాన్నం

నెల్లూరు జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉందని, వైద్యసేవలు మెరుగు పర్చాల్సిన అవసరం ఉందని వైద్యఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు నగరంలోని డిఎస్‌ఆర్ ఆసుపత్రి, మద్రాసు బస్టాండ్ వద్దనున్న జూబ్లీ ఆసుపత్రి, స్టోన్‌హౌస్‌పేటలోని రేబాల చిన్నపిల్లల ఆసుపత్రులను ఆయన సందర్శించారు. డిఎస్‌ఆర్ ఆసుపత్రిలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా వుందని వెంటనే చర్యలు తీసుకొని మెరుగుపర్చాలని ఆదేశించారు. జూబ్లీ ఆసుపత్రిలో ఉన్న శిశు సంజీవని కేంద్రంలో చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. రేబాల చిన్నపిల్లల అసుపత్రిలో ఉన్న పౌష్టికాహార కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఐసిడిఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాధికారి డాక్టర్ సుధాకర్, డిసిహెచ్ డాక్టర్ నిర్మల పాల్గొన్నారు.

## ఆత్మకూరుపై "డెంగీ" పంజా

### ఇద్దరు బాలురు మృతి

నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో డెంగీ పంజా విసిరింది. మంగళవారం ఇద్దరు బాలురు డెంగీ వ్యాధితో మృతి చెందారు. ఆత్మకూరులోని ఒందూరు గుండకు చెందిన గుర్నాథం భూషయ్య, బుజ్జమ్మ కూమరుడు హరిశ్చంద్రప్రసాద్‌లు మృతి చెందారు. సంగం మండలంలోని కోరిమెర్లకు చెందిన రాజశేఖర్‌రెడ్డి అనే బాలుడు డెంగీ జ్వరంతో చెన్నైలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. దీంతో కోరిమెర్ల గ్రామంలో విషాదం అలుముకుంది. గతంలో డెంగీ బారినపడి చిన్నారులు మృతి చెందినా వైద్య ఆరోగ్య శాఖలో మాత్రం స్పందన లేదు.

# చిన్నారిని చిదిమేసాడు

నెల్లూరు నగరంలోని న్యూటాకీస్ సెంటర్‌లో మల్లేశ్వరి(3) బాలికను కిడ్నాప్ చేసి విజయవాడలో హత్యచేసి కాలువలో పడేసిన కేసులో నిందితుడు మానికల పోలయ్యను అరెస్ట్ చేసినట్లు ఒకటవ నగర సిఐ శ్రీనివాసులు తెలిపారు. పోలయ్యను న్యూటాకీస్ సెంటర్‌లో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కొత్తవెల్లంటి గ్రామానికి చెందిన ఇండ్ల పోలయ్య, పోలమ్మ, వీరి కుమార్తె మల్లేశ్వరి నెల్లూరు వచ్చారు. పోలమ్మ సోదరుడు ఏకొల్లు శ్రీనివాసులు న్యూటాకీస్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. పోలమ్మ న్యూటాకీస్‌కు రాగా నిందితుడు మానికల పోలయ్య ఆమెపై అఘాయిత్యానికి పాల్పడగా ఆమె ప్రతిఘటించింది. దీన్ని మనసులో పెట్టుకున్న పోలయ్య మల్లేశ్వరిని కిడ్నాప్ చేసాడు. దీనిపై ఒకటవ నగర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు దర్యాప్తు చేసి మానికల పోలయ్యను అదుపులోకి తీసుకొని తమదైన స్టైల్‌లో విచారించారు. వివరాలు వెల్లడయ్యాయి. కిడ్నాప్ చేసిన మల్లేశ్వరిని విజయవాడలో గొంతునులిమి హత్యచేసినట్లు వెల్లడించాడు. దీంతో పోలయ్యను అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు.

# నాటు తుపాకుల తయారీ గుట్టు రట్టు

నెల్లూరు జిల్లా దక్కిలి మండలం కొండ కింద పల్లెల్లో నాటు తుపాకుల తయారీ కేంద్రం గుట్టు రట్టయింది. ఓ ఇంటిలో తుపాకులు తయారుచేస్తుండగా పోలీసులు పసిగట్టి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే దక్కిలి మండలంలోని తీర్థంపాడు నక్కల కాలనీలో రాణా నరశింహులు అలియాస్ చిన్నయ్య ఇంటిలో నాటు తుపాకులు తయారు చేస్తున్నాడని సమాచారం అందడంతో మంగళవారం సాయంత్రం దక్కిలి ఎస్సై సాయి ప్రసాద్ తన సిబ్బందితో దాడులు నిర్వహించి, నాటు తుపాకులు తయారు చేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడవున్న తుపాకుల తయారీ సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నరశింహులును అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

### సమైక్యాంధ్ర సమ్మెబాటలో

# ప్రభుత్వ వైద్యశాలల సిబ్బంది

జిల్లా ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుధాకర్‌ను కలిసి వైద్యులు సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, వైద్యులు ఈదూరు సుధాకర్, ఏడుకొండలు, రవీంద్రారెడ్డి తదితరులు సమైక్యాంధ్రకు మద్దతుగా వైద్యసేవలు నిలిపివేసి సమైక్యాంధ్రకు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. అత్యవసర సేవలు తప్ప మిగిలిన అన్ని సేవలు నిలిపివేసి సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు మాట్లాడుతూ గత రెండు నెలలపైగా ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది జీతాలు తీసుకోకుండా రోగులకు వివిధ సేవలు అందిస్తున్నారని కాని ఇప్పటి నుంచి 15వతేదీ వరకు సేవలు నిలిపివేసి సమైక్య నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.

# సమైక్యాంధ్ర ద్రోహి చింతా

### ఆర్టీసీ సిబ్బంది మండిపాటు

ఎంపీ పదవికి రాజీనామా చేయకుండా సమైక్యాంధ్రకు ద్రోహం చేస్తున్న తిరుపతి ఎంపీ చింతా మోహన్ రెండు నెలలు జీతాలు లేకుండా ఉద్యమం చేస్తున్న తమను మోసం చేసేలా దొంగప్రకటనలివ్వడం మానుకోవాలని ఈనెల 8న నెల్లూరు గాంధీబొమ్మ వద్ద రిలే నిరాహారదీక్షలు చేస్తున్న సమైక్యాంధ్ర ఉపాధ్యాయ పోరాట సమితి నాయకులు రమణయ్య, ఉదయ్ శంకర్, కృష్ణారెడ్డి, బాలకృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆయన తమ పట్ల సానుభూతితో బ్యాంకుల్లో రుణాలు తాను ఇప్పిస్తున్నట్లు నాటకాలాడుతున్నారని ముందు ఆయన ఎంపీగా రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొంటే ఎంతో మేలని తెలిపారు. తదుపరి నిరసనగా ఎంపి చింతా మోహన్ దిష్టిబొమ్మను ఊరేగించి తగులబెట్టారు.

నెల్లూరు ఆర్టీసీ బస్టాండు వద్ద కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమైక్యాంధ్ర కోసం రాస్తారోకోలో పాల్గొన్న నాయకులు నారాయణరావు, రమణరాజు, బాబా శామ్యూల్, మాబూ, ఏఎస్‌రెడ్డి, తదితరులు తిరుపతి ఎంపీ చింతా మోహన్ చర్యలపై మండిపడ్డారు. వారు మాట్లాడుతూ గత రెండు నెలల పైన తప్పించుకొని తిరుగుతూ సమైక్య ఉద్యమం వైపు తలతిప్పి కూడా చూడని తిరుపతి ఎంపీ చింతా మోహన్ తమకు ఆయన మాట్లాడి రుణాలు ఇప్పిస్తున్నట్టు అబద్దాలు చెప్పడం తగదని బూటకపు ప్రకటనలు చెయ్యకుండా తక్షణం ఎంపీగా రాజీనామా చేసి రావాలన్నారు. సీమాంధ్ర ప్రాంత కేంద్ర మంత్రులు, ఎంపీలు అందరూ ప్రజలను మభ్యపెట్టకుండా నిజమైన రాజీనామాలు చేయాలని కోరారు.

# చావుకు... చేరువలో కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

లేదనుకున్న కాంగ్రెస్ అధిష్టానం మతి తప్పిన ఆలోచనలతో రాష్ట్ర విభజనకు పూనుకుంది. సొంత కాళ్లను నరుక్కుని జైపూర్ ప్లాస్టిక్ కాళ్ల మీద నిలబడాలనే ఆలోచన చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌ను పూర్తిగా తుడిచిపెట్టే ప్రయత్నం చేస్తుంది. తెలంగాణ ఏర్పాటు ద్వారా ఆ ప్రాంతంలో టీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుని అక్కడి ఎంపీ సీట్లన్నింటిని కొల్లగొట్టాలనేది కాంగ్రెస్ ప్లాన్. సీమాంధ్రలో చూస్తే కాంగ్రెస్‌ది అట్టర్‌ఫ్లాప్‌షో. ఇక్కడ జగన్‌కు మెజార్టీ ఎంపీ సీట్లు వస్తే చచ్చినట్లు తమకే మద్దతునిస్తాడని కాంగ్రెస్ పిచ్చినమ్మకం. ఇదెలా వుందంటే సొంత కారును అమ్ముకుని అద్దెకారుకు అగచాట్లు పడినట్లుగా వుంది. దేశంలోనే కాంగ్రెస్ పరిస్థితి బాగా లేదు. ఆ పార్టీకి కేంద్రంలో మళ్ళీ అధికారం అప్పగించడమంటే అది ప్రజల తెలివితక్కువ తనమే అవుతుంది. ప్రజలు అంత ధైర్యం చేస్తారని కూడా ఎవరూ అనుకోవడం లేదు. కాంగ్రెస్ సొంతంగా 150 నుండి 200 ఎంపీ సీట్లు తెచ్చుకోగలిగితేనే కేంద్రంలో అధికార రేస్‌లో వుంటుంది. ఇప్పుడు పరిస్థితులు చూస్తే కాంగ్రెస్‌కు అంత సీన్‌లేదనిపిస్తుంది. కొన్ని రాష్ట్రాలలో బీజేపీ, మరికొన్ని రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీల హవా కనిపిస్తుంది. కాంగ్రెస్‌కు వంద చిల్లర సీట్లు వస్తే గొప్పే. కాంగ్రెస్ ఈ స్థాయిలో నిలబడిపోయినప్పుడు ఏ ప్రాంతీయపార్టీ కూడా కాంగ్రెస్‌కు మద్దతిచ్చేందుకు ముందుకు రాదు. ఆంధ్రప్రదేశ్‌లోనూ అవే పరిస్థితులుంటాయి. వైకాపా అయినా, టీఆర్ఎస్ అయినా కేంద్రంలో కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వం వైపు మొగ్గుచూపుతాయే గాని కాంగ్రెస్‌తో ఎందుకు అంటకాగుతాయి. కాంగ్రెస్ తన వినాశనాన్ని తానే కొనితెచ్చుకుంటుంది. కుయుక్తులు, కుతంత్రాలతో తాను కూచున్న కొమ్మను తానే నరుక్కుంటుంది.



ఈ నెల 9వ తేదీన రాష్ట్ర విభజనను నిరసిస్తూ నెల్లూరు వీఆర్సి సెంటర్‌లో నగర ముస్లింలు నిర్వహించిన దీక్షా శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఆనం వివేకానందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మైనార్టీ నేతలు.

# నెల్లూరు కబుర్లు

## రక్షణలో నేతల ఇళ్లు

సమైక్యవాదుల ఆందోళనల దృష్ట్యా నెల్లూరుజిల్లాలో ప్రజాప్రతినిధుల ఇళ్లకు పటిష్ట రక్షణ ఏర్పాట్లు చేసారు. విజయనగరంలో బొత్స ఆస్తులపై తీవ్రమైన ప్రజాదాడులు జరిగిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నెల్లూరు, కోట మండలం వెంకన్నపాలెంలో వున్న కేంద్రమంత్రి పనబాక లక్ష్మి ఇంటి వద్ద భారీ పోలీసుబందోబస్తును ఏర్పాటు చేసారు. ఈ రెండుఇళ్లను సమైక్యవాదులు ముట్టడించడం తెలిసిందే.

అలాగే నెల్లూరు సంతపేటలో వున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇంటి వద్ద కూడా పోలీసు బందోబస్తు గట్టిగా పెట్టారు. ఇనుపకంచె, బారికేడ్లతో ఆందోళనకారులు చొచ్చుకు రాకుండా ఏర్పాట్లు చేసారు. కాపువీధిలో ఆనం వివేకా ఇంటి వద్ద కూడా పటిష్టంగా బందోబస్తు ఏర్పాటు చేసారు.

## ఏటీఎంల ముందు క్యూలు

సమైక్యాంధ్ర సమ్మెతో బ్యాంకుల లావాదేవీలు పూర్తిగా స్తంభించిపోతున్నాయి. ఎప్పుడు బ్యాంకులు తెరుస్తారో, ఎప్పుడు బంద్ పాటిస్తారో చెప్పలేని పరిస్థితి. ప్రతిరోజూ బ్యాంకులు పనిచేయకపోతే సమస్యలే. కేంద్రం తెలంగాణ నోట్‌ను ఆమోదించాక అన్ని సంస్థలతోపాటు బ్యాంకులకు కూడా సమ్మె సెగ తగిలింది. దీంతో బ్యాంకులు లేక ఖాతాదారులు ఏటీఎంలలో డబ్బు డ్రాచేసుకోవడానికి క్యూలు కట్టారు. ఏటీఎంలలో డబ్బు కూడా అయిపోవడంతో ఖాతాదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. సోమవారం బ్యాంకులు తెరుస్తారని తెలిసి ఉదయం 9గంటల నుండే ఖాతాదారులు గుంపులు గుంపులుగా చేరారు.

## సిఎం కుర్చీకోసం ఆనం ఫీట్లు...



కాగడాల మానవహారం కార్యక్రమంలో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సిఎం కుర్చీ కోసం రాష్ట్రమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఫీట్లు చేస్తున్నాడని సమైక్యాంధ్ర కట్టుబడి వుంటే మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఎన్జీవోల జేఏసీ డిమాండ్ చేసినా పదవిని వదులుకోకుండా సిఎం పదవి కోసం వెంపర్లాడుతున్నాడని వైకాపా కేంద్ర కమిటీ సభ్యుడు కాకాణి గోవర్ధరెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 5న మాగుంట విగ్రహం సెంటర్‌లో వైకాపా రూరల్ సమన్వకర్త కోటంరెడ్డిశ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ చిత్రపటానికి కాగడాల మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రాను రెండుగా చీల్చినా ఫర్వాలేదని సోనియాగాంధీకి భరోసా యిచ్చి, ఇక్కడేమో సమైక్యాంధ్ర అంటూ ప్రజలను మోసం చేస్తూ చరిత్రహీనుడిలా మిగిలిపోయాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, అనిత, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, తాటి వెంకటేశ్వరరావు, కె.వి.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు



ఏసీ సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో ఆదివారం ఏసీ సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో 91మంది వాకర్స్‌కు, ఈసీజీ వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ ఆరోగ్య సంరక్షణ కోసం ఈనెల 9వతేదీ ఉదయం 6గంటలకు నారాయణ ఆసుపత్రి కార్డియాలజిస్టు భక్తవత్సలరెడ్డి డాక్టర్ అంకిరెడ్డి వైద్యపరీక్షల రిపోర్ట్‌ను చూసి మందులను పంపిణీ చేస్తారని సంఘం అధ్యక్షుడు రాఘవేంద్రశెట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నలుబోలు బలరామయ్యనాయుడు, కోశాధికారి స్వర్ణరమేష్‌బాబు, వీరిశెట్టి హజరత్‌బాబు, నందగోపాల్, రవిచంద్ర, దొరస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## "సోనియా భజనబృందం" నాటకం హైలెట్

సమైక్యాంధ్ర ఉపాధ్యాయ పోరాటసమితి ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు నగరం గాంధీబొమ్మ సెంటర్‌లో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రదర్శించిన సోనియా భజనబృందం నాటకం అందరినీ ఆకట్టుకుంది. "అమ్మా..సోనియమ్మా..నువ్వు రాష్ట్రాన్ని ఏమైనా చేసుకో... మేం ఒక్క మాట కూడా అనం. కానీ మాకు పదవులు ఇవ్వు... నీ కాళ్ళకు మొక్కుతాము... మాకు ప్యాకేజీలు ప్రసాదించు" అంటూ కేంద్ర మంత్రులు అన్నట్లుగా ఉపాధ్యాయులు మాస్కులు ధరించి వినూత్న ప్రదర్శన నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్ నుండి వీఆర్ కళాశాల సెంటర్ మీదుగా మరలా గాంధీబొమ్మ వద్దకు చేరుకొని నిరసన వ్యక్తంచేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సమితి కన్వీనర్ నాగేంద్రకుమార్, నాయకులు రమణయ్య, క్రిష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తిగా బాధ్యతల్లో శ్రీరామమూర్తి

నెల్లూరు నాలుగవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా సిహెచ్ శ్రీరామమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గూడూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తూ పదోన్నతిపై నెల్లూరుకు బదిలీ అయ్యారు.

## మునిసిపల్ ఆరోగ్యాధికారిగా వెంకటరమణయ్య

నెల్లూరు మునిసిపల్ నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారిగా డాక్టర్ వెంకటరమణయ్యను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు వెంకటరమణయ్య సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో తాత్కాలిక కమీషనర్‌గా ఉన్న మునిసిపల్ ఇంజినీర్ సంపత్‌కుమార్‌ను కలిసి తన నియామక ఉత్తర్వులను అందజేసారు. కమీషనర్ జాన్‌శ్యాంసన్ సెలవులో ఉన్నందున కమీషనర్ వచ్చిన తరువాత ఆయనను కలిసి బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆరోగ్యాధికారిగా ఉన్న డాక్టర్ సుబ్బరాజును తడ పిహెచ్‌సి వైద్యాధికారిగా నియమించారు.

## ఢిల్లీలో నెల్లూరు తమ్ముళ్లు

రాష్ట్రానికి సమన్యాయం చేయాలంటూ ఢిల్లీ ఏపీభవన్‌లో దీక్షకు కూర్చున్న తెలుగుదేశం అధినేత చంద్రబాబును 8వ తేదీ నెల్లూరుకు చెందిన తెలుగుదేశం నాయకులు కలిసి సంఘీభావం ప్రకటించారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా కన్వీనర్ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు పరసారత్నం, కురుగొండ్ల రామకృష్ణ, ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ జి.కన్నబాబుతో పాటు మరి కొందరు నాయకులు బాబును కలిసారు.

## జనరేటర్లకు డిమాండ్

విద్యుత్ ఉద్యోగులు సమ్మెకుదిగడంతో నెల్లూరుజిల్లాలో తీవ్ర విద్యుత్ సంక్షోభం నెలకొనడం తెలిసిందే. ఆదివారం నుండి కరెంట్‌కోతలు మొదలయ్యాయి. నాలుగు గంటలు కరెంట్‌పోతే ఇన్వెర్టర్లతో లాగొచ్చు. కాని నిరంతరాయంగా కరెంట్‌పోతే జనరేటర్లే దిక్కవడంతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వ్యాపారులు జనరేటర్ల బాడుగను రెండింతలు చేసిపెట్టారు.

## ప్రపంచ యోగా పోటీలకు రత్నం విద్యార్థిని



జ్యోష్ణవిని అభినందిస్తున్న జియం రామ్మూర్తినాయుడు

నెల్లూరు దర్గామిట్ట సరస్వతి నగర్‌లోని డా॥కిషోర్స్ రత్నం హైస్కూల్ విద్యార్థిని వై.జోష్ణవి ఈనెల 13న జరుగనున్న ప్రపంచ మెగా చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికై నెల్లూరుకీర్తిని అంతర్జాతీయస్థాయికి చేర్చింది. 7వతరగతి చదువుతున్న జ్యోష్ణవి ఫిబ్రవరి 9 నుంచి 13తేదీల్లో పంజాబ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి యోగాపోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి ఫ్రాన్స్ దేశం ప్యారిస్ నగరంలో జరుగనున్న ప్రపంచస్థాయి పోటీలకు ఎంపిక కావడం నెల్లూరీయులకు గర్వకారణం.

ఈ సందర్భంగా ఈ నెల 5న రత్నం స్కూల్స్‌లో జరిగిన కార్యక్రమంలో డా॥కిషోర్స్ రత్నం స్కూల్స్ జియం రామ్మూర్తినాయుడు వై.జోష్ణవిని, తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, సీఈఓ సంయుక్త, ప్రిన్సిపాల్ వసుంధర, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండండి

- ఎస్పీ రామకృష్ణ



సమైక్యాంధ్ర ఉద్యమ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు పోలీసు అధికారులు నెల్లూరు ఎస్పీ పివియస్ రామకృష్ణ ఆదేశించారు. ఉద్యమం తీవ్రరూపం దాలుస్తున్న తరుణంలో తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం సాయంత్రం ఎస్పీ ఛాంబర్‌లో నగర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎట్టి పరిస్థితుల్లో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పలు జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆస్తులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోనిప్రజాప్రతినిధుల ఇళ్ల, కార్యాలయాలకు భద్రత కట్టుదిట్టం చేయాలన్నారు. ప్రభుత్వ వివిధ పార్టీల కార్యాలయాలు, ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద భద్రతను పెంచాలని, ఉద్యమం ముసుగులో అసాంఘిక శక్తులు విధ్వంసాలకు పాల్పడే అవకాశమున్నందున అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను బైండోవర్ చేసుకోవాలన్నారు. ప్రజాజీవనానికి ఆటకం కలిగించిన వారితో కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి, నగరంలోని సిఐలు పాల్గొన్నారు.

## 'తెలుగుతల్లి' సిడి ఆవిష్కరణ



నెల్లూరు వీఆర్‌సి కూడలిలో ఈనెల 5న సమైక్యాంధ్రను ఆకాంక్షిస్తూ పూర్ణచంద్ర రచించిన పాటల సిడి "బలిపీఠంపై తెలుగుతల్లి" ఆవిష్కరణ జరిగింది. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీఆర్‌సి కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్ దీనిని ఆవిష్కరించగా యస్‌వీఆర్ స్కూల్ కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు, పినాకిని యూత్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, జెవివి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.నారాయణ, ప్రైవేట్ విద్యాసంస్థల జె.ఏ.సి కోకన్వీనర్ షేక్ షంషుద్దీన్, స్టేట్‌లీడర్ సంపాదకులు సర్వేపల్లి రామ్మూర్తి, కవి ఊరిబిండి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, రవి గోగులపల్లి తదితరులు పాల్గొన్నారు. 250సిడిలను ఉచితంగా పంపిణీ చేసారు.

PDF Compressor Free Version



లాయర్
విజయదశమి ప్రత్యేకం

ఓం ఐం హ్రీం శ్రీం
శ్రీ మాత్రే నమః

అమ్మలుగన్న అమ్మ ఆ జగన్మాత, ఆమె రూపాలు అనేకం, ఆమె లీలలు అమోఘం. ఆమె కృపాకటాక్షాలున్న గృహం సుఖసంతోషాల నిలయం. శక్తి మాతగా శ్రీలంక నుండి కాశ్మీరు వరకూ ఆ తల్లి అవతరించిన 18 శక్తి పీఠాల గురించి సమగ్ర సమాచారం అందించే ప్రయత్నమే ఈ "అష్టాదశ శక్తిపీఠాల" కథనం. ఇది 'లాయర్' పాఠకులకు విజయదశమి ప్రత్యేకం. ఈ పీఠాలన్నీ చూడగలిగిన వారి జన్మ సార్ధకం.

# అష్టాదశ శక్తిపీఠాలు

ఈ సృష్టి సమస్తం శక్తి స్వరూపమే. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఈ శక్తి వల్లనే జన్మించారని దేవీ భాగవతం పేర్కొంది. సృష్టి, స్థితి, లయకారకులైన త్రిమూర్తులకు సృష్టి స్థితి లయల్లో వారి దేవేరులైన సరస్వతి, లక్ష్మీ, పార్వతులు సహకరిస్తూ ఉన్నారు. ఈ ముగ్గురిగా ఉన్న మూలశక్తి "ఆదిశక్తి". ఆ ఆదిపరాశక్తి వివిధ ప్రాంతాల్లో, వివిధ పేర్లతో, రూపాలతో కొలువుదీరి ఆరాధనలు అందుకుంటోంది. ఆ దేవి కొలువు దీరిన క్షేత్రాలే "శక్తిక్షేత్రాలు". వీటినే "శక్తిపీఠాలు" అని కూడా అంటారు. అందులో 18ప్రధానమైనవి. అవే అష్టాదశ శక్తిపీఠాలు.

బ్రహ్మదేవుడు సృష్టి ప్రారంభంలో 9మంది ప్రజాపతులను సృష్టించాడు. అందులో బ్రహ్మ వామాంగుష్ఠము నుంచి పుట్టిన దక్షప్రజాపతి ఒకరు. దక్ష ప్రజాపతి భార్య ప్రసూతి. 28మంది కుమార్తెలు జన్మించారు. దక్షుడు వారిలో 27 మందిని చంద్రుడుకిచ్చి పెళ్ళిచేయగా, ఒక కుమార్తె సతీదేవిని పరమశివుడు వివాహం చేసుకున్నాడు.

ఇలా ఉండగా ఒకసారి బ్రహ్మదేవుడు యజ్ఞం చేస్తూ, ఆ యజ్ఞానికి సకలదేవతలను, ప్రజా పతులను, మహర్షులను ఆహ్వానించారు. యజ్ఞానికి హాజరైన వారందరూ ఎవరి స్థానాల్లో వారు కూర్చుని వున్నారు. ఆ సమయంలో దక్షప్రజాపతి బ్రహ్మ యజ్ఞానికి చేరుకున్నాడు. దక్షుడిని చూడగానే దేవతలు, మహర్షులు వారివారి స్థానాల్లో నుంచి లేచి నిలిచి స్వాగతం పలికారు. అయితే శివుడు మాత్రం తన స్థానంలో నుంచి లేవలేదు. దక్షుడికి నమస్కరించలేదు. దీంతో స్వంత అల్లుడై వుండి తనను గౌరవించలేదని దక్షుడికి కోపం కల్గింది. అంతేకాకుండా ఎలాగైనా శివుని అవమానించాలనే ప్రతీకారాన్ని పెంచుకున్నాడు.

ఒకసారి దక్షుడు యజ్ఞం చేయడానికి పూనుకున్నాడు. ఈ యజ్ఞానికి కూతురు సతీదేవిని, అల్లుడు శివుడ్ని మినహాయించి సకలదేవతలను, ప్రజాప్రతులను, మహర్షులను, మిగతా కూతుళ్లను, అల్లుడి(చంద్రుడు)ని ఆహ్వానించాడు. తన తండ్రి చేస్తున్న యజ్ఞ విషయాన్ని నారద మహర్షి ద్వారా సతీదేవి తెలుసుకుని యజ్ఞానికి వెళ్లేందుకు శివుని అనుమతిని కోరింది. పిలవని పేరంటానికి వెళ్ళకూడదని శివుడు సతీదేవికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికి వినకుండా పుట్టింటి మీద ఉన్న మమకారంతో సతీదేవి యజ్ఞానికి వెళ్ళింది.

సతీదేవిని చూస్తూనే దక్షుడు కోపోద్రుక్తుడై ఓ సతీ! నీ భర్త తమోగుణము కలవాడు, క్రోధి, శ్మశానవాసి, కపాలాన్ని ధరించి తిరుగుతూ ఉంటాడు, అపవిత్రుడు... అటువంటివాడు యజ్ఞయాగాదులకు వచ్చేందుకు అనర్హుడు. అందువల్లనే శివుడిని ఆహ్వానించకుండా యజ్ఞాన్ని నిర్వహిస్తున్నాను. అతని భార్యవైన నీవూ అపవిత్రురాలివే, పిలవకనే వచ్చి యజ్ఞాన్ని అపవిత్రం చేసావు, నీవు ఇక్కడ వుండుట తగదు వెళ్ళిపో... అంటూ ఆవేశంతో దక్షుడు కూతుర్ని దూషిస్తాడు.

తండ్రి మాటలు విన్న సతీదేవి కన్నీళ్ళతో భర్త మాటలను వినకుండా ఇక్కడకు వచ్చి అవమానానికి గురయ్యాను. పుట్టింటిలో గౌరవం లేని స్త్రీకి మెట్టినింటిలో కూడా గౌరవం ఉండదని, ఓ పరమేశ్వరా! నీ మాటలు వినక పుట్టింటిమీద మమకారంతో వచ్చినందుకు నాకు తగిన శాస్తి జరిగింది, నన్ను క్షమించండి అని అంటూ యోగాగ్నిలోకి దూకి ఆత్మార్పణం చేసింది. ఈ విషయం తెలుసుకున్న శివుడు ఆవేశంతో తన జటను పెరికి పర్వతానికి కొట్టగా అందులో నుంచి వీరభద్రుడు ఆవిర్భవించి దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేస్తాడు. శివుడు సతీదేవి మృతదేహాన్ని భుజంపై వేసుకుని ఉగ్రుడై లోకమంతా తిరగసాగాడు.

బ్రహ్మ మొదలైన దేవతలందరూ ఈ విషయాన్ని శ్రీ మహావిష్ణువుకు వివరించి అనేక విధాలుగా ఆలోచించారు. చివరకు సతీదేవి దేహం దగ్గరున్నంత వరకూ శివునిలో ఆవేశం తగ్గదని భావించారు. దీనితో విష్ణువు శివుని వెనకాలే అనుసరిస్తూ సతీదేవి శరీరాన్ని తన సుదర్శన చక్రంతో ఖండింపసాగాడు.

ఈ విధంగా సతీదేవి శరీరభాగాలు వివిధ చోట్ల పడ్డాయి. ఆ శరీరభాగాలు పడినచోట్ల శక్తిపీఠాలు వెలిశాయనేది పురాణగాథ. ఈ విధంగా ఏర్పడిన శక్తి క్షేత్రాలు 108 ఉన్నాయని కొందరు, 18 ఉన్నాయని మరికొందరు అభిప్రాయపడ్డారు. అందులో సతీదేవి ప్రధానమైన శరీరభాగాలు పడిన ప్రాంతాల్లో ఆవిర్భవించినవే అష్టాదశ శక్తిపీఠాలు.

జగద్గురు ఆదిశంకరాచార్యులు అష్టాదశ శక్తిపీఠాల గురించి వివరిస్తూ వ్రాసిన శ్లోకం.

లంకాయాం శాంకరీదేవి - కామాక్షీ కాంచికాపురే
ప్రద్యుమ్నే శృంఖలాదేవి - చాముండీ క్రౌంచపట్టణే
అలంపురే జోగులాంబా - శ్రీశైలే భ్రమరాంబికా
కొల్హాపురే మహాలక్ష్మీ - మాహుర్యే ఏకవీరికా
ఉజ్జయిన్యాం మహాకాళీ - పీఠికాయాం పురుహూతికా
ఓఢ్యాణే గిరిజాదేవి - మాణిక్యా దక్షవాటికే
హరిక్షేత్రే కామరూపీ - ప్రయాగే మాధవేశ్వరి
జ్వాలాయాం వైష్ణవిదేవి - గయా మాంగళ్యగౌరికా
వారణాశ్యాం విశాలాక్షి - కాశ్మీరేతు సరస్వతి
అష్టాదశ శక్తిపీఠాని యోగనామపి దుర్లభం



ఈ అష్టాదశ శక్తిపీఠాలు మన దేశంతో పాటు శ్రీలంక దేశంలో కూడా ఒకటి ఉండడం విశేషం. ఈ క్షేత్రాల్లో ఆ జగన్మాత వివిధ పేర్లతో వివిధ రూపాలతో ఆరాధనలందుకుంటూ వుంది.

## 1 లంకాయాం - శాంకరీదేవి



18 శక్తిపీఠాల్లో మొట్టమొదటిది శాంకరీదేవి ఆలయం. జగద్గురు ఆదిశంకరాచార్య ఈ అష్టాదశ శక్తిపీఠాల గురించి వ్రాసిన శ్లోకంలో ముందుగా శాంకరీదేవిని ప్రస్తావించాడు. శ్రీలంక దేశంలో ట్రింకోమలిలో ఈ దేవాలయం వుంది. సతీదేవి తొడభాగంలోని "గజ్జులు" ఇక్కడ పడ్డాయని చరిత్ర చెప్తోంది. గతంలో ఈ ప్రాంతాన్ని అతి తక్కువ స్థాయిలో భక్తులు సందర్శించేవారు. అయితే ఇటీవలకాలంలో అష్టాదశ శక్తిపీఠాల గురించి జరుగుతున్న విస్తృత ప్రచారం కారణంగా భక్తులసంఖ్య ఇక్కడ కూడా క్రమేణా పెరుగుతోందని చెప్పవచ్చు. శ్రీలంకలోని తూర్పుతీరాన వున్న ట్రింకోమలిలో అక్కడ బాగా ప్రసిద్ధిచెందిన శివాలయం తిరుకోనేశ్వరుడి దేవస్థాన ప్రాంగణంలో శాంకరీదేవి కూడా కొలువైవుంది. శ్రీలంకలోని కొలంబో నుండి రోడ్డుమార్గాన దాదాపు 250కిలోమీటర్లు ప్రయాణిస్తే ట్రింకోమలి చేరుకోవచ్చు.

ఇటీవల కొన్ని ప్రైవేటు సంస్థలు హెలికాప్టర్ ద్వారా కొలంబో నుండి ఉదయం వెళ్ళి శాంకరీదేవితో పాటు ట్రింకోమలి పరిసర ప్రాంతాలను సందర్శించి మళ్ళీ సాయంత్రానికి వచ్చేలా ఏర్పాటు చేశారు.

*శ్రీ సతీ శాంకరీ దేవీ త్రింకోమలి పురస్థితా*
*ఉత్తమాంగ ప్రభాగౌరీ భక్త కామ ఫలప్రదా॥*

## 2 కామాక్షీ కాంచికాపురి



పార్వతీదేవి ప్రతిరూపంగా కొలువబడే కామాక్షిదేవి ఆలయం అష్టాదశ శక్తిపీఠాల్లో రెండవది. తమిళనాడులో అత్యంత ప్రసిద్ధి చెందిన కాంచీపురం(కంచి)లో కామాక్షమ్మ కొలువై వుంది. హిందూత్వానికి ఆదిగురువుగా పేర్కొనబడే జగద్గురు ఆదిశంకరాచార్యుల నేతృత్వంలో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందుతోంది. మధురలోని మీనాక్షమ్మ, తిరుచ్చి సమీపంలోని తిరువనైకావల్‌లో వెలసిన అఖిలాండేశ్వరి అమ్మవార్లను సైతం పార్వతీదేవి ప్రతిరూపాలుగా కొలుస్తారు. పల్లవుల రాజధానిగా కాంచీపురం వున్నప్పుడు ఈ దేవాలయాన్ని నిర్మించారని చరిత్ర.

దేవాలయాల నగరంగా పేరొందిన కంచిలోని అమ్మవారు పద్మాసనంతో యోగభంగిమతో నాలుగు చేతులు కలిగి మనకు దర్శనమిస్తుంది. ఓ చేతిలో చెరకుగడ మరో చేతిలో పాశం, మరో చేతిలో అంకుశం ధనస్సు కలిగి పుష్పబాణాలను ధరించి కనిపిస్తుంది. పుష్పాలకు దగ్గరగా ఓ రామచిలక కూడా మనకు కనిపిస్తుంది. కాంచీపురం వందలాది దేవాలయాలకు ప్రసిద్ధి చెందినప్పటికీ కామాక్షమ్మకు ఇక్కడ విశేష ప్రత్యేకతలు వున్నాయని ప్రసిద్ధి. సతీదేవి వీపు భాగం ఈ క్షేత్రంలో పడినట్లుగా చరిత్ర. మద్రాసు అతిసమీపంలో బెంగుళూరు హైవేపై మనకు కాంచీపురం కనిపిస్తుంది. ఇటు తిరుపతి నుండి వెళ్ళాలన్నా కేవలం 90కిలోమీటర్ల దూరంలో "కంచి" కామాక్షమ్మ కొలువైవుంది.

*కాంచీపురాశ్రితే దేవి కామాక్షీ సర్వమంగళా*
*చింతనామాత్ర సంతుష్టా చింతితార్థఫలప్రదా॥*

## 3 ప్రద్యుమ్నే శృంఖలాదేవి



శ్రీ శృంఖలాదేవి ఆలయం గుజరాత్‌లో వుండేదని పురాణాలు చెప్తున్నాయి. అయితే ప్రస్తుతం అక్కడ అలాంటి దాఖలాలు లేవు. కాని కొంతమంది చెప్తున్న ప్రకారం సోమనాథ్ దేవాలయం సమీపంలో వెరవల్ అనే ప్రాంతానికి 5కిలోమీటర్ల దూరంలో ప్రభాస్ అనే ప్రాంతంలో కూడా ఈ దేవాలయం వుండేదని మహమ్మద్ గజని ఈ దేవాలయాన్ని కూల్చేశాదని మరో కథనం వినిపిస్తోంది.

ప్రస్తుతం కలకత్తా సమీపంలో హుగ్లి జిల్లాలోని పాండువా అనే ప్రాంతంలో శృంఖలాదేవి ఆలయం నమూనాలు వున్నట్లుగా చెప్తున్నారు. అక్కడ కొంతమంది ముస్లింలు నిర్మించిన స్థూపం మనకు దర్శనమిస్తుండగా ఆ స్థూపం స్థానే ఒకప్పుడు అమ్మవారి ఆలయం వుండేదని, దాని ఆనవాళ్ళు కూడా అక్కడ లభించాయని అంటున్నారు. అయితే ఈ ప్రాంతానికి దగ్గరలో సుందర్‌బాన్ జిల్లాలో గంగానది వెళ్ళి బంగాళాఖాతంలో కలిసే ప్రాంతంలో హనేశ్వరి దేవాలయం వుండేదని ఆ మందిరాన్ని కూడా శక్తి పీఠమనే చెప్పేవారని స్థానికులంటున్నారు.

అయితే ప్రస్తుతానికి పాండువ వద్ద వున్న స్థూపాన్నే అందరూ శక్తిపీఠంగా పిలుస్తున్నారు, కొలుస్తున్నారు కూడా. సతీదేవి పొట్ట ఈ ప్రాంతంలో పడిందన్నట్లుగా చెప్తున్న ఈ ప్రదేశం కలకత్తాకు 80కిలోమీటర్ల దూరంలో వుంది.

*ప్రద్యుమ్నే వంగరాజ్యాయాం శృంఖలానామ భూషితే*
*శ్రీ విశ్వమోహితే దేవీ శృంఖలా బంధనాశనీ॥*

## 4 చాముండే క్రౌంచపట్టణం



కర్ణాటక రాష్ట్రంలో మైసూరుకు 13కిలోమీటర్ల దూరంలో చాముండీ కొండపైన వెలసిన చాముండేశ్వరీదేవినే నాలుగవ శక్తిపీఠంగా భక్తులు కొలుస్తున్నారు. మైసూరు నుంచి కొండపైకి వెయ్యిమెట్లను ఎక్కి కొండను చేరుకోవచ్చు. 800మెట్ల వద్ద గ్రానైట్‌తో మలచిన నంది, చిన్న శివాలయం దర్శనమిస్తాయి. ఈ నంది 15అడుగులు ఎత్తు, 24అడుగుల పొడవుతో ఉంటుంది.

ఈ క్షేత్రంలో సతీదేవి తలవెంట్రుకలు పడినట్లు ప్రతీతి. కర్ణాటక రాజధాని బెంగుళూరు నగరం నుంచి 155కిలోమీటర్లు దూరంలో మైసూరు ఉంది. అక్కడి నుండి 13కిలోమీటర్లు ప్రయాణిస్తే ఈ నాలుగవ శక్తిపీఠాన్ని దర్శించుకోవచ్చు. మైసూరు మహారాజులు కొన్ని తరాలుగా ఈ మాతను వరాల తల్లిగా, దుష్టసంహారం చేసే శక్తిగా కొలుస్తున్నారు.

*క్రౌంచపుర స్థితా మాతా చాముండా దుష్టనాశినీ*
*సర్వసిద్ధిప్రదా దేవీ భక్తపాలన దీక్షితా॥*

## అలంపురి జోగుల



దక్షిణకాశీగా పేరుపొందిన అలం
రైల్వేస్టేషన్ నుంచి 9కిలోమీటర్లు దూర
కొలువుదీరి వుంది. ఈ క్షేత్రంలో న
ప్రధాన దేవుడు బాలబ్రహ్మేశ్వరస్వామి.
ధ్వంసం చేసారు. శ్రీశైల దేవస్థానం
ప్రతిష్ఠించబడింది. శ్రీ జోగులాంబదేవి
పైదంతపంక్తి పడినట్లు చెప్పబడుతోంది

జోగులాంబను గృహచండిగా కూడా
పాటు ఇంటిని ఎప్పుడూ కళకళలాడే
జోగులాంబ ఆలయంలో ప్రసిద్ధి. జో
చేసినప్పుడు జోగులాంబతో పాటు ఆ
వారి ఆలయంలో 2005సంవత్సరం
కొత్తది నిర్మించి అమ్మవారిని ప్రతిష్ఠిం
అమ్మను ప్రతిష్ఠించారు. ఉగ్రరూపధా
దర్శించుకునే విధంగా ఈ ఆలయాన్ని

కూర్చుని వున్న అమ్మవారి విగ్రహ
ఇక్కడ మనకు దర్శనమివ్వడం విశేష
భారత పురావస్తుశాఖ ఆధీనంలో వుం

*లంబస్తే*
*ప్రేతాసన*

## 6 శ్రీశైలే భ్రమరాంబిక

కర్నూలుజిల్లాలోని శ్రీశైల పుణ్యక్షేత్రంలో మల్లిఖార్జున స్వామి ఆ
శ్రీభ్రమరాంబిక దేవి ఆలయం వుంది. 6వ శక్తిపీఠంగా ప్రసిద్ధిగాంచ
దివ్యమైన అలంకారం కారణంగా ఆమె సౌమ్యమూర్తిగా శాంతిమాత
లోపయిద్ర మూర్తి కూడా ఈ గర్భగుడిలో మనకు కనిపించడమేకాక
నిత్యం పూజలందుకుంటూ వుంటుంది.

పవిత్ర కృష్ణానదీతీరాన వెలసిన ఈ క్షేత్రంలో పడిన సతీదేవి
ఆరవ శక్తిపీఠంగా పిలువబడుతోందని అంటారు.

*శివపార్శ్వస్థితా మాతా శ్రీశైల*
*భ్రమరాంబా మహాదేవి కరుణారస*

## కొల్హాపురే మహాల



మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో అ
"కరవీరక్షేత్రం" అని పేరు. నీటిలో మ
క్షేత్రానికి ఆ పేరు వచ్చింది. ఈ అ
దర్శనమమిస్తుంది. మహారాష్ట్రలో పూ
కొల్హాపురం వుంది. మన రాష్ట్రంలోని

ఈ క్షేత్రంలో సతీదేవి కళ్ళు పడి
శక్తిపీఠం మహాలక్ష్మి ఆలయం వెలసిం

*పురుషే*

## 8 మాహుర్యే ఏకవీరిక

ఏకవీరికా దేవి ఆలయం మహారాష్ట్రలోని మాహూర్‌లో వుంది.
ఆలయాన్నే ఎక్కువ మంది శక్తిపీఠంగా కొలుస్తున్నారు. ఏకవీరిక
ఎక్కువమంది రేణుకాదేవి ఆలయాన్నే ఈ విధంగా ప్రచారం చేశారు. కా
యవత్‌మాల్ జిల్లాలో వుంది. ఈ ఆలయాన్నుండి కినేవత్ అనే ప్ర
నాందేడ్‌కి 125కిలోమీటర్ల దూరంలో ఆలయం వుంది. నాగపూర్ న
కొలువయ్యింది. రేణుకాదేవి అక్కగా ఏకవీరికను కొలుస్తారని ప్రసి
ఇది. పాన్‌పరాగ్, సుపారీలను రుబ్బి ఘనపదార్థంగా చేసి అమ్మవా

యవత్‌మాల్ నుండి 8కిలోమీటర్లు ప్రయాణించి అక్కడి మెయి
మనకు ఏకవీరికా ఆలయం దర్శనమిస్తుంది. ఇక్కడ పూజారి వుండ
మనకు దర్శనమిస్తుండగా, ఆ సమాధి చరిత్ర ఎవ్వరికీ తెలియదు. య
మాత సతీదేవి కుడి హస్తం ఇక్కడ పడిన కారణంగా ఏర్పడిందని ప్ర

*తత్రాత్రేయ సమారాధ్యా అనసూయాత్రిసేవితా ఏకవీరా*
*రేణుకా హతా మాయా సంహారరూపిణీ కృపయాపాతున*

సౌజ
రత్నం వి

PDF Compressor Free Version



5

ఐ

మన రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాలో వుంది. అలంపూర్
, కర్నూలు నగరం నుంచి 27కిలోమీటర్ల దూరంలో శ్రీ జోగులాంబ
్మల చేత ప్రతిష్ఠింపబడిన తొమ్మిది లింగాలు వున్నాయి. వీరిలో
శతాబ్దంలో బహమనీ సుల్తానులు పాత జోగులాంబ దేవాలయాన్ని
ంలో ప్రత్యేక ఆలయం నిర్మింపబడి శ్రీ జోగులాంబ అదే స్థలంలో
ాళ్ళపై కూర్చొని ఉగ్రరూపంతో ఉంటుంది. ఈ క్షేత్రంలో సతీదేవి

్తారు. ఇంటిలో మానసిక ప్రశాంతత, దుష్టగ్రహాల నుండి విమోచనంతో
ిర్వదించడానికి వాస్తుదోష నివారణ పూజలు కూడా ఈ శక్తిమాత
ఐ ఆలయాన్ని 14వ శతాబ్దంలో బహమనీ సుల్తానులు ధ్వంసం
రూపాలైన చండి, ముండిలను అక్కడే వున్న బాలబ్రహ్మేశ్వరస్వామి
భద్రపరచి, గతంలో ఆలయం వున్న చోటనే అత్యంత సుందరంగా
చుట్టూ నీళ్ళకొలను ఏర్పాటుచేసి మధ్యలో ఆలయాన్ని నిర్మించి
ున జోగులాంబను నీటికొలను ద్వారా వచ్చే చల్లని గాలుల మధ్య
ుచినట్లు స్థానికులు చెప్తున్నారు.
కురులలో బల్లి, తేలు, గుడ్లగూబలతో పాటు మానవపుర్రె కూడా
్యంత పురాతన ఆలయంగా ప్రసిద్ధిచెందిన జోగులాంబ ఆలయం
లంపూర్‌లో తుంగభద్ర నదీతీరాన ఈ 5వ శక్తిపీఠం కొలువైవుంది.

*ృతాక్షేం ఘోరరూపాం మహోదరాం*
*ముక్తాం జోగుళాంబాం నమామ్యహం॥*

ానికి వెనుక వైపున ఎత్తైన ప్రాంతంలో
మరాంబిక తల్లి ఉగ్రరూపమైనప్పటికీ
నకు దర్శనమిస్తుంది. అగస్త్యుని భార్య
ిడికి ఎదురుగా వున్న శ్రీచక్ర యంత్రం
ాగం కారణంగా అష్టాదశశక్తి పీఠాల్లో

*శే*
*ూనా॥*



7


ం

్యాత శ్రీ మహాలక్ష్మిగా కొలువుతీరి ఉంది. కొల్హాపురానికి పూర్వం
ోయిన క్షేత్రాన్ని శ్రీ మహాలక్ష్మి తన కరములతో పైకెత్తినందువల్ల ఈ
ారు సుమారు మూడు అడుగుల ఎత్తులో శివలింగ ఆకారంలో
హుబ్లీ రైలుమార్గంలో మీరజ్ స్టేషన్‌కు 40కిలోమీటర్ల దూరంలో
ంతి నుంచి కొల్హాపూరానికి రైలు వుంది.
ప్రతీతి. పంచగంగానదీ తీరాన ఈ కొల్హాపుర నగరంలో 7వ

*క్ష్మీదా దేవీ కరవీరపురస్థితా*
*ిదా మాతా సంపూర్ణామృతవర్షిణీ॥*

ానికి ఈ ప్రాంతంలో వున్న రేణుకాదేవి
ుం గురించి సమాచారం తెలియక
కవీరికామాత ఆలయం మహారాష్ట్రలోని
50కిలోమీటర్ల దూరంలో వుండగా
210కిలోమీటర్ల దూరంలో ఈ అమ్మ
300సంవత్సరాల పురాతన ఆలయం
ాదంగా ఇక్కడ ఇస్తారు.
్ల నుండి 300మీటర్లు లోపలకు వెళ్తే
ుడి ఎదురుగా ఒక గోమాత సమాధి
ూల్‌లో వున్న 8వ శక్తిపీఠం ఏకవీరికా

*ాదేవి మస్తకేనైవశోభినీ*
*ూర్ మహరాష్ట్రే ఏకవీర్యకా॥*



9

## ఉజయిన్యాం మహాకాళీ



మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కి 50కిలోమీటర్ల దూరంలోని ఉజ్జయినిలో మహాకాళి అమ్మవారి శక్తిపీఠం వెలసింది. సతీదేవి పైపెదవి ఇక్కడ పడిన కారణంగా ఈ పీఠం వెలసిందని చరిత్రచెప్తోంది. ఇక్కడ అమ్మని హరసిద్ధి మాతగా కొలుస్తారు. ఇక్కడ ప్రధాన ఆలయం మహాకాళేశ్వర మందిరానికి దగ్గరలో అమ్మ ఆలయం వుంది. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన మహాకాళేశ్వర ఆలయంలో ప్రతిరోజూ స్వామివారిని ఉదయం సాయంత్రం ప్రత్యేక అలంకరణలతో పూజిస్తారు. షిప్రా నది నుండి తెచ్చిన బంక మట్టితో స్వామివారికి చేసే అలంకరణ ఇక్కడ ప్రత్యేకం. ఇక్కడ వాడే విభూది శ్మశానం నుండి వస్తుందని పెద్దలు చెప్తుంటారు. హరసిద్ధి మాతగా పిలువబడే మహాకాళి అమ్మవారి శక్తిపీఠం ప్రధాన ఆలయానికి అతిసమీపంలో వుండడం విశేషం.

*ఉజ్జయిన్యాం మహాకాళీ మహాకాళేశ్వరేశ్వరీ*
*క్షిప్రాతీరస్థితామాతా వాంఛితార్థ ప్రదాయినీ॥*



10


## పీఠికాయాం పురుహూతిక

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా కాకినాడ నుండి 18కిలోమీటర్ల దూరంలోని పిఠాపురంలో పురుహూతికా మాత శక్తిపీఠం వుంది. ఇక్కడ ప్రసిద్ధి చెందిన కుక్కుటేశ్వరస్వామి(ఈశ్వరుడు) ఆలయం ప్రాంగణంలోనే పురుహూతికా దేవి పదవ శక్తిపీఠంగా అవతరించింది. అమ్మవారి పేరు పురుహూతికాదేవి, వూరి పేరు పిఠాపురం కావడంతో ఇక్కడ "శ్రీ పురుహూతికా పీఠం" కూడా ఏర్పడింది. ఇక్కడికి ఆంధ్రరాష్ట్రం నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు విశేషరీతిలో వస్తుంటారు. సతీదేవి ఎడమహస్తం పడిన కారణంగా ఏర్పడిన పురుహూతికా మాత శక్తిపీఠం విశేషరీతిలో పూజలు ఆరాధనలు అందుకుంటోంది.

*పురుహూతీ సతీ మాతా పీఠికాపుర సంస్థితా*
*పుత్రవత్పాలితాదేవీ భక్తానుగ్రహదాయినీ॥*

11

## ఒడ్యాణే గిరిజాదేవి



పదకొండవ శక్తిపీఠంగా గిరిజాదేవి మాతను కొలుస్తారు. ఒరిస్సా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ నుండి 120కిలోమీటర్ల దూరంలోగల జాజ్‌పూర్‌లో ఈ ఆలయం వుంది. ఇక్కడ మాతను బిరిజాదేవిగా, విరిజాదేవిగా కూడా కొలుస్తారు. అతి చిన్న ఆలయంగా కనిపించే ఇక్కడ అమ్మవారు పూలతోను, ఆభరణాలతోను అలంకరించబడి కన్పిస్తుంది. ప్రకాశవంతమైన ముఖతేజస్సుతో, కాంతివంతమైన నేత్రారవిందంతో, చిరునవ్వును చిందిస్తూ భక్తులను ఆశీర్వదించే శక్తిమాత ఇక్కడ మనకు దర్శనమిస్తుంది. పూర్తిగా బంగారు ఆభరణాలను పొదిగిన వెండి కిరీటం అమ్మవారి శిరస్సుపై అలంకారమై వుంటుంది. తమ పూర్వీకులకు పిండప్రదానం చేయడానికి అధిక సంఖ్యలో ఇక్కడ భక్తులు ప్రాధాన్యతనిస్తారు. ఇక్కడ చేసే పిండ ప్రదానం నేరుగా కాశీకి చేరుతుందని వారి నమ్మకం. అలాగే ఇక్కడ వున్న బావి కేవలం 4 లేదా 5 అడుగుల లోతైనదైనప్పటికీ ఇప్పటి వరకూ ఒక్కసారి కూడా ఎండిపోవడం ఇంకిపోవడం వంటివి జరక్కపోవడం విశేషం. సతీదేవి నాభి భాగం ఇక్కడ పడిన కారణంగా ఈ 11వ శక్తిపీఠం గిరిజాదేవిగా ప్రఖ్యాతిగాంచిందని చరిత్ర.

*ఓఢ్రదేశే భువనేశీ గిరిజానామ సంస్థితా*
*పాలికాళ్ళికాలోకానాం పల్లవారుణపాణినీ॥*



12


## మాణిక్యా దక్షవాటికా

12వ శక్తిపీఠం మాణిక్యాంబ ఆలయం మన రాష్ట్రంలోనే తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు 33కిలోమీటర్ల దూరంలో వుంది. దక్షుడు యజ్ఞం నిర్వహించిన ప్రదేశంగా ఈ ప్రాంతానికి చాలా ప్రాముఖ్యత వుంది. భీమేశ్వరుడిగా పిలువబడే శివాలయం ఇక్కడ ప్రసిద్ధి. దాదాపు పది అడుగుల ఎత్తు కలిగిన శివలింగం ద్రాక్షారామంలో మనకు దర్శనమిస్తుంది. మాణిక్యాంబగా శక్తిమాత ఇక్కడ అవతరించింది. సతీదేవి వంపభాగం ఇక్కడ పడిన కారణంగా మాణిక్యాంబ 12వ శక్తిపీఠంగా కొలువబడుతోంది.

*దాక్షావటీ స్థితాశక్తిః విఖ్యాతా మాణిక్యాంబికా*
*వరదా శుభ్రాదేవీ భక్తమోక్ష ప్రదాయినీ॥*

13

## కామరూపే హరిక్షేత్రం



అత్యంత పవిత్రమైన ప్రధాన ఆలయాలలో అస్సాం రాష్ట్రంలోని కామరూప్ జిల్లాలో నిలంచల్ కొండపైన వెలసిన కామాఖ్యాదేవి ఆలయం అతిముఖ్యమైనది. శక్తిపీఠాల్లో 13వ పీఠంగా పిలువబడుతున్న ఈ ఆలయం గౌహతి నుండి 8కిలోమీటర్ల దూరంలో వుంటుంది. సతీదేవి ప్రతిరూపంగా కామాఖ్యా అమ్మను ఇక్కడ కొలుస్తారు. అక్కడ స్థానికులు ఆమెని సోడషిదేవిగా కూడా పిలుస్తారు. పురాణాల ప్రకారం సతీదేవి యోనిభాగం ఈ ప్రాంతంలో పడిన కారణంగా ఈ శక్తిపీఠం ఆవిర్భవించిందని తెలుస్తోంది. కామాఖ్యదేవి మందిరం సహజసిద్ధంగా ఏర్పడిన గుహ లోపలి భాగంలో వుంటుంది. ఇక్కడ నీటి వూట కూడా మనకు 365రోజులూ కనపడడం విశేషం. మెట్లలాంటి దారిలో బాగా లోతుగా గుహలోపలి భాగంలో ఎలాంటి నిర్మాణము లేదా ప్రతిష్ఠ లేకుండా సహజసిద్ధంగా యోని ఆకారంలో కామాఖ్యమాత కన్పిస్తుంది. సహజసిద్ధంగా వచ్చే నీటితో తడుస్తూ ఈ ప్రాంతమంతా చల్లగా ఆహ్లాదంగా వుంటుంది. చీరతో పూలాలంకరణతో పాటు సింధూరభరితమై మాత దర్శనం ఇస్తుంది. ప్రతి సంవత్సరం ఆషాఢ శుక్లపక్ష సప్తమి మొదలుకొని ఏకాదశి వరకు ఈ నీరు ఎర్రగా మారుతుంది. అంటే ప్రతి స్త్రీకి ఋతుక్రమం ఉన్నట్లే ఈ అమ్మవారికి కూడా ఉందని, ఈ ఐదు దినాలు బహిష్టు దినాలనీ భావిస్తారు. ఆలయం మూసివేస్తారు. అంతరాళ మండపంలో అమ్మవారి విగ్రహాంను ఉంచి పూజిస్తారు. చారిత్రాత్మక బలిదేవతగా కామాఖ్యాశక్తిమాతకు పేరుండడంతో ఇక్కడ రోజూ భక్తులు మేకలను బలిస్తుంటారు.

*కామారూపిణీ విఖ్యాతా హరిక్షేత్రే సనాతనీ*
*యోని ముద్రాత్రి ఖండేసి మాసే మాసే నిదర్శితా॥*

్యం :

# ్యాసంస్థలు

PDF Compressor Free Version



## 14 ప్రయాగే మాధవేశ్వరి



గంగ, యమున, సరస్వతి సంగమిస్తున్న త్రివేణీ సంగమ స్థానంలో ఆ జగజ్జనని శ్రీ మాధవేశ్వరి దేవిగా కొలువుదీరివుంది. క్రీ.శ. 16వ శతాబ్దంలో అక్బర్ ప్రయాగను అలహాబాద్‌గా మార్చాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలహాబాద్ నగరానికి దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి రైల్వే సౌకర్యం వుంది. నగరం మధ్యలో శ్రీ మాధవేశ్వరిదేవి ఆలయం వుంది. ఈ క్షేత్రంలో సతీదేవి చేతివేళ్ళు పడినట్లు ప్రతీతి.

ఇక్కడ 14వ శక్తిమాతైన మాధవేశ్వరి అమ్మవారిని మాతాజీ అని లేదా లలిత అని కూడా భక్తులు పిలుస్తుంటారు. ప్రతిరోజు సాయంత్రం 7గంటలకు అమ్మకు హారతి వుంటుంది.

*మాధవేశ్వరీ మాంగళ్యే ప్రయాగ స్థలవాసినీ*
*త్రివేణీ సంగమే తీరే భక్తిముక్తి ప్రదాయినీ॥*


## 17 వారణాశ్యాం విశాలాక్షి



అత్యంత ప్రాచీన ఆధ్యాత్మిక నగరంగా పేరుపొందిన వారణాశికే కాశి అని పేరు. వారణాశిలో అమ్మలగన్నయమ్మ విశాలాక్షిదేవిగా కొలువుదీరి పూజలందుకుంటుంది. విశాలాక్షి దేవాలయాన్ని పలుమార్లు ఔరంగజేబు ధ్వంసం చేసాడు. 1776లో అహల్యాబాయి ఈ దేవాలయాన్ని పునర్నిర్మించింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో వున్న ఈ పవిత్రక్షేత్రానికి దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి రైలు సౌకర్యం వుంది. ఈ క్షేత్రంలో సతీదేవి మణికర్ణిక(మణికట్టు) పడినట్లు చెప్పబడుతోంది.

*విశాలాక్షీతి విఖ్యాతా వారణాస్యాం శివాంతికే*
*నిరతాన్న ప్రదాత్రీచ నిర్భాగ్యజనతోషిణీ॥*


## 15 జ్వాలాయం వైష్ణోదేవి



భారతదేశంలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్న హిందూ దేవాలయంలో వైష్ణోమాత ఆలయం రెండవస్థానంలో వుంది. తిరుమల వెంకన్న తరువాత యేడాదికి సుమారు 80లక్షల మంది భక్తులు వైష్ణోమాతను దర్శించుకుంటారు. అష్టాదశ శక్తిపీఠాలలో ప్రతిష్ఠాత్మక పీఠంగా వైష్ణోశక్తి పీఠాన్ని భక్తులు కొలుస్తారు. భారతదేశంలోని జమ్మూకాశ్మీర్‌లో వైష్ణోదేవి కొండలపై మాతకొలువై, మాతారాణిగా వైష్ణోదేవిగా భక్తులచేత కీర్తించబడుతోంది. రైసి జిల్లాలో కాత్రా పట్టణానికి 14కిలోమీటర్ల దూరంలో 5200అడుగుల ఎత్తున కొండపై ఈ పీఠం వుంది. ఉత్తర భారతదేశంలో అత్యధిక జనాభా పూజించే ఆధ్యాత్మిక కేంద్రం వైష్ణోదేవి శక్తిపీఠం అని చెప్పవచ్చు. ముఖ్యంగా సతీదేవి శిరస్సు ఈ ప్రాంతంలో పడినందున ఈ శక్తిపీఠానికి ఇంత ప్రాముఖ్యత వుందన్నది నానుడి.

*తహినాద్రి స్థితామాతా జ్వాలాముఖీతి విశ్రుతా*
*జ్వాలామాలా ప్రభాదేవి జ్ఞాన వైరాగ్య వర్ధిని॥*

## 18 కాశ్మీరేతు సరస్వతి



అష్టాదశ శక్తిపీఠాలు ఈ పేరు వింటేనే ఈ 18శక్తిపీఠాల గురించి తెలుసుకోవాలని, వీలయితే అన్నింటిని చూసి తరించాలని అందరికీ వుంటుంది. ఈ శక్తి పీఠాలలో చివరిది సరస్వతీమాత శక్తిపీఠం. అయితే ఈ పీఠం మన దేశంలోని కాశ్మీర్‌లో వున్నప్పటికీ ప్రస్తుతం పాక్ ఆక్రమిత కాశ్మీర్ భాగంలోకి వెళ్ళిపోయింది. శ్రీనగర్‌కు 10కిలోమీటర్ల దూరంలో వున్న ఈ పీఠం సతీదేవి హస్తం పడిన కారణంగా ఏర్పడినదని పురాణాలు చెప్తున్నాయి. అప్పుడప్పుడు ఇక్కడకు వెళ్ళడానికి పాక్‌సైన్యం సడలింపుని ఇస్తుందని సమాచారం. ఒకటి రెండు చోట్ల మినహా మిగతా అన్ని ప్రాంతాలలోనూ ఈ శక్తిపీఠాలను మనం దర్శించుకొని జన్మను సార్థకం చేసుకోవచ్చు.

*నమస్తే శారదాదేవి కాశ్మీర పురవాసిని*
*త్వామహం ప్రార్థయే నిత్యం విద్యాదానంచ దేహిమే॥*

## 16 గయా మాంగల్యగౌరిక



బీహార్ రాష్ట్రంలోని గయనగరంలో మంగళగౌరి కొండపైన మాంగల్యగౌరి శక్తిదేవతకు సంబంధించిన 16వ పీఠం వుంది. దయామూర్తిగా, కరుణామాతగా మాంగల్యగౌరిదేవిని ఇక్కడి భక్తులు కొలుస్తారు.

ఈ శక్తిపీఠం గురించి పద్మపురాణం, వాయుపురాణం, అగ్నిపురాణంలో ప్రస్తావించబడినట్లు చరిత్ర చెప్తోంది. 1459లో ఈ ఆలయ నిర్మాణం జరిగి శక్తిమాత మాంగల్యగౌరికి అంకితంగావించబడినట్లు నానుడి. సతీదేవి వక్షస్థలి అయిన శరీరభాగం ఇక్కడ పడినందున ఇక్కడ వక్షస్థలాలను పోలిన రెండు గుండ్రని రాళ్ళనే దేవతా శక్తిమాతగా భక్తులు పూజిస్తారు.

*సర్వమంగళ మాంగళ్యా గయా మాంగల్య గౌరికా*
*అర్థదా మోక్షదాదేవి అక్షయ ఫలదాయినీ॥*

అష్టాదశ శక్తిపీఠాల యొక్క స్తోత్రాన్ని నిత్యం చదివితే మృత్యుభయం వుండదని, సర్వవ్యాధులూ దూరమై, దరిద్ర్యం నశించి సకల సుఖాలు కలుగుతాయని అంటారు. ఈ స్తోత్రాన్ని రోజు రెండు పూటలా స్మరించుకోగలిగితే శత్రునాశనంతో పాటు దుష్టగ్రహ దోషాలన్ని తొలగిపోయి మనశాంతిగా జీవితాన్ని సాగించవచ్చన్నది పెద్దల మాట. ఇన్ని మంచి ఫలితాలను కేవలం స్మరించుకుంటేనే అందించే ఈ అష్టాదశ శక్తిపీఠాలను దర్శించుకోగలిగితే జన్మ ధన్యమే.

*లలితాదేవి, శ్రీదేవి, దుర్గ, మహాలక్ష్మి, మహాసరస్వతి, మహాకాళి,*
*రాజరాజేశ్వరి, త్రిపుర సుందరి... ఇవన్నీ జగదంబ నామములే!*
*విశ్వచైతన్యమే జగదంబ! ఆమె నుండే త్రిగుణములు,*
*పంచభూతముల సృష్టి ఏర్పడుతోంది. ఇవే ఆమె అష్టప్రకృతులు.*
*అందులోని చైతన్యమాయే. అష్టప్రకృతులకు మూలం కనుక*
*ఆమెయే మూలప్రకృతి! సృష్టికి మూలాధారము కూడా ఆమే!*
*అవ్యక్త స్థితి యందు సత్యముగాను, వ్యక్తి స్థితియందు*
*మహాచైతన్యముగాను విరాజిల్లునదియే శ్రీమాత!!!*


విజయదశమి శుభాకాంక్షలతో...



కె.వి.రత్నం
కె.పద్మావతి రత్నం

కె.వేణుగోపాల్
కె.రమావేణుగోపాల్

డా॥ కె.కృష్ణకిషోర్
కె.వాసంతి కిషోర్

రత్నం విద్యాసంస్థలు

PDF Compressor Free Version



# చీకట్లో సింహపురి

సింహపురి సమాచారం



- నిప్పులాంటి ఉద్యమం
- మెరుపు సమ్మెతో విద్యుత్ ఉద్యోగులు
- ఆగిన పలు రైళ్ళు
- పతాకస్థాయికి సమైక్య సమ్మె

సమైక్యాంధ్ర ఉద్యమం నిప్పులామారింది. సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ విద్యుత్ ఉద్యోగులు ఆదివారం నుండి మెరుపు సమ్మెకు దిగారు. దీంతో నెల్లూరుజిల్లాలో తీవ్ర విద్యుత్‌సంక్షోభం నెలకొంది. నెల్లూరు నగరంతో పాటు అన్ని పట్టణాలు, గ్రామాల్లో చీకట్లు అలుముకున్నాయి. 8వ తేదీ విద్యుత్ ఉద్యోగులు సీఎంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో విద్యుత్‌సమ్మె అలాగే కొనసాగుతుంది. పగలంతా కరెంటు తీసేసినా, రాత్రివేళల్లో విద్యుత్‌ను అందిస్తుండడంతో ప్రజలు కాస్తా ఊపిరి పీల్చుకోగలుగుతున్నారు. ఈ కరెంటు కోతలు నెల్లూరుజిల్లాలో ప్రత్యక్షంగా పరోక్షంగా అన్ని వర్గాలపై ప్రభావం చూపాయి. రాష్ట్రం విడిపోతే బతుకు అంధకారమేనంటూ సరఫరా నిలిపి వేయడంతో చీకట్లు అలుముకున్నాయి. ఓ ప్రక్క ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణీకులు రైళ్ళ మీద ఆధారపడితే, విద్యుత్తు సరఫరా లేకపోవడంతో పలురైళ్ళు నిలిచిపోయి ప్రయాణీకులకు దిక్కుతోచని పరిస్థితి ఎదురయ్యింది. సమైక్యాంధ్ర ప్రకటన వెలువడే వరకు సమ్మె విరమించేదిలేదని ఉద్యోగుల ఐకాస ప్రకటించింది. తెలంగాణ నోట్‌పెడితే మెరుపు సమ్మెకు దిగుతామని హెచ్చరించిన విద్యుత్‌శాఖ కార్మికులు, ఇంజనీర్లు ఆదివారం నుండి నిరంతరాయంగా సమ్మెను కొనసాగిస్తుండడంతో ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.



ఈ నెల 8వ తేదీన సమైక్యాంధ్రకు మద్దతుగా నెల్లూరులో భారీబైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న నెల్లూరు వైకాపా సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఇతర వైకాపా నాయకులు.

## అంతర్జాతీయ పోటీల్లో...
# 'రెయిన్‌బో' విద్యార్థిని ప్రతిభ



ప్రపంచ మెమొరీ స్పోర్ట్స్ కౌన్సెల్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెల 28, 29తేదీల్లో హాంకాంగ్‌లో నిర్వహించిన మెమొరీ బైనరీ డిజిట్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లూరు నగరంలోని "రెయిన్‌బో" స్కూలు విద్యార్థిని చవిజైన్ మూడవస్థానంలో నిలిచి అంతర్జాతీయ ఖ్యాతిగడించింది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని అభినందనసభను మంగళవారం స్కూలులో నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూలు డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రథమస్థానంలో ఫిలిప్పిన్స్, ద్వితీయస్థానంలో మంగోలియాకు చెందిన విద్యార్థులు నిలిచారన్నారు. చవిజైన్‌ను హాంకాంగ్ మెమొరీస్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు అండే ఫాంగ్, వరల్డ్ మెమొరీస్పోర్ట్స్ కౌన్సెల్ డిప్యూటీ ఛీఫ్ జెన్నిఫర్ ప్రశంసాపత్రం, జ్ఞాపికతో అభినందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణస్వయంప్రభ పాల్గొన్నారు.

# మరుభూమిలో బొరుగులు ఏరుకోవద్దు

**- అన్నలకు తమ్ముడు హితవు**




పాదయాత్రలో ఆనం జయకుమార్‌రెడ్డి

ముఖ్యమంత్రి కుర్చీకోసం మరుభూమిలో బొరుగులు ఏరుకోవద్దని మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఆయన సోదరుడు ఆనం జయకుమార్‌రెడ్డి హితవు పలికారు. సమైక్యాంధ్రకు మద్దతుగా సోమవారం జయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ములుమూడి బస్టాండ్ సెంటర్ నుంచి పెద్దబజార్ సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామనారాయణరెడ్డి అవకాశవాదంతో సీఎం కుర్చీకోసం రాష్ట్ర విభజనకు మద్దతు పలకడం తగదన్నారు. కాంగ్రెస్‌తో జగన్ కుమ్మక్కయ్యారని వివేకా ఆరోపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రజాప్రతినిధులుగా రాష్ట్ర విభజనను అడ్డుకోలేక దద్దమ్మలుగా మిగిలిపోయారని దుయ్యబట్టారు.

# మూతబడ్డ కేంద్ర కార్యాలయాలు

సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా ఈనెల 8,9తేదీల్లో ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి కాయల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నెల్లూరులోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ఉద్యమకారులు ముట్టడించారు. దీంతో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఎఫ్‌సిఐ కార్యాలయం, ఇన్‌కంటాక్స్ కార్యాలయం జాతీయ బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకులు మూతపడ్డాయి. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.మధుసూదన్‌రావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు షఫీమాలిక్, నాయకులు ప్రసాద్, తోట శ్రీనివాసులు, ఆనందరావు, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

# దరిద్రుడు దినేష్‌రెడ్డి

**- ఆనం వివేకా**



రాష్ట్ర చరిత్రలో దినేష్‌రెడ్డి లాంటి దరిద్రపు డిజిపిని తాను చూడలేదని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ధ్వజమెత్తారు. సీఎం కిరణ్‌పై దినేష్‌రెడ్డి చేసిన ఆరోపణలను వివేకా తనదైన స్టైల్‌లో తిప్పికొట్టారు. 8వ తేదీ సాయంత్రం ఏ.సి సెంటర్‌లో విలేకరుల సమావేశం పెట్టి దినేష్‌రెడ్డిని నోటికొచ్చినట్లు తిట్టారు. మా నెల్లూరోడు, మా బంధువు డిజిపి అయ్యాడని దినేష్‌రెడ్డిని డిజిపిని చేసినరోజు గర్వపడ్డాం. కాని ఇలాంటి దౌర్భాగ్యుడిని డిజిపిని చేసినందుకు, ఇతను నెల్లూరీయుడైనందుకు ఈరోజు సిగ్గుపడుతున్నాం. టీఆర్ఎస్‌కు అమ్ముడుపోయి కేసీఆర్‌కు వాచ్‌మెన్‌గా తయారయ్యాడు దినేష్‌రెడ్డి. వాళ్లు చెప్పిన విధంగా సీఎంపై ఆరోపణలు చేస్తున్నాడు. కనీసం వృత్తి ధర్మాన్ని కూడా పాటించడం లేదు. పదవీవిరమణ చేసి వీడ్కోలు పలికాక కూడా మళ్ళీ పదవి కోసం నీచాతినీచపు పనులు చేస్తున్నాడు. ఏ.పి ఎన్‌జిఓల సభకు ఈయన అనుమతిచ్చేదేంటి... సీఎం ఆర్డర్ వేస్తే చచ్చినట్టు ఇవ్వాలి... రాష్ట్ర విభజన జరిగితే నక్సల్స్ సమస్య పెరుగుతుందని ఈయన చెబితేనే కేంద్రం తెలుసుకోవాలా? కేంద్రంకు ఇంటలిజన్స్ వ్యవస్థ లేదా? ఈయన చెప్పిన దానిమీదే వాళ్లు ఆధారపడుతారనుకుంటున్నారా? హైదరాబాద్‌లో వున్న తన ఆస్తులను కాపాడుకోవడానికే దినేష్‌రెడ్డి టీఆర్ఎస్ వాళ్లకు అమ్ముడుపోయాడు. డిజిపిగా రాష్ట్రంలో ఈయన పొడిచిందేమీ లేదు. తనకు గిట్టని వారిపై కక్ష సాధింపుచర్యలకు పూనుకున్నాడు. తనను విమర్శించాడని మాజీమంత్రి శంకర్‌రావునే రెండుసార్లు అరెస్ట్‌చేయించాడు. జర్నలిస్టులపై కేసులు పెట్టించాడు. నెల్లూరుజిల్లాలో రెండు సూట్‌కేసుల మనీ స్కీం డబ్బుతో దుగరాజపట్నం వద్ద 200 ఎకరాల భూములు కొన్నాడు. తనకు సూట్‌కేసులు అందిస్తున్నాడని చెప్పి గత ఎస్పీ రమణకుమార్‌ను జిల్లాలో పోలీసు వ్యవస్థ విఫలమైనా కూడా కొనసాగించాడు. ఇతని మీద అక్రమాస్తుల కేసులున్నాయి. సిబిఐ కేసుల్లో మంత్రులే జైళ్లకు పోవాల్సి వచ్చింది. ఇక ఈయనెంత. దినేష్‌రెడ్డి ఆస్తుల మీద సిబిఐకి ఫిర్యాదు చేయబోతున్నానని వివేకా చెప్పుకొచ్చారు.

# పోలీసు భద్రత పటిష్టం

**నెల్లూరుకు చేరిన సీఐఎస్ఎఫ్ బలగాలు**

సమైక్యాంధ్ర ఉద్యమం ఉధృతమవుతున్న నేపధ్యంలో పోలీసుల భద్రతను పటిష్టం చేస్తున్నారు. నెల్లూరుజిల్లా వ్యాప్తంగా అదనపు బలగాలను మోహరిస్తున్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా మరిన్ని అదనపు బలగాలను రప్పిస్తున్నారు. ఇటీవల తెలంగాణా నోట్‌కు కేంద్ర కేబినేట్ ఆమోదం తెలిపినప్పటి నుంచి నిరసనల హోరు పెరిగింది. మూడు నాలుగు రోజులుగా పరిస్థితి మరింత జటిలంగా మారడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా పోలీసులతో పాటు పారా మిలిటరి బలగాలను రంగంలోకి దించారు. సిఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ, ఒంగోలు, నెల్లూరు డిటీసీలకు చెందిన సుమారు 800మంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. తాజాగా ఆదివారం అర్ధరాత్రి కేరళ నుంచి 77 మందితో కూడిన సిఐఎస్ఎఫ్ బృందం నెల్లూరుకు చేరింది. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు స్పెషల్ పార్టీ పోలీసులను సిద్ధంగా ఉంచారు. ఉద్యమం ముసుగులో అసాంఘిక శక్తులు చెలరేగకుండా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో పరిస్థితిని ఎస్పీ రామకృష్ణ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

# సోనియా దత్తపుత్రులు జగన్, కెసిఆర్

**- బీద రవిచంద్ర ధ్వజం**



సోనియా దత్తపుత్రులు జగన్ కెసిఆర్ అని, వీరి స్వార్థ రాజకీయాలతోనే రాష్ట్ర విభజన జరుగుతోందని తెలుగు దేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర విమర్శించారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఢిల్లీలో చేపట్టిన దీక్షకు మద్దతుగా ఆ పార్టీ నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులో ఏడుచోట్ల ప్రధానమార్గాలపై ఆదివారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు. సోనియా దత్తపుత్రులు జగన్, కెసిఆర్ అని రాసి ఉన్న ఫ్లెక్సీలను తగులపెట్టారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ సీమాంధ్ర ప్రాంత ప్రజల మనోభావాలను తుంగలో తొక్కి కాంగ్రెస్‌పార్టీ దొడ్డిదారిలో తెలంగాణ నోట్‌ను ఆమోదించిందని ఆగ్రహం వ్యక్తం చేసారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పదవిని వదలకుండా ఉద్యమాన్ని నీరుగార్చాలని చూస్తుంటే ఆయన సోదరుడు ఆనం వివేకానందరెడ్డి మాత్రం ఉద్యమం పేరుతో నాటకాలు వేస్తున్నారని విమర్శించారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజనకు ఆద్యుడు వైయస్ఆర్ అని, ఆయన కుమారుడు జగన్ తన బెయిల్ కోసం కాంగ్రెస్‌తో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. సమైక్యాంధ్ర సాధనకు తెలుగుదేశంపార్టీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం సుబ్బారావు, పడవల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## తీరిన చిరకాల కోరిక... జిల్లా ఎస్పీ కానుక
# కానిస్టేబుళ్ళలో ఆనందం

22ఏళ్ళుగా పదోన్నతి పొందని నెల్లూరు జిల్లాలోని కానిస్టేబుళ్ళకు పదోన్నతి కల్పిస్తూ ఎస్పీ వీవీఎస్ రామకృష్ణ చర్యలు చేపట్టడం 145మంది కానిస్టేబుళ్ళకు ఆనందాన్ని కలిగిస్తోంది. 1992 బ్యాచ్‌కు చెందిన వీరు విధుల్లో చేరినప్పటి నుంచి అలాగే వుండిపోయారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో పనిచేస్తున్న వీరితోపాటు చేరిన ఆ బ్యాచ్ కానిస్టేబుళ్ళు హెడ్‌కానిస్టేబుళ్ళుగా, ఎస్సైలుగా పదోన్నతి పొంది వున్నారు. కాని వీరికి మాత్రం 22ఏళ్ళుగా ఎటువంటి పదోన్నతి లేదు. ఇటీవల జిల్లా ఎస్పీ రామకృష్ణకు వీరు తమ సమస్యను తెలుపగా స్పందించి 145మంది కానిస్టేబుళ్ళకు హెచ్‌సిలుగా పదోన్నతి కల్పించేందుకు చర్యలు చేపట్టారు. దీనిని దసరా కానుకగా భావిస్తూ వీరందరూ ఆనందాన్ని వెలిబుచ్చారు.

PDF Compressor Free Version



## కదంబం

## మిత్రలాభం - మిత్రభేదం

కందుకూరి శ్రీరాములు
9440119245, హైదరాబాద్

మైదానం పచ్చపడటం ఇష్టపడనివాడు
వర్షానికి శత్రువు
మనం ఆనందపడుతూ
ఎదుటివాని ఆనందకోసం
పాటుపడే ప్రవృత్తికావాలి మనది
కలహభోజనం లోకనాశనానికి దారితీయకూడదు
సలపటం మొదలైతే మన ఏకాగ్రత దెబ్బతింటుంది
మిత్రభేదంలోని తప్పును తెలుసుకుని
మిత్రలాభంలోని ఒప్పును గ్రహించినవాడే మనిషి
వెన్నుపోట్లు
చీకటి యుద్ధాలు
మెత్తని కత్తులు
ఇవన్నీ లిపిలేని భాషలు
విచిత్ర వేషాలు కనిపించని మోసాలు
ఈర్ష్య అసూయ ద్వేషం
త్రిసూత్ర పథకాన్ని మెడలో వేసుకోవద్దు
ఇది ఎంత మాత్రమూ విజయానికి సంకేతంకాదు
నీ సలహాలు సాపకింది నీళ్ళలానో
నీ సజెషన్స్ కంట్లో నలుసులానో
ఉండకూడదు
నీ గుండె నిర్మలంగా ఉంటే
నీ రక్తనాడులు స్వచ్ఛంగా ఉంటాయి
గరళ సముద్రాన్ని
క్షీర సంద్రంగా మార్చలేం
నీళ్ళల్లో విషం చుక్కలు కలుపకుండా చూద్దాం!
ఐదు వేళ్ళు
అన్నం ముద్ద అందిస్తున్నాయి అనుకుంటుంది
కడుపు
లోభత్వం బురదలోపడి
చేతుల్ని నరికేసుకోవద్దు
సమిష్టి సంతోషం కోసమైనా
నువే నడుంకట్టాలి
అందరి ఆనందమే నీ ఆనందంకావాలి

## రాహుల్ కిక్ కోసం సీమాంధ్రలో మంటలు

శ్రీను గల్పిక

అది దేపిస్టులకు, శాడిస్టునేతలకు నిలయంగా వున్న ఢిల్లీ మహానగరం. ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ నివాసం. కేబినెట్ భేటీకి అంతా సిద్ధమైంది. ఆరోజు కేబినెట్ భేటీలో తెలంగాణనోట్ పెట్టబోతున్నారనే సమాచారంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మీడియా ఛానల్స్ వాళ్ళంతా చేరుకున్నారు. కేంద్ర హోంమంత్రి షిండే ప్రధాని నివాసంలోకి పోతుండగా జంతర్‌మంతర్ ఛానల్ విలేకరి ఆపి... ఈరోజు కేబినెట్‌భేటీలో తెలంగాణ నోట్‌ను ప్రవేశపెడుతున్నారా? అని ప్రశ్నించాడు. దానికి షిండే... ఏమో నాకు తెలీదు. ఆ నోట్ మీద నేనింకా సంతకం పెట్టలేదంటూ ప్రధాని నివాసంలోకి వెళ్ళిపోయాడు. మన్మోహన్‌సింగ్‌తో పాటు షిండే, చిదంబరం, ఆంటోని, వీరప్పమొయిలీ, గులాంనబీ ఆజాద్, శరద్‌పవార్, అజిత్‌సింగ్, కావూరి సాంబశివరావు, ఎం.ఎం.పల్లంరాజులు సమావేశమయ్యారు. షిండే వుండి... ఈరోజు కేబినెట్ భేటీలో తెలంగాణ నోట్ ఒక్కటే ప్రధానాంశం... సిడబ్ల్యూసి చేసిన తీర్మానాన్ని మనం యథావిధిగా ఆమోదిస్తే సరిపోతుందన్నాడు. మన్మోహన్ వుండి.. దానికి అభ్యంతరం ఏముంది... అందరి వద్దా సంతకాలు తీసుకోండి... ఎవరి దారినవాళ్ళు వెళ్ళండి అని చెప్పాడు. అప్పుడు కావూరు సాంబశివరావు వుండి... సార్, మా పట్ల దయచూపండి, భేటీ అయిన ఐదునిముషాలలో తెలంగాణనోట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందని తెలిస్తే మేం బయటకు వెళ్ళలేం... ఓ గంట పాటూ ఇక్కడే వుంటాం... ఈ గంట మీ అమెరికా పర్యటన విశేషాలు చెప్పండి, వింటాం. లేదంటే టీవీ పెట్టుకుని ఏదన్నా హిందీ సినిమా చూద్దాం. గంట తర్వాత బయటకెళితే మేం తెలంగాణ నోట్‌పై గట్టిగా వాదించామని చెప్పుకోవడానికన్నా ఆస్కారముంటుంది. లేదంటే మా పరిస్థితి తిరునాళ్ళలో కుక్క మాదిరిగా అవుతుందన్నాడు. పల్లంరాజు కూడా ఆయనకు వంతపాడాడు. దాంతో ప్రధానికి జాలేసి అలాగేనని చెప్పాడు. తర్వాత అందరికీ ఇంట్లో నుండి స్వీట్లు, ఆలూబజ్జీలు, పానీపూరీలు తెప్పించిపెట్టాడు. అమెరికా పర్యటన విశేషాల గురించి చెబుతా... ఇండియాలో వుంటే నాకెప్పుడూ ప్రధానినన్న ఫీలింగ్ వుండేది కాదు. కాని అమెరికాలో మాత్రం నేను భారత ప్రధానిని అనే ఆత్మస్థైర్యం బలంగా వుండిందని చెప్పాడు. దానికి ఆంటోని అందుకుని... అక్కడ మేడమ్ లేదు కదా సార్, అందుకే వుంటుందని చెప్పాడు. ఇలా కబుర్లతో ఒకటిన్నరగంట సేపు పిచ్చాపాటి మాట్లాడుకుని బయటకొచ్చేసారు.

★★★★★

టెన్‌జనపథ్‌లో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు టీవీ చూస్తున్నారు. అక్కడే చిరంజీవి, పురందేశ్వరి, జె.డి.శీలం, పనబాక లక్ష్మి, చింతా మోహన్, కొండ్రు మురళి, బొత్స సత్యనారాయణ, పి.బాలరాజు, కిల్లి కృపారాణి వంటి సమైక్యాంధ్ర వ్యతిరేకులున్నారు. రాహుల్ వుండి... మమ్మీ సీమాంధ్రలో ఆందోళనలు తగ్గినట్లుగా వుంది... ప్రజలు ఎవరి పనులకు వాళ్ళు పోతున్నారు, పాఠశాలలు పని చేస్తున్నాయి, రెండు నెలలు సీమాంధ్రలో ఉద్యమం సీన్‌లు చూస్తూ భలే ఎంజాయ్‌చేసాను. వాళ్ల కరెంట్ వాళ్ళు ఆపుకుని, వాళ్ల ఆస్తులు వాళ్ళు తగలబెట్టుకుంటూ వాళ్ల కడుపులు వాళ్ళు మాడ్చుకునే సీన్‌లు చూస్తుంటే భలే 'కిక్' అనిపించేది. కాని సీమాంధ్రలో మళ్ళీ మామూలు పరిస్థితులొస్తున్నాయి. నాకేం నచ్చడం లేదు. నాకు కిక్ కావాలి... అక్కడ ఇంకా పెద్ద ఎత్తున మంటలు రేగాలని గోముగా అడిగాడు. అప్పుడు సోనియా... బేటా నేను నీ తల్లిని. మాది ఏ దేశం అనుకుంటున్నావ్.. రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించుకుంటున్నాడంటారు చూడు... ఆ దేశం మాది. ఆ లక్షణాలు నాలో వుండవా? నీ కిక్‌కు ఏ లోటూ రానీయను... దానికి తగ్గ ఏర్పాటు చేసాను, అటుచూడు అంటూ టీవీవైపు చూపించింది. అప్పుడే టీవీ స్క్రీన్‌పై షిండే కనిపిస్తున్నాడు. మీడియావాళ్లు మైకులతో చుట్టుముట్టారు. షిండే మాట్లాడుతూ... ఇప్పుడే కేబినెట్ భేటీ ముగిసింది. 10జిల్లాలతో కూడిన తెలంగాణ ఇస్తున్నాం... హైదరాబాద్ కూడా వాళ్లదే! వాళ్లు ఇంకా ఏం అడిగినా చేయడానికి సిద్ధంగా వున్నాం. ఈ దేశాన్ని వాళ్లకు రాసివ్వమన్నా వ్రాసిస్తాం... ఎందుకంటే మాకు కావాల్సింది వాళ్ల సీట్లు... సీమాంధ్రవాళ్లు కుక్కినపేనుల్లా వుండి రాష్ట్ర విభజనకు సహకరించాలి. వాళ్లకేమన్నా కావాలంటే సోనియమ్మను అడుక్కుంటే పరిశీలిస్తాం... అని చెప్పి వెళ్లిపోయాడు. షిండే మాటలతో సీమాంధ్రలోని 13జిల్లాల్లో ఒక్కసారిగా ఆందోళనలు పెరిగాయి. సమైక్యవాదులు రోడ్లమీదకొచ్చి ఆందోళనలు చేయసాగారు. పోలీసుల లాఠీఛార్జీలు, వారిపై సమైక్యవాదుల రాళ్లదాడులు, రోడ్లమీద టైర్లు వేసి కాల్చడం వంటి దృశ్యాలు టీవీలలో ప్రసారంకాసాగాయి. వాటిని చూస్తూ రాహుల్... కిక్ అంటే ఇది. ప్రతి రోజూ ఇలా వుంటే భలే వుంటుంది అని టీవీచూస్తూ హుషారుగా ఎంజాయ్ చేయసాగాడు. రాహుల్ బాబుకు మరింత కిక్ తెప్పించాలని చెప్పి పనబాక లక్ష్మి పని గట్టుకుని ఒక టీవీ వాళ్లకు ఫోన్ చేసి... నేను విభజన వాదిని. నేను రాజీనామా చేసే ప్రసక్తే లేదు. ఈ ప్రజలు కోన్‌కిస్కా గొట్టాలు అని చెప్పింది. ఆ ప్రకటన వెంటనే బ్రేకింగ్ న్యూస్‌లో వచ్చింది. అది చూసి సీమాంధ్రలో జనం మరింతగా రెచ్చిపోయారు. పనబాక దిష్టిబొమ్మలు తగులబెట్టారు. ఆ దృశ్యాలు చూసి రాహుల్ నవ్వుతుంటే పనబాకకు తెగ సంతోషమేసింది. వెంటనే చింతా మోహన్ కూడా తనవంతు క్రెడిట్ సాధించేందుకు... కాంగ్రెస్ చెప్పినట్లే నేను చేస్తాను, ఓట్లేసిన ప్రజలు చెప్పినట్లు కాదు అని స్టేట్‌మెంట్ వదిలాడు. ఆయన ప్రకటనను టీవీలలో చూసిన సమైక్యవాదులు తిరుపతిలో ఆందోళనలు చేసారు. ఆయన దిష్టిబొమ్మను తగలబెట్టారు. ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి పాల్పడ్డారు. ఈ దృశ్యాలను రాహుల్ ఇంకా ఎంతో ఆసక్తితో చూసాడు. ఆయనకు అప్పటికే కిక్ తలదాకా ఎక్కింది. ప్రజలను ఎంతగా రెచ్చగొడితే రాహుల్‌కు అంతగా కిక్ వుంటుందని బొత్స సత్యనారాయణ పసిగట్టాడు. వెంటనే ఆయన మీడియాకు ఫోన్‌చేసి... కాంగ్రెస్ అధిష్టానమే మా దైవం... కాంగ్రెస్‌ను ఎవరేమన్నా వూరుకోం... అని చెప్పాడు. తన ప్రకటనతో సీమాంధ్రలో ప్రజలు ఇంకా రెచ్చిపోతారని, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసానికి పాల్పడుతారని తనకు రాహుల్ దృష్టిలో ఇమేజ్ పెరుగుతుందని బొత్స మనసులో వూహించుకోసాగాడు. బొత్స ప్రకటన అన్ని టీవీ ఛానెల్స్‌లో రాసాగింది.

కొద్ది నిముషాలకే టీవీలలో పెను విధ్వంసకర సన్నివేశాలు రాసాగాయి. తగలబడుతున్న భవనాలు, పగలగొడుతున్న బస్సుల సీన్‌లు చూస్తూ రాహుల్... కిక్ అంటే ఇది... ప్రజలు రెచ్చిపోవడమంటే ఇది... కొట్టండి.. తగలబెట్టండి... అని కేకలు వేయసాగాడు. నా ప్రకటన రాహుల్ బాబుకు భలే కిక్ ఇచ్చిందనుకుంటూ బొత్స టీవీ వైపు చూసాడు. అంతే ఆయన నెత్తిన అరడజను పిడుగులు ఒకేసారి పడ్డట్లయ్యింది... ఎందుకంటే అక్కడ పగులుతున్నది, తగలబడుతున్నవి విజయనగరంలోని ఆయన ఆస్తులే!

అంగరంగ వైభవంగా జరుగుతున్న

## దసరా ఉత్సవాలు

నెల్లూరు జిల్లాలో శరన్నవరాత్రోత్సవ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నెల్లూరు నగరం దర్గామిట్టలో వెలసియున్న శ్రీ రాజరాజేశ్వర అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న 39వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఈనెల 5వతేది నుండి ప్రారంభమయ్యాయి. అమ్మవారు 5వతేది శనివారం శ్రీ చండీ అలంకారము, 6వతేదీ ఆదివారం శ్రీ భవానీ అలంకారము, 7వతేదీ సోమవారము గాయత్రీ అలంకారము, 8వతేదీ మంగళవారము శ్రీ అన్నపూర్ణ అలంకారము, 9వతేదీ బుధవారము శ్రీ గజలక్ష్మి అలంకారము, 10వతేదీ గురువారము శ్రీ సరస్వతి అలంకారము, 11వతేదీ శుక్రవారము శ్రీ కాళికా అలంకారములతో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపారాధనలు చేసి నోములు నోచుకున్నారు. ప్రతిరోజు ఆలయ ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు



అమ్మ వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు తదితర కార్యక్ర మాలను విశేషంగా నిర్వహించారు. ప్రతిరోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రత్నంజయరాం, సహాయక కమీషనర్, కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

**కన్యకాపరమేశ్వరి ఆలయంలో:**

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో వేంచేసియున్న శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈనెల 5వతేదీ శనివారము నుండి దేవీ శరన్నవ రాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకులు అమ్మ వారికి శ్రీ సూక్తసప్తశతి పారాయణం, దేవీనవావరణం తదితర పూజలను ప్రతిరోజూ నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఛైర్మెన్ మునగా వెంకటేశ్వర్లు ధర్మకర్తల మండలి సభ్యులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

**ఇరుకళల పరమేశ్వరి ఆలయం:**

నెల్లూరు మూలాపేటలో వెలసియున్న సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 5వతేదీ నుండి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి, శ్రీ అన్నపూర్ణ, శ్రీగజలక్ష్మి, శ్రీ సరస్వతి, శ్రీ దుర్గా, శ్రీ భవానీ, శ్రీ చండీ అలంకారాల్లో భక్తులకు కనువిందు చేసారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఏవి శ్రీనివాసులురెడ్డి ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

**శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానము:**

నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేటలో వేంచేసియున్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానంలో ఈనెల 5వతేదీ శనివారం కలశ స్థాపనతో ప్రారంభమై వైభవోపేతంగా నిర్వహింపబడుతోంది. శ్రీ పరమేశ్వరి, శ్రీ బాలాత్రిపురసుందరి, శ్రీ మహాలక్ష్మి, శ్రీ అష్టకాళి, శ్రీ సరస్వతి, శ్రీ గాయత్రి, శ్రీ అన్నపూర్ణ అలంకారములతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఛైర్మెన్ ఐసనాక హర్షవర్ధన్ రెడ్డి కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షణలో కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.

**శ్రీ జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానం:**

నెల్లూరుజిల్లా టిపిగూడూరు మండలం వరిగొండ గ్రామంలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 5వతేదీ నుండి దేవిశరన్నవరాత్రి మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, నవావరణ పూజలు, సామూహిక అక్షరాభ్యాసాలు తదితర పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ సోమన శ్రీనివాసులురెడ్డి ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

**మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానాల్లో:**

నెల్లూరు నగరంలోని మూలాపేట బ్రాహ్మణవీధి పెన్షన్‌లైన్, సంతపేట, కంసాలివీధి, ఉస్మాన్ సాహెబ్‌పేట, సరస్వతినగర్, టెక్కేమిట్ట, నవాబుపేట తదితర ప్రాంతాల్లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానాల్లో దేవిశరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా విశేషపూజలు, లలితా సహస్రనామ పూజలు, నిర్వహించారు. భక్తులు వేలాదిగా పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

PDF Compressor Free Version



**మేషం** (అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము)
ఆర్థికంగా సంతృప్తికరం. ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాల ఖర్చులు, ప్రయాణ ఖర్చులు పెరుగుతాయి. ప్రభుత్వ అనుమతులు, ప్రభుత్వ కార్యాలయాలలో పనులు ఆలస్యంకాగలవు. షేర్మార్కెట్ నిరుత్సాహ పరుస్తుంది. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. సంప్రదింపులు, ఒప్పందాలు కుదిరే అవకాశం కలదు. రావలసిన బాకీలు వాయిదా పడగలవు.

**వృషభం** (కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర1, 2పాదాలు)
కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. దూర ప్రయాణాలుంటాయి. ఖర్చులు పెరిగినా రాబడికి లోపం రాదు. సేవా సంస్థలకు వ్యక్తులకు సహాయపడతారు. స్థిరాస్తుల లావాదేవీలు, కొనుగోలు ఖరారు చేస్తారు. ఉద్యోగులకు పని సామర్థ్యం, అధికారులకు స్థానమార్పు ఉంటుంది. వ్యవహారాలలో సముచిత నిర్ణయాలు తీసుకోవడం, అనుకొన్న పనులు సక్రమంగా జరగడం ఉంటుంది.

**మిధునం** (మృగశిర 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు)
ఆర్థిక లావాదేవీలను, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఆదాయం పెరుగుతుంది. అదనపు ఖర్చులు కూడా పెరుగుతాయి. స్థిరాస్తులు కొనడం, క్రొత్త వస్తువులు, గృహోపకరణములను సమకూర్చుకొనడం జరుగుతుంది. వివాహ నిర్ణయాలు, దూర ప్రయాణాలు చేయడం జరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరుకును. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది.

**కర్కాటకం** (పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష)
ఆగిపోయిన పనులను మరలా కొనసాగిస్తారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. తొందర పాటు మాటలు, పనులు చేయకండి. ఉద్యోగులు తమకు క్రొత్త సమస్యలు, ఇబ్బందులు తలఎత్తకుండా చూసుకొనాలి. అధికారులకు పనిభారం పెరుగుతుంది. అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడగలవు.

**సింహం** (మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము)
అనుకున్న పనులు సజావుగా సాగుతాయి. ప్రముఖులను కలుసుకొంటారు. ఆర్థికాభివృద్ధి ప్రయత్నాలలో కొన్ని గట్టి నిర్ణయాలు తీసుకొనడం జరుగుతుంది. ఉద్యోగులు ఇబ్బందులలో పడకుండా జాగ్రత్త పడాలి. అధికారులకు స్థానమార్పులు పనిభారం ఎక్కువకాగలదు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. అనుకోని స్వల్ప ఆదాయం చేకూరడం జరుగుతుంది.

**కన్య** (ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు)
కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. ఋణాలు చేయవలసిరావచ్చును. వ్యవహారాలు, నిర్ణయాలలో తొందరపాటు వద్దు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు ఆపడం మంచిది. ఎక్కువ శ్రమ, ఇబ్బందిపడి పనులు సాధించుకొంటారు. ప్రభుత్వ పనులు వాయిదా పడతాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు కలుగుతాయి. కుటుంబసభ్యులతో సంఘీభావం సరిగా ఉండకపోవచ్చును.


బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 11.10.2013 నుండి
తేది. 17.10.2013 వరకు

ఈ వారము మేషంలో కేతువు, మిధునంలో గురువు, సింహంలో కుజుడు, కన్యలో రవి, తులలో శని బుధ రాహువులు, వృశ్చికంలో శుక్రుడు, ధనుర్మకర కుంభ మీన రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 11 శుక్రవారం సరస్వతీ పూజ
తేది 12 శనివారం దుర్గాష్టమి
తేది 13 ఆదివారం మహార్నవమి
తేది 14 సోమవారం విజయదశమి

### ముహూర్తములు

తేది 17 గురువారం ఉదయం గంట 8.30 నుండి గంట 10.30 లోగా వృశ్చికలగ్నమున వివాహ వ్యాపారములు.

### ఆశ్వయుజ శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 11 | శుక్ర | సప్తమి | సా॥గం. 6.43వ॥ |
| తేది. 12 | శని | అష్టమి | సా॥గం. 4.17వ॥ |
| తేది. 13 | ఆది | నవమి | ప॥గం.1.53వ॥ |
| తేది. 14 | సోమ | దశమి | ప॥గం. 11.39వ॥ |
| తేది. 15 | మంగళ | ఏకాదశి | ఉ॥గం. 9.32వ॥ |
| తేది. 16 | బుధ | ద్వాదశి | ఉ॥గం.7.46వ॥ |
| తేది. 17 | గురు | త్రయోదశి | ఉ॥గం.6.18వ॥ |
| | పిదప | చతుర్దశి | రా॥గం.5.05వ॥ |

**తుల** (చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)
వృత్తి వ్యాపారాలు ఆశావహంగా ఉండి, ఆదాయము పెరుగుతుంది, కాని ఏదో ఒక రూపంలో ఖర్చులుపైన బడుతుంటాయి. పెద్ద మొత్తములలో పెట్టుబడులు, స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసుకొనడం మంచిది. ఉద్యోగులకు పనిభారం, అధికారులవల్ల వత్తిడి పెరుగుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. కుటుంబంలో స్వల్ప విభేదాలు ఉండవచ్చును.

**వృశ్చికం** (విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)
ముఖ్యవిషయంపై బంధుమిత్రులతో సంప్రదింపులు జరుపుతారు. హామీలు, అప్పులు ఇవ్వడం చేయకండి. వ్యాపార వర్గాలకు ఆర్థికావకాశాలు సన్నగిల్లడం, ఆదాయం తగ్గడం జరుగుతుంది. అనుకున్న పనులు సరిగా జరగవు. ఆస్తి వ్యవహారాలు, కోర్టు వ్యవహారాలలో ఇబ్బందులుంటాయి. డబ్బు, వస్తువులను జాగ్రత్తగా కాపాడుకొనండి. దైవకార్యాలలో పాల్గొంటారు.

**ధనుస్సు** (మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము)
వ్యాపార రంగాలలో భాగస్వామ్యాలకు, పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. ఆదాయం కొద్దిగా పెరుగుతుంది. వస్తు, వాహన రిపేరు ఖర్చులు పెరగుతాయి. షేర్లు నిరుత్సాహ పరుస్తాయి. శుభకార్యాలలో పాల్గొన్నందువల్ల అదనపు ఖర్చులుంటాయి. శుభవార్తలు వింటారు. ప్రభుత్వ అనుమతులు వాయిదా పడవచ్చును. దూర ప్రయాణాలుండగలవు.

**మకరం** (ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు)
అవసరాలకు డబ్బు సర్దుబాటు అగును. వ్యాపార వర్గాలకు పురోభివృద్ధి రాబడి స్వల్పంగా పెరగడం జరుగుతుంది. ప్రభుత్వ పరంగా పనులందు ఆలస్యముంటుంది. శుభకార్య ప్రయత్నాలలో ఆలస్యం జరుగుతుంది. ఉద్యోగులపై పనిభారం అధికారుల వత్తిడి ఉంటుంది. క్రొత్త కాంట్రాక్టులు లీజుకు, వ్యాపార భాగస్వామ్య అవకాశాలు దొరుకుతాయి.

**కుంభం** (ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.)
వ్యవహార దక్షత బాగుండి పనులను నిర్వహిస్తారు. శుభకార్య నిర్ణయాలు చేస్తారు. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు దొరకగలవు. పెద్దల పరిచయాలు మంచి చేస్తాయి. అధికారులకు స్థాన మార్పులుంటాయి. నూతన వ్యాపార ప్రారంభ ప్రయత్నాలు జరగడం, దైవకార్యాలు, సామాజిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మీనం** (పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి)
ఆర్థిక ఇబ్బందులుండగలవు. వ్యాపార వర్గాలకు అవకాశాలు తప్పిపోవచ్చును. శాస్త్ర సాంకేతిక వైద్య రంగాల వారికి మంచి అవకాశాలు దొరకడం, గుర్తింపు లభిస్తుంది. రావలసిన బాకీలు కొంత మేరకు అందవచ్చును. ప్రయాణాలు రద్దు కావడం, ప్రయాణాలలో ఇబ్బందులు పడటం జరుగుతుంది. అనుకున్న పనులు నిదానంగా జరుగగలవు.

# పొదలకూరులో "దళిత గర్జన"



పొదలకూరులో ఈనెల 6న సమైక్యాంధ్ర కోసం దళితులు చేపట్టిన "దళిత గర్జన" సభలో వైఎస్సార్సీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ ఎవరికి అధికారం కట్టబెట్టాలన్నా, పదవీచ్యుతులను చేయాలన్నా దళితులే నిర్ణయించగలరన్నారు. దళితులు విశ్వాసపాత్రులు, అధికార నిర్ణేతలన్నారు. ఆర్టికల్ 3 ప్రకారం సమన్యాయంతో రాష్ట్రాలను విడదీసే అధికారం డా॥అంబేద్కర్ రాజ్యాంగంలో కేంద్రానికి వుండేలా సూచించారని, కాని కేంద్రం సమన్యాయం పాటించకుండా రాష్ట్ర విభజన ప్రకటనచేసిందని దుయ్యబట్టారు. పొదలకూరులో ఈ "దళితగర్జన" మిగిలిన సీమాంధ్ర ప్రాంతాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. టీనోట్ కేంద్ర కెబినేట్‌లో ఆమోదం పొందినంత మాత్రాన సమైక్యవాదులు ఢీలాపడిపోనక్కర్లేదని పేర్కొన్నారు. బిల్లు లోక్‌సభ, రాజ్యసభ, అసెంబ్లీల్లో ఆమోదం పొందాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు జెండాలను పక్కనపెట్టి ఉద్యమంలో సమైక్యాంధ్ర కోసం ఉధృతంగా పాల్గొనాలన్నారు.

కార్యక్రమంలో వైయస్సార్సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, బిరుదవోలు శ్రీకాంత్‌రెడ్డి, బ్రహ్మయ్య, నేతలు మద్దిరెడ్డి రమణారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి, పోలిరెడ్డి, పొదలకూరు సర్పంచ్ తెనాలి నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దొంగలకు ఫుల్ టిఫిన్

ఓ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంట్లో ఉన్న విద్యుత్ మోటారును ఇద్దరు వ్యక్తులు చోరీచేసేందుకు ప్రయత్నిస్తున్నండగా స్థానికులు గమనించి వారిని పట్టుకుని దేహశుద్ధి(ఫుల్‌టిఫిన్)చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన ఆదివారం రాత్రి నెల్లూరు నగరంలోని మైపాడు గేటు ప్రాంతంలో చోటు చేసుకుంది. నెల్లూరు నగరం రెండవ నగర పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాసనగర్ రోడ్డు ప్రక్కన పాడుపడిన ఇల్లు వుంది. దీంట్లో కొంతకాలంగా ఎవరూ ఉండటంలేదు. దాన్ని ఆసరాగా చేసుకున్న దుండగులు ఆ ఇంట్లో ఉన్న విద్యుత్ మోటారును చోరీకి ప్రయత్నించారు ఇది గమనించిన స్థానికులు వారిని పట్టుకుని రెండవ నగర పోలీసులకు అప్పగించారు.

# ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్, టీడీపీలు

**డా॥అనిల్‌కుమార్ యాదవ్**

నెల్లూరు విజయమహల్‌గేట్ దగ్గరగల రాజన్నభవన్‌లో ఈనెల 6న వైఎస్సార్సీపీ నెల్లూరు నగర సమన్వయకర్త డా॥పి.అనిల్ కుమార్‌యాదవ్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీమాంధ్ర కేంద్రమంత్రులు ప్రజలను మభ్యపెట్టేలా మోసపు ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఉత్తుత్తి ప్రకటనలతో ఎంపీలు, మంత్రులు రాజీనామాలు చేయకుండా సమైక్యాంధ్ర కోరుతున్న ప్రజల ఆగ్రహానికి ఆజ్యంపోస్తున్నారన్నారు. కాంగ్రెస్, టీడీపీలు రెండూ చిత్తశుద్ధి లేకుండా తెలంగాణలో ఒకరకంగా, సీమాంధ్రలో మరోరకంగా ప్రకటనలు చేస్తూ ప్రజలను మోసగిస్తున్నారన్నారు. వైఎస్సార్సీపీ రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి సమైక్యాంధ్ర కోసం పోరాడుతుంటే జీర్ణించుకోలేని టిడిపి అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అవాకులు చవాకులు పేలుతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్, వైఎస్సార్సీపీ కుమ్మక్కయ్యాయని చంద్రబాబు అనడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని కాంగ్రెస్‌తో జగన్మోహన్‌రెడ్డి ఒప్పందం కుదుర్చుకుంటే 16నెలల జైలు జీవితం ఎందుకు గడిపేవారని ప్రశ్నించారు. ఆనాడు పార్లమెంటులో సమైక్యాంధ్రకోసం జగన్మోహన్‌రెడ్డి ప్లకార్డులను ప్రదర్శించారన్న విషయం టీడీపీ నేతలు గుర్తిస్తే మంచిదన్నారు. అలాగే నెల్లూరులో ఆనం సోదరులు ప్రజలకంటే పదవులే ముఖ్యమన్న తీరులో వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్ అధిష్టానానికి అమ్ముడుపోయి ఆనం రామనారాయణరెడ్డి హైదరాబాదులో ఒక ప్రకటన, ఎమ్మెల్యే వివేకా నెల్లూరులో మరొక ప్రకటన చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్సీపీ నేతలు ముక్కాల ద్వారకానాథ్, సంక్రాంతి కల్యాణ్, వెంకటేశ్వరరెడ్డి, గంధం సురేష్‌బాబు, షేక్ ఖాసింసాహెబ్, పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, ముప్పసాని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సోనియా గోబ్యాక్ టు ఇటలీ

సమైక్యాంధ్ర విద్యార్థి ఐకాస నెల్లూరు వీఆర్‌సికూడలిలో ఈనెల 6న రాష్ట్ర విభజన ప్రక్రియకు నిరసనగా సోనియా గాంధీ దిష్టిబొమ్మను దగ్ధంచేసింది ఈసందర్భంగా విద్యార్థి ఐకాస రాష్ట్ర కోకన్వీనర్ ఆదిత్యసాయి మాట్లాడుతూ తెలుగు సంస్కృతి ప్రజల మనోభావాలు తెలియని, గుర్తించని సోనియాగాంధీ ఇటలీకి వెళ్ళిపోవాలని పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందని వారు రాష్ట్ర విభజన చేయడం హేయమైన చర్యకాదా అని ప్రశ్నించారు. దీనిని ఆపాలంటే కేంద్రమంత్రుల రాష్ట్రమంత్రులు మూకుమ్మడిగా రాజీనామా చేయాలన్నారు. లేకుంటే వాళ్ళ ఇళ్ళు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సోనియాగాంధీ గోబ్యాక్‌టు ఇటలీ అని నినాదాలు చేస్తూ ఫ్లెక్సీని ప్రదర్శించారు. మిన్నంటే నినాదాలతో విద్యార్థులు నిరసన తెలిపారు.

## పేడతో పిండ ప్రదానం

సీమాంధ్ర ద్రోహులైన సోనియాగాంధీ, కేసీఆర్, షిండే, ఆనం రామనారాయణరెడ్డి, బొత్స సత్యనారాయణ, పనబాక లక్ష్మి, కేటీఆర్, కోదండరాం, కవిత, మన్మోహన్‌సింగ్, హరీష్‌రావు, చిదంబరం ఫోటోలకు 5వ తేదీన పేడతో పిండప్రదానం చేసారు. తెలుగునాడు విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నెల్లూరులో వినూత్నంగా నిర్వహించిన కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.తిరుమలనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర విభజనకు కారకులైన సీమాంధ్ర ద్రోహులు ప్రజల దృష్టిలో ఎప్పుడో మరణించారని వారికి పేడతో పిండ ప్రదానం చేసి రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకునేలా చరమగీతం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్ముల్లా, సాయికిషోర్, అఖిల్, మోహిత్‌షా, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## సోమశిలకు 44టిఎంసీలు

సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు 44 టిఎంసీలకు చేరుకుంది. ఈ మేరకు సోమశిల ఎస్ఈ సోమశేఖర్ సోమవారం తెలిపారు. జలాశయానికి 6362 క్యూసెక్కులు వరదనీరు వస్తుంది. జలాశయం నుంచి 2700 క్యూసెక్కుల నీరు బయటకుపోతుంది. అందులో 2500క్యూసెక్కులు కండలేరు జలాశయానికి, 200 క్యూసెక్కులు లీకేజీ ద్వారా పెన్నాకు పారుతోంది.

# బీజేపీ చేతిలో రాష్ట్ర భవిష్యత్

**భారతదేశ రాజకీయాలలో ఏ పార్టీ కూడా సొంతంగా ఎదగడం అంటూ వుండదు. అవతల పార్టీ చేసే పొరపాట్ల వల్లే ఇంకో పార్టీని ప్రజలు ఆదరిస్తుంటారు. అంటే ప్రజలు పళ్లూడగొట్టుకోవడానికి ఏ రాయి అయితేనేం అనే సిద్ధాంతాన్ని త్రికరణశుద్ధిగా అనుసరిస్తారన్న మాట. అధికారంలో వున్న ఏ ప్రభుత్వమైనా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుంటే దేశంలో గాని, రాష్ట్రంలోగాని ఇంకో పార్టీ అవసరమేముంటుంది.**

అధికారపక్షం చేసే తప్పులనే ప్రతిపక్షం తనకు అనుకూలంగా మలచుకోవాలి. ఒక పార్టీ స్థానంలో ఇంకో పార్టీ బలపడాలంటే ఇదే ప్రాథమిక సూత్రం. ఇలాంటి అవకాశమే ఈరోజు రాష్ట్ర రాజకీయాలలో భారతీయ జనతాపార్టీ ముందుందన్నది ఆ పార్టీ నేతలు గ్రహించాల్సిన నగ్నసత్యం.

ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ప్రభావం నామమాత్రం. ఈ రాష్ట్రంలో ఒక పెద్ద పార్టీగా అవతరించగలమనే ఆశ కూడా వారికి లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్, తెలుగుదేశం, ప్రస్తుత పరిస్థితుల్లో వైకాపా, టీఆర్ఎస్‌లే ప్రధాన పార్టీలుగా వుంటున్నాయి. రాష్ట్రంలో వామపక్షాలెంతో బీజేపీదీ అదే స్థాయి.

కాని కాంగ్రెస్‌పార్టీ తీసుకున్న రాష్ట్ర విభజన నిర్ణయంతో రాష్ట్రంలో రాజకీయాలే తలక్రిందులయ్యే పరిస్థితి వచ్చింది. కాంగ్రెస్ వ్యూహం ప్రకారం రాష్ట్రవిభజన జరిగితే ఆ పార్టీ లాభపడుతుంది. అయితే ఈ విభజన విషయంలో బీజేపీ పెద్దన్న పాత్రను పోషిస్తే కాంగ్రెస్ అంచనాలు తలక్రిందులై, వివిధ పార్టీల భవిష్యత్ కూడా తారుమారవుతుంది.

ముందు రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ ఎందుకింత మొండిగా వ్యవహరిస్తుంది, వారు ఆశిస్తున్నదేంటనేది చూద్దాం... కేంద్రంలో రెండుసార్లు మెజార్టీ సీట్లు అందించిన ఆంధ్రప్రదేశ్‌ను చీల్చాలనేంత మూర్ఖత్వం వాళ్లకెందుకొచ్చిందంటే చాలా సులభంగా సమాధానం దొరుకుతుంది. సీమాంధ్రలో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత పెరిగింది. జగన్ పట్ల క్రేజ్ పెరిగింది. వైకాపానే ఇక్కడ మెజార్టీ సీట్లు సాధించే అవకాశముంది. కాబట్టి ఈ ప్రాంతం మీద కాంగ్రెస్ నమ్మకాన్ని పెట్టుకోలేదు. ఇక తెలంగాణలో చూస్తే టీఆర్ఎస్ బలంగా వుంది. రాష్ట్ర విభజనపై ఏ నిర్ణయం తీసుకోకపోవడం వల్ల కాంగ్రెస్‌పై వ్యతిరేకత వుంది. కాంగ్రెస్ ఇక్కడే ఆలోచించింది. 42లోక్‌సభ స్థానాలున్న ఏపిలో కనీసం సగం సీట్లన్నా రానిదే రేపు కేంద్రంలో అధికారం కష్టం. అందుకే తన కసాయి రాజకీయ వ్యూహాలకు పదును పెట్టింది. తెలుగుదేశం, వైకాపాలు విభజన జోలికిపోదులే అని గుడ్డి నమ్మకంతో విభజనకు అనుకూలమేనంటూ ఇచ్చిన లేఖలను అడ్డం పెట్టుకుని అడ్డంగా కసాయితనంగా రాష్ట్ర విభజన నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ రాజకీయ లబ్ధి కోసం తీసుకున్న నిర్ణయమిది. వైకాపా, తెలుగుదేశంలు లేఖలు ఇవ్వకపోయివున్నా ఈ సమయంలో కాంగ్రెస్ ఇదే నిర్ణయం తీసుకుని వుండేది. తెలంగాణలో టీఆర్ఎస్‌ను విలీనం చేయాలనేది ముందస్తు ఒప్పందం. ఈ ప్రకారమే రాష్ట్ర విభజన జరగబోతుంది. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందగానే కాంగ్రెస్‌లో టీఆర్ఎస్‌ను విలీనం చేస్తామని కేసీఆర్ చెబుతున్నాడు. దీన్నిబట్టి విభజన తర్వాత జరిగే ఎన్నికలలో టీఆర్ఎస్ విలీనమైతే కాంగ్రెస్‌కే మెజార్టీ ఎంపీ సీట్లు రావచ్చు. అయితే అక్కడ వున్నది 17సీట్లు, మొత్తం క్లీన్‌స్వీప్ చేసే పరిస్థితి వుండదు. తెలుగుదేశం, ఎంఐఎం బీజేపీలు కూడా తలా ఒకట్రెండు సీట్లు సాధించుకోవచ్చు. అలాగే సీమాంధ్రలో వైకాపాకు మెజార్టీ ఎంపీ సీట్లు వస్తాయి. వాళ్లు ఎలాగూ బీజేపీకి మద్దతు తెలపలేరు. ఆరోజుకు విభజన జరిగిపోయి ఉద్రిక్తతలు తగ్గుతాయి కాబట్టి వైకాపా కూడా కేంద్రంలో తమకే మద్దతునిస్తుందనేది కాంగ్రెస్ ఆలోచన.

కమలనేతలు కీలకనిర్ణయం తీసుకుంటే రాష్ట్రంలో అన్ని పార్టీల అంచనాలు తలక్రిందులైనట్లే!

కాంగ్రెస్ గేమ్‌ప్లాన్‌ను సమూలంగా మార్చగలిగే శక్తి ఇప్పుడు ఒక్క బీజేపీ చేతిలోనే వుంది. అదెలాగో చూద్దాం... ప్రత్యేకతెలంగాణ ఇచ్చినంత మాత్రాన, దానికి మద్దతు పలికినంతమాత్రాన తెలంగాణలో బీజేపీ అనూహ్యంగా బలపడదేమీ లేదు. కొంచెం ఓట్లు పెరగతాయి తప్పితే సీట్లు పెరగవు. అక్కడి ప్రజలలో తెలంగాణ ఇచ్చిన ఖ్యాతి కాంగ్రెస్‌కు దక్కుతుంది. తెచ్చిన ఖ్యాతి టీఆర్ఎస్‌కు దక్కుతుంది. బీజేపీకి ఒట్టి ఆయాసమే మిగులుతుంది.

కాని సీమాంధ్రలో రాజకీయ పరిస్థితి భిన్నంగా వుంది. రాష్ట్ర విభజనపై ప్రజలు భగ్గుమంటున్నారు. కనీసం సీమాంధ్రకు ఎలా న్యాయం చేస్తారో చెప్పన్నా విభజించమంటున్నారు. తెలుగుదేశం, వైకాపాలు లేఖలిచ్చి తప్పుచేసాయి. ప్రజలు వాటిని కూడా నిందిస్తున్నారు. కాంగ్రెస్‌పార్టీ ఏకపక్షంగా వ్యవహరిస్తుంది. తమ పక్షాన నిలబడే రాజకీయపక్షం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఈ విభజన ప్రక్రియను ఏ రాజకీయపక్షమైతే అడ్డుకోగలుగుతుందో ఆ పార్టీ పట్ల ప్రజలు ఆదరణ చూపించే అవకాశాలున్నాయి. పూర్తిగా విభజనను అడ్డుకోలేకపోయినా... ఏకపక్ష విభజనను అడ్డుకుని సీమాంధ్రకు న్యాయం చేస్తే చాలు.

అలా చేయగలిగే శక్తి ఒక్క బీజేపీకి మాత్రమే వుంది. సీమాంధ్రలో తలెత్తిన సంక్షోభం సద్దుమణిగాకే, సమస్యలను పరిష్కరించాకే పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టాలని ఆ పార్టీ ఒక్క ప్రకటన చేస్తే చాలు... ముందు సీమాంధ్రలో ఆందోళనలు తగ్గుతాయి. ఏకపక్షంగా విభజన జరగదు, మాకు అన్యాయం జరగదనే ఒక నమ్మకం సీమాంధ్రులకు ఏర్పడుతుంది. రాజకీయంగా కూడా సీమాంధ్రలో బీజేపీ పట్ల సానుభూతి పెరుగుతుంది. ఈరోజు సీమాంధ్రలో కాంగ్రెస్ పూర్తిగా చచ్చినట్లే! ఆ పార్టీ నాయకులు రాజకీయంగా అనాథలయ్యే పరిస్థితి. వైకాపాలో ఖాళీలులేవు. తెలుగుదేశంలోకి పోయి ఇమడలేరు. ఇలాంటి నాయకులంతా బీజేపీ వైపు పరుగులు తీసే అవకాశాలున్నాయి. తెలుగుదేశం కూడా బీజేపీతో పొత్తు కోరుతుంది కాబట్టి సీమాంధ్రలో వారి పరిస్థితి మెరుగుపడుతుంది. రాయపాటి, లగడపాటి వంటివాళ్లు ఇప్పటికే బీజేపీని ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. బీజేపీ అదనంగా మరో రాష్ట్రంలో తన శక్తిని పెంచుకోవడానికి ఇదే అనువైన సమయం. ఇక్కడ బీజేపీ తెలంగాణ హామీ నుండి వెనక్కి తగ్గాల్సిన పని కూడా లేదు. తెలంగాణకు కట్టుబడే సీమాంధ్రలో బలపడొచ్చు. కాకపోతే చేయాల్సిందల్లా సమస్యలు పరిష్కరించాక తెలంగాణ బిల్లును పార్లమెంట్‌కు తెమ్మని చెప్పడమే.

సమస్యలు పరిష్కరించేంత సమయం, ఆందోళనలు విరమింపజేసేంత ఓపిక కాంగ్రెస్‌కు లేవు. సీట్లు, ఓట్లు కోసం వాళ్లు అదరాబదరా తెలంగాణ బిల్లు ఆమోదింపజేయాలనుకుంటున్నారు. దానిని బీజేపీ బ్రేక్ చేయాలి. ఉద్రిక్తతల మధ్య ఏ బిల్లునూ ఆమోదించవద్దని గత పార్లమెంట్ సమావేశాలలోనే అద్వానీ చెప్పివున్నారు. ఇప్పుడు తెలంగాణ బిల్లు విషయంలోనూ అలాంటి ఉద్రిక్త వాతావరణమే వుంది. కాబట్టి బీజేపీ ఉద్రిక్తతల మధ్య బిల్లు ఆమోదించకూడదనే స్టాండ్ తీసుకుంటే ఈ ఎన్నికల్లోపు తెలంగాణ రాదు. అప్పుడేం అవుతుంది...

సీమాంధ్రలో కాంగ్రెస్ చచ్చూరుకుంటుంది. తెలంగాణలోనూ ఆ పార్టీకి ఓట్లు పడవు. టీఆర్ఎస్ విలీనం లేకుండా సొంతంగా పోటీ చేస్తుంది కాబట్టి తెలంగాణ సెంటిమెంట్ ఓటు టీఆర్ఎస్‌కే పడుతుంది. కాంగ్రెస్ రెండు ప్రాంతాలలోనూ నష్టపోతుంది. బీజేపీ తెలంగాణలో కంటే సీమాంధ్రలో అనూహ్యంగా బలపడుతుంది. రాష్ట్రంలో ఏ పార్టీకి సంపూర్ణ మెజార్టీ వచ్చే అవకాశముండదు. కాబట్టి బీజేపీ క్రియాశీలకంగా మారుతుంది. ఒకవేళ రేపటి ఎన్నికల తర్వాత బీజేపీయే అధికారంలోకి వస్తే తెలంగాణకు కట్టుబడి ఇరు ప్రాంతాల వారితో చర్చించి, సమస్యలు పరిష్కరించి సానుకూల వాతావరణంలో తెలంగాణను ఏర్పాటు చేయడానికి వారికి బోల్డంత సమయం దొరుకుతుంది. అప్పుడు తెలంగాణ ఇచ్చిన ఖ్యాతి కూడా బీజేపీకే దక్కుతుంది. ఈ ప్లాన్‌తో కాంగ్రెస్ రెండు ప్రాంతాలలో కనుమరుగైతే, బీజేపీ రెండు ప్రాంతాల్లో బలపడుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ఇదో మంచి అవకాశం. ప్రజల మనోభావాలను ఆ పార్టీ గౌరవిస్తే ప్రజలు కూడా ఆ పార్టీని గుర్తించి, ఆదరించడానికి సిద్ధంగావున్నారు. ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర నేతలు ఈ విషయంపై విజ్ఞతతో ఆలోచించాల్సివుంది.

## ప్రజలకు విద్రోహులు

(2వ పేజీ తరువాయి)

కనిపించలేదు. రాష్ట్ర విభజన నిర్ణయం వెలువడ్డాక అసలు ప్రజల ముందుకు, కనీసం మీడియా ముందుకు కూడా రావడం మానేసారు. పనబాక లక్ష్మికి రాజకీయభిక్ష పెట్టింది నెల్లూరు ప్రజలు. వారు ఆదరించబట్టే ఆమె ఇక్కడనుండి మూడుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. నాలుగోసారి బాపట్ల ప్రజలు ఆమెను ఎంపీగా గెలిపించారు. ఇక్కడ ఎంపీగా గెలవబట్టే ఆమె రెండుసార్లు కేంద్రంలో మంత్రికాగలిగింది. నెల్లూరులోను, తెనాలిలోనూ ఉవ్వెత్తున సమైక్యాంధ్ర ఉద్యమం జరుగుతుంది. ఆమెకు ఓట్లేసిన ప్రజలే ఆకలి, నీళ్లు మాని ఉద్యమాలు చేస్తున్నారు. పనబాకకు చీమ కుట్టినట్లు కూడా లేదు. రాజీనామా కాదు కదా అసలు ఈ వైపే చూడడం మానుకుంది. ఓట్లేసిన జనం కంటే జనపథ్‌నే నమ్ముకుంది. ఇక జనం తనను గెలిపించరని ఆమె అనుకుంటుంది. అందుకే టెన్ జనపథ్‌ను నమ్ముకుంటే ఇంకోరకంగా పదవులు వస్తాయనే భ్రమలో వుంది. ప్రజాఉద్యమాలలో పాల్గొనకపోయినా, దానిని ఎగదోయకుంటే మేలు. కాని పనబాక లక్ష్మి ఆ విధంగా కూడా చేయడం లేదు. తాను విభజన వాదినని, ప్యాకేజీ కావాలంటే అడుక్కోండంటూ ఆగ్రహంతో వున్న ప్రజలను మరింత రెచ్చగొట్టింది.

తిరుపతి ఎంపీ చింతా మోహన్ అడ్రస్ దొరకడం లేదు. రాష్ట్ర విభజన నిర్ణయాన్ని ఈయన కూడా ఏ దశలోనూ వ్యతిరేకించలేదు. కాబట్టి పదవిని వదులుకునే ఉద్దేశ్యంలో లేడు. ఈయనకు రాజకీయ భవిష్యత్‌నిచ్చింది తిరుపతి, నెల్లూరు ప్రజలు. ఆ ప్రజలు ఈరోజు ఆందోళనలో వుంటే కనీసం వారిని శాంతింపజేసే ప్రయత్నం కూడా చేయడం లేదు.

ఇలాంటి వారిని ఎన్నుకున్నందుకు తమ చెప్పులతో తమనే కొట్టుకోవాలన్నంత కసితో ప్రజలున్నారు.

## బుల్లెట్టు...!

(2వ పేజీ తరువాయి)

ప్రతినిధిగా అదే ఊపుతో మాట్లాడేవాడు. చంద్రబాబు రాష్ట్ర విభజనకు అనుకూలంగా లేఖ ఇచ్చాక సోమిరెడ్డి వాయిస్ తగ్గించే ప్రయత్నం జరిగింది. చంద్రబాబే ఆయనను ఆ విధంగా తగ్గమన్నాడు. కాని జరుగుతున్న పరిస్థితులను చూస్తూ సోమిరెడ్డి మౌనంగా వుండలేకపోతున్నాడు. రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్‌పై నిప్పులు చెరుగుతూ సీమాంధ్రలో తెలుగుదేశం కేడర్‌కు దిక్సూచిలా మారాడు.

## అధిష్ఠానమా? ప్రజాభీష్టమా?

(2వ పేజీ తరువాయి)

ఇంకోరకంగా ఏక్కుతారు. కాకపోతే కాంగ్రెస్ అధిష్టానం పట్ల చూపే విధేయత భవిష్యత్‌లో ఆనం రాజకీయ ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. సమైక్యాంధ్ర ఉద్యమ నేపథ్యంలో బొత్స మీద అంత కాకపోయినా ఆనం సోదరుల మీద కూడా ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. సమైక్యాంధ్రకు మద్దతుగా ఆనం రాజీనామా చేయలేదనే వీరి కోపం. దీనిని కవర్ చేసుకునేందుకే ఆనం వివేకా సమైక్య ఆందోళనలను నడుపుతున్నాడు. ప్రజలకు దిగ్విజయ్‌సింగ్ పిచ్చిమాటలతో మండిపోతుంది. కాబట్టి దిగ్విజయ్‌సింగ్‌ను టార్గెట్ చేసుకుని వివేకా ఈమధ్య ఘాటుగానే విమర్శలు చేసాడు. దిగ్విజయ్‌ను రాష్ట్రంలో ఏ కాంగ్రెస్ నాయకుడూ విమర్శించలేదు. కాని వివేకా పత్రికా ముఖంగానే తిట్టాడు. దిగ్విజయ్‌సింగ్ సోనియా నమ్మినబంటు. ఆమె అనుమతి వుండబట్టే ఇతను రాష్ట్ర విభజన విషయంలో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడు. ఓ పక్క కాంగ్రెస్ అధిష్టానం పట్ల విధేయత చూపుతూ మరోపక్క అదే అధిష్టానం పంపిన దూతను ఘాటుగా తూర్పారబట్టడం ఒక్క ఆనంకే చెల్లుతుందేమో!

## ఎక్కడ...?

(2వ పేజీ తరువాయి)

సీటున్న దానిని వైకాపాలో ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్యేసీట్లకు పెంచుకున్నారు. నెల్లూరు లోక్‌సభకు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఉదయగిరి అసెంబ్లీకి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆత్మకూరుకు మేకపాటి గౌతంరెడ్డిలు ఇన్‌ఛార్జ్‌లు.

ఆత్మకూరు సమన్వయకర్తగా నియమితుడయ్యాడనేగాని ఇంతవరకు గౌతంరెడ్డి ఆ నియోజకవర్గంలో అడుగు పెట్టలేదు. పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకోలేదు. పార్టీ సభలు జరపలేదు. పార్టీ కార్యక్రమాలలో పాల్గొనలేదు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు సమైక్యాంధ్ర ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. కనీసం ఒకరోజన్నా అటొచ్చి ఆందోళనలకు మద్దతు పలకలేదు. ఈ నెల 2వ తేదీన సమైక్యాంధ్ర కోరుతూ సీమాంధ్రలోని 175నియోజకవర్గాలలో సమన్వయకర్తలందరూ నిరాహారదీక్షలు చేయాలని జగన్ పిలుపునిచ్చారు. అన్ని చోట్లా సమన్వయకర్తలు కూర్చున్నారు. ఆత్మకూరులో మాత్రం సమన్వయకర్త గౌతంరెడ్డి లేడు. ఆయన బదులు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి కూర్చున్నారు. ఇంత మాత్రం దానికి సమన్వయకర్తగా వుండడమెందుకు?

## కాలధర్మం

### డా॥ ఎస్.వి.నరసింహులు



నెల్లూరులో ఎంసెట్ కోచింగ్‌కు పునాది వేసిన కోరా కాలేజ్ వ్యవస్థాపకులలో ఒకరైన డికెడబ్ల్యూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.వి.నరసింహులు ఈ నెల 10వ తేదీ గురువారం కన్నుమూసారు. ఆయన వయసు 67సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. రాపూరు ఆయన స్వగ్రామం. పదో తరగతి వరకు రాపూరులో, ఇంటర్, బీఎస్సీ కావలి విశ్వోదయలో పూర్తి చేసారు. ఎస్వీ యూనివర్శిటీలో ఎంఎస్సీ పట్టాపొం..., విశాఖలోని ఆంధ్రా యూనివర్శిటీలో పిహెచ్‌డి పూర్తి చేసారు. శ్రీకాకుళం, గూడూరు, విడవలూరు, కందుకూరు ప్రభుత్వ కాలేజీలలో లెక్చరర్‌గా పనిచేసారు. నెల్లూరు డికెడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ విరమణ చేసారు. మంచి ఉపన్యాసకుడు, బహుభాషాకోవిదుడు. నటనపట్ల ఆసక్తి వుండేది. 'కో... కాలేజీ ద్వారా ఎంతోమంది విద్యార్థులను డాక్టర్లు, ఇంజనీర్లుగా తీర్చిదిద్దిన మేథోగని ఆయన. నరసింహులు మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

PDF Compressor Free Version

PDF Compressor Free Version



# గూడూరు డివిజన్ వార్తలు

## ప్రతిఒక్కరిలో సేవాదృక్పథం రావాలి

### ఆర్డీవో మధుసూదన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్టు వ్యవస్థాపకులు హరిచంద్రారెడ్డి

సమైక్యాంధ్ర కోసం నాల్గోతరగతి ఉద్యోగులు చేస్తున్న ఉద్యమానికి కనుమూరు హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సాయం అభినందనీయమని ఆర్డీఓ మధుసూదన్ రావు అన్నారు. జీతాలు ముఖ్యం కాదని, జీవితాలే ముఖ్యమని నాల్గోతరగతి ఉద్యోగులుచేస్తున్న ఉద్యమానికి చేయూతగా ఈ నెల 6వ తేదీన హరిచంద్రారెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఎన్జీఓ హోమ్‌లో 140మంది ఉద్యోగులకు లక్షాయాభైవేల రూపాయలు విలువచేసే బియ్యం, సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మధుసూదన్‌రావు మాట్లాడుతూ గత 65రోజులుగా సమైక్యాంధ్ర కోసం అన్ని తరగతుల ఉద్యోగులు పోరాడుతున్నారన్నారు. ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అందరూ కలిసి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారని, అలాకాకుండా తమిళనాడులో లాగా అన్ని ప్రాంతాల్లో ఉన్న ముఖ్యమైన నగరాలను అభివృద్ధి చేసివుంటే రాష్ట్రాన్ని విభజించినా అంత ఇబ్బంది ఉండేది కాదన్నారు. అలాగే రాష్ట్ర విభజన జరిగితే రాబోయే రోజుల్లో సాగు, తాగునీటి కోసం సీమాంధ్ర ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. ఉద్యమంలో ఉన్న నాల్గోతరగతి ఉద్యోగులకు చిన్నసాయం అందిస్తున్నానని, ఉద్యమంలో పాల్గొంటున్న అందరికీ తన అభినందనలు తెలుపుతున్నానన్నారు. అనంతరం ట్రస్టు ఛైర్మెన్ కె.మునిగిరీష్, జేఏసీ నాయకులు మస్తానయ్య, దశరథరామిరెడ్డి, ఓబులేశు, రాజేంద్ర, శివకుమార్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శెనగల వెంకట్రావు, దయాకరరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మునిభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రిలేదీక్షలో టీడీపీ



దీక్షా శిబిరంలో ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు, ప్రక్కన చేవూరి విజయమోహన్‌రెడ్డి

గూడూరు టవర్‌క్లాక్ వద్ద సమైక్యాంధ్రకు మద్దతుగా రిలే దీక్షలను 7వ తేదీన టీడీపీ ఆధ్వ ర్యంలో ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు చేపట్టారు. అంతకుముందుగా పంచాయతీరాజ్ అతిథిగృహం నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీ నిర్వహించి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దీక్షా శిబిరానికి చేరుకొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన ప్రకటన వచ్చినప్పుడే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామాచేసి సమైక్యాంధ్ర కోసం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రాస్తారోకోలు, వంటా వార్పు, మోటార్‌బైక్ ర్యాలీలతో పాటు పలు ఆందోళనలు చేపట్టామన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగఫలంతో ఏర్పడ్డ తెలుగుజాతిని ఓట్ల రాజకీయాల కోసం విభజించడం తగదన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగు ప్రజలంతా ఒక్కటిగానే ఉండాలని ఆకాంక్షించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చేవూరి విజయమోహన్‌రెడ్డి, బల్లి కళ్యాణ్, పల్లంపర్తి మధుసూధన్‌రెడ్డి, దొడ్ల నాగరాజు, కొండూరు వెంకటేశ్వరరాజు, పాపయ్య, పారిచర్ల రామచంద్రయ్య, కోటంరెడ్డి రాధా కృష్ణారెడ్డి, మాజీకౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, పువ్వలపల్లి వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మైనంపాటి మోహన్, రమేష్ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాలిపోయిన 'రియల్‌స్టార్'

మూ'వీ'క్షణం



విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హీరోగా, ఏ పాత్రలోనైనా రాణించి ప్రేక్షకులను రంజింపజేసే నటుడుగా పేరు తెచ్చుకున్న 'రియల్‌స్టార్' శ్రీహరి ఇక లేరు. తెలుగు సినీపరిశ్రమకు వీడ్కోలు పలుకుతూ తెలుగు ప్రేక్షకుల మనసుల్లో బాధను రగిల్చి ఈ లోకాన్ని వీడి ఆయన దైవసన్నిధి చేరారు. గత కొంతకాలంగా కాలేయ క్యాన్సర్‌తో బాధపడుతున్న శ్రీహరి 9వ తేదీ బుధవారం సాయంత్రం ముంబైలోని లీలావతి ఆసుపత్రిలో కన్నుమూసారు. ముంబైలో ఓ షూటింగ్‌లో ఆయన నటిస్తుండగా అకస్మాత్తుగా అస్వస్థతకు గురికావడంతో లీలావతి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన కన్నుమూసారు. శ్రీహరికి భార్య డిస్కోశాంతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆరునెలల వయస్సులో మరణించిన కూతురు అక్షర పేరిట సేవాసంస్థను ఏర్పాటుచేసి ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 1986లో దాసరి నారాయణ రావు ద్వారా 'పృథ్వీపుత్రుడు' చిత్రంతో ఆయన తెలుగుతెరకు పరిచయమయ్యాడు. పోలీస్ పాత్రలో ఇట్టే ఒదిగిపోయే శ్రీహరి సినీకెరీర్‌లో 'అయోధ్యరామయ్య', 'భద్రాచలం', 'ఒక్కడే', 'మహాలక్ష్మి', 'ఢీ', 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా', 'బృందావనం', 'కింగ్', 'మగధీర' వంటి చిత్రాలు ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి. రామ్‌చరణ్ నటించిన 'తుఫాన్' చిత్రంలో ఆయన చివరిసారిగా తెరపై కనిపించారు. శ్రీహరి హఠాన్మరణంతో తెలుగు సినీపరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

## ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని పాలకులు



విలేకరులతో మాట్లాడుతున్న ఎల్లసిరి గోపాల్‌రెడ్డి

రాష్ట్ర విభజన ప్రకటన వెలువడినప్పటి నుంచి సీమాంధ్ర ప్రజలు రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నా పాలకులు పట్టించుకోక పోవడం దారుణమని వైయస్సార్సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం టవర్ క్లాక్ దగ్గర ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత రెండునెలలుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ కార్మికులు జీతాలు తీసుకోకుండా భావితరాల భవిష్యత్ కోసం పోరాడుతుంటే ఎంపీలు, మంత్రులు తమకు పదవులే ముఖ్యమంటున్నారన్నారు. విద్యుత్‌శాఖ ఉద్యోగుల మెరుపు సమ్మెతో రాష్ట్రం అంధకారంగా మారిపోయిందన్నారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలు, కేంద్రమంత్రులు సీమాంధ్ర ప్రజల మనోభావాలను తెలుసుకోకుండా సోనియాగాంధీ ఇంటి వద్ద పెంపుడు జంతువులుగా మారారన్నారు. పార్టీ పిలుపు మేరకు నవంబర్ 2వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరై ఆందోళనలు విజయవంతం చేయాలని కోరారు. గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చెంతాటి బాలచెన్నయ్య మాట్లాడుతూ సమైక్య రాష్ట్రం కోసం పార్టీలకతీతంగా జెండాలను పక్కనపెట్టి ప్రతిఒక్కరూ కలిరావాలన్నారు. సమైక్యాంధ్రకు మద్దతుగా హైదరాబాద్‌లో జగన్ చేపట్టిన దీక్షకు ప్రజల నుంచి అనూహ్యస్పందన వస్తుందని తెలిపారు. వారితో పాటు పట్టణ అధ్యక్షుడు నాశిన నాగులు, నాయకులు రాజారెడ్డి, మాజీకౌన్సిలర్లు బొమ్మిడి శ్రీనివాసులు, ఎంబేటి చంద్రయ్య, మధురెడ్డి, అశోక్ గజపతిరాజు, మొహిద్దీన్, దామోదర్, విజయ్, అనిల్, సాయి, శ్రీను, మల్లిగౌడ్ వున్నారు.

## వివిధ అలంకారాల్లో అమ్మవార్లు



దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గూడూరులోని పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి, భువనేశ్వరీ దేవి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయాల్లో గాయత్రీదేవిగా, ద్రౌపది సమేత ధర్మరాజు స్వామి దేవస్థానంలో అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. అక్షునాథస్వామి వీధిలోని సాయిసత్సంగ నిలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. సొసైటీ ప్రాంతంలోని నారాయణమ్మ ఆలయంలో రాజరాజేశ్వరీ దేవిగా, బజారువీధిలోని అమ్మవారు చాముండేశ్వరిగా, గంగమ్మ ఆలయంలో బాల త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

## సమైక్యాంధ్ర ప్రకటన చేయాలి



రిలేదీక్షలో కూర్చొన్న జేఏసీ నాయకులు మేజర్ పొనకా శ్రీనివాసులురెడ్డి, మస్తానయ్య, రాజేంద్రప్రసాద్

గత 69రోజులుగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ కార్మికులు, విద్యార్థులు రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలని శాంతియుతంగా ఆందోళనలు చేపడుతున్నా కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని సమైక్యరాష్ట్ర పరిరక్షణ వేదిక నాయకులు అన్నారు. 7వ తేదీ టవర్‌క్లాక్ కూడలి వద్ద దీక్షాశిబిరంలో కూర్చొని వారు మాట్లాడుతూ రోజురోజుకు ఉద్యమం ఉధృతమవుతుందే తప్ప వెనక్కు తగ్గే ప్రసక్తే లేదన్నారు. విద్యుత్ శాఖాధికారులు మెరుపు సమ్మెతో రైళ్లు ఆగిపోవడంతో కొంతవరకు రాష్ట్రానికి, కేంద్రానికి సమైక్యసెగ తగిలిందన్నారు. ఇప్పటికైనా స్పందించి సమైక్యాంధ్ర ప్రకటన చేయాలని, లేదంటే రాష్ట్రం అంధకారంగా మారుతుందన్నారు. అమలాపురం ఎంపీ హర్ష కుమార్ తనయులు సమైక్యవాదులపై దాడిచేసిన కేసులను నీరుగార్చేందుకు పోలీసులు ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మస్తానయ్య, వేగూరు రాజేంద్ర ప్రసాద్, యేకుల రవిచంద్ర, ఎంపిడిఓ జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఓబులేసు, దశరథరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, మేజర్ పొనకా శ్రీనివాసులురెడ్డి, నీలం రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. దీక్షకు మద్దతుగా శ్రీ స్వర్ణాంధ్ర భారతి జూనియర్ కాలేజీ విద్యార్థులు ర్యాలీగా సభ వద్దకు చేరుకొని మానవహారంగా నిలబడ్డారు.




దీక్షకు మద్దతు తెలిపేందుకు ర్యాలీగా వస్తున్న స్వర్ణాంధ్రభారతి విద్యార్థులు

## నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా విద్యుత్ ఉద్యోగులు సమ్మెకు పిలుపునివ్వడంతో 6వతేదీ ఉదయం నుంచి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. విద్యుత్ సరఫరా లేక పోవడంతో తాగునీరు లేక గూడూరు పట్టణ ప్రజలు అవస్థలు పడ్డారు. వాటర్‌క్యాన్ల ద్వారా నీళ్లు తెప్పించుకొని తాగారు. కాగా సమైక్యాంధ్ర ఉద్యమంలో విద్యుత్ జేఏసీ నాయకులు కూడా పాలుపంచుకోవడంతో బస్సులు నడవక రైళ్లలో ప్రయాణిస్తున్న వారికి కూడా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆదివారం ఉదయం గూడూరుకు చెన్నై వైపు నుంచి రావాల్సిన జనశతాబ్ది, విజయవాడ నుండి రావాల్సిన పినాకిని ఎక్స్‌ప్రెస్‌లను రద్దుచేశారు. నెల్లూరు నుంచి చెన్నై, చెన్నై నుంచి నెల్లూరుకు వచ్చే మెమూ రైళ్లు రద్దయ్యాయి. అలాగే అన్ని ప్యాసింజర్‌రైళ్లను కూడా రద్దు చేసినట్లు రైల్వేమేనేజర్ కుమార్ తెలిపారు.

PDF Compressor Free Version



# అదే ఉడుకు... అదే చురుకు...

• ఉద్యమంలో పట్టు తగ్గలేదు • ఉద్యోగులు మెట్టు దిగలేదు



1992 ప్రాంతంలో జిల్లాలో సారా వ్యతిరేకోద్యమం జరిగింది. ఇది దావానాలంలా రాష్ట్రమంతా వ్యాపించింది. నెల్లూరుజిల్లా కేంద్రంగా పుట్టిన సారా వ్యతిరేకోద్యమం అప్పుడు కాంగ్రెస్‌పార్టీనే కుప్పకూల్చింది. నెల్లూరుజిల్లా కేంద్రంగా ఏ ఉద్యమం జరిగినా దానిలో ఉడుకు ఉంటుంది. ఊపు వుంటుంది. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న సమైక్యాంధ్ర ఉద్యమం ఆనాటి సారా వ్యతిరేకోద్యమాన్ని మరిపిస్తుంది. సమైక్యాంధ్ర ఉద్యమం పురుడుపోసుకుని 70 రోజులు దాటింది. కాని ఉద్యమంలో తీవ్రత తగ్గలేదు, వాడి తగ్గలేదు, వేడి చల్లారలేదు. నగరం, పట్టణం, పల్లె అనే తేడా లేకుండా వూరూ వాడా ఏకమై సమైక్యపోరు సాగిస్తుంది.

జీతాలకంటే జీవితాలే ముఖ్యం.. మా జీవితాలు, మా బిడ్డల భవిష్యత్ సమైక్య రాష్ట్రంతోనే ముడిపడి వుందంటున్న ఎన్జీఓలు ఉద్యమంలో రాజీ పడడం లేదు. జీతాలు లేకున్నా సమైక్య ప్రకటన వచ్చే వరకు సమ్మె విరమించేది లేదంటున్నారు. ఎన్జీఓల సమ్మె యథావిధిగా సాగుతుండడంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ మూతపడే వున్నాయి. కేంద్రం కేబినెట్ నోట్‌ను ఆమోదించాక ఆందోళనలు మరింత తీవ్రతరమయ్యాయి. మూడురోజుల పాటూ నిర్వహించిన బంద్‌లతో జిల్లావ్యాప్తంగా జన జీవనం స్థంభించిపోయింది. విద్యుత్ ఉద్యోగుల మెరుపు సమ్మెతోనూ ప్రజలకు చీకట్లు, ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా వైకాపా, తెలుగుదేశం పార్టీల ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు, బైక్‌ర్యాలీలు, రాస్తా రోకోలు, ధర్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. సమైక్యాంధ్ర విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో జాతీయ రహదారుల దిగ్బంధం జరుగుతుండడంతో హైవేపై ప్రతిరోజూ ట్రాఫిక్ స్థంభించిపోతుంది. జిల్లా వ్యాప్తంగా కూడా నెల్లూరులో మాత్రమే కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సమైక్యఆందోళనలు కనిపిస్తున్నాయి. ప్రతిచోటా సోనియా, రాహుల్, దిగ్విజయ్, షిండే, పనబాక, కావూరి, చిరంజీవి, ఆనం రామనారాయణరెడ్డి, బొత్సల దిష్టిబొమ్మల దహనాలు నిత్యకృత్యంగా మారాయి. జిల్లా అంతటా గ్రామీణ ప్రాంతాలలో సైతం సమైక్య ఆందోళనలు నిర్వహిస్తున్నారు. పెద్దలు, వృద్ధులు, పిల్లలే కాకుండా రైతులు సైతం ఆందోళనలలో పాలు పంచుకుంటున్నారు. వివిధ సంఘాలు, వ్యాపార వర్గాలు, కుల సంఘాలు ఆందోళనల్లో పాల్గొంటున్నాయి.

## నెల్లూరుకు అశోక్‌బాబు

ఎటువంటి పరిస్థితుల్లో సమైక్యాంధ్ర ఉద్యమం ఆగదని ఏపీఎన్జీఓలు స్పష్టం చేసారు. బుధవారం నెల్లూరు, దర్గామిట్ట లోని ఎన్జీఓ భవన్‌లో సమైక్యాంధ్ర ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, కార్మిక ఐకాస నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఉద్యమ రోజుల తీరుతెన్నులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు రవీంద్రబాబు మాట్లాడుతూ 72రోజుల నుంచి ఉద్యమాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర విభజన నిర్ణయాన్ని చిల్లర అజెండాగా అభివర్ణించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర విభజన అసెంబ్లీలో అభిప్రాయానికి వస్తే ఎమ్మెల్యేలు తప్పకుండా అడ్డుకోవాలన్నారు. ఈనెల 16, 20 మధ్యలో ఏపీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు నెల్లూరు జిల్లాకు రానున్నారన్నారు.

# రాజధానిలో ఏ.పి ఎక్స్‌ప్రెస్



ఇప్పుడు రాష్ట్ర రాజకీయాలు ఢిల్లీ కేంద్రంగా నడుస్తున్నాయి. జాతీయ, రాజకీయ సమీకరణలకు రాష్ట్రం వేదికగా మారుతుంది. రాష్ట్ర విభజన అంశం ఢిల్లీలో జాతీయ పార్టీలకు ఒక ప్రచారాస్త్రంగా మారుతోంది. సమైక్యాంధ్రకు మద్దతుగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గౌరవాధ్యక్షురాలు వై.యస్.విజయమ్మ ఢిల్లీలో రాష్ట్రపతిని మొదలుకొని బీజేపీ, సీపీఎం, సీపీఐ, సమాజ్‌వాది, దళ్(యు) వంటి పార్టీల నేతలందర్నీ కలిసింది. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను వారి దృష్టికి తీసుకెళ్లింది. దీంతో ఢిల్లీ వర్గాలలో కదలిక వచ్చింది. సీమాంధ్ర సమస్యలపై ఢిల్లీ పార్టీలు మాట్లాడసాగాయి.

మరోపక్క సమన్యాయం చేయాలంటూ ఢిల్లీలోని ఏ.పి.భవన్ వద్ద తెలుగుదేశం అధినేత చంద్రబాబు చేపట్టిన దీక్షతో కూడా ఢిల్లీ రాజకీయాల్లో కలకలం రేగింది. పలువురు జాతీయ పార్టీల నాయకులు రావడం, చంద్రబాబుకు సంఘీభావం తెలపడంతో రాష్ట్ర విభజన అంశంపై ఒక చర్చ మొదలైంది. మొత్తానికి ఇరుపార్టీల నేతలు రాష్ట్ర విభజన సమస్యపై ఢిల్లీలో కదలిక తేగలిగారు.



అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము. ఆదివారం షాపు గలదు.

ఆహ్వానము

నెల్లూరు రూరల్, కనుపర్తిపాడులోని
విపిఆర్ కన్వెన్షన్‌సెంటర్ నందు
తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో, దేవస్థాన అర్చకులచే



శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవం

తే. 19.10.2013ది శనివారం సాయంత్రం 5గంటలకు నిర్వహించబడును.

పై కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షములకు పాత్రులై
తీర్థప్రసాదములు స్వీకరించవలసిందిగా మనవి.

మీ
వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా
తిరుమల తిరుపతి దేవస్థానముల అన్నమాచార్య ప్రాజెక్ట్
మాజీ కళాకారుడు
శ్రీ పారుపల్లి రంగనాథ్ మరియు
శ్రీమతి బాలార్క వారి శిష్యబృందంచే
అన్నమాచార్య సంకీర్తన జరుగును.

అందరూ ఆహ్వానితులే.
ఉచిత పాసుల కొరకు
దిగువ నెంబర్ల నందు సంప్రదించి పొందగలరు.
94926 87680 99639 12777
94404 25225 98663 14741

Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2322485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.